

ఏచూరికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, బీవీ రాఘవులు, తమ్మినేని



ఏచూరి రచించిన క్యాస్ట్ అండ్ క్లాస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 22-09-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 264 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

స్నేహం, సిద్ధాంతం, సహజత్వం, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమాజ ఉద్యమ చైతన్యం, అభ్యుదయం, ఆచరణల అంతిమ విజయం మార్క్సిజం. ఇదే సీతారాం ఏచూరి మనకిచ్చిన సందేశం. దేశంకోసం జీవితంతో పాటు దేహాన్నీ ఇచ్చేసిన ధీశాలి. ఆ వీరుడికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. ఏమని నివాళులు అర్పించగలం. మార్క్సిజమే శ్వాసగా, జీవితమే సందేశంగా, మతోన్మాద, ఫ్యూడల్ శక్తుల కట్టడే లక్ష్యంగా భవిష్యత్ తరాలకు దిశానిర్దేశం చేసిన వ్యూహకర్త సీతారాం ఏచూరి. నిత్యం తన భావజాల వ్యాప్తిని, కమ్యూనిస్టు చైతన్య స్ఫూర్తిని మనలో రగిలిస్తూ, కదిలిస్తూ, కలిసి నడుస్తూ, కదనరంగంలోకి అడుగిడుతూ ఎప్పుడూ మన మధ్యే, మనందరితోటే 'కామ్రేడ్' అనే పిలుపులో మనల్ని పలకరిస్తూనే ఉంటాడు! పార్టీ లకు, రాజకీయాలకు అతీతంగా 'అందరివాడు'గా నిలిచిన సీతారాం ఏచూరి సంస్మరణ సభకు వేదికైన రవీంద్రభారతి భావోద్వేగంతో గద్గదమై, జోహార్ల నినాదాలతో మార్మోగింది. అప్పడే సభికుల్లోనుంచి ఎవరో ఎలుగెత్తి గాండ్రించారు... "ఎవడ్రా మార్క్సిజం అంతమైందన్నది" అని...జోహార్ కామ్రేడ్ ఏచూరి...

సీతారాం ఏచూరి మరణం భారత రాజకీయాలకే తీరని లోటు

ఆయన స్ఫూర్తితో 'జమిలీ'ని తిప్పికొడదాం

బీజేపీ ప్రమాదాన్ని నిలువరిద్దాం : సీఎం రేవంత్‌రెడ్డి

లౌకిక, ప్రజాస్వామ్య విలువల శిఖరం ఏచూరి

దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే ఆయనకు మనమిచ్చే నివాళి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

జీవితమే కాదు, దేహాన్ని కూడా దేశానికే అర్పించిన నేత : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఏచూరికి ఘన నివాళులర్పించిన నేతలు, వామపక్ష శ్రేణులు

ఉద్యమాల సూరీడు

మళ్లీ ఉదయిస్తాడు



కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభలో నేతల భావోద్వేగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకే కాదు దేశ రాజకీయాలకు తీరనిలోటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జమిలి ఎన్నికల ముసుగులో బీజేపీ దేశాన్ని కబళించాలని చూస్తున్న తరుణంలో ఏచూరిలాంటి వ్యక్తి లేకపోవడం ప్రజాస్వామ్యానికి, లౌకికత్వానికి, అభ్యుదయవాదులకు తీరని నష్టమన్నారు. గతంలో యునైటెడ్ ఫ్రంట్, యూపీఏ-1 ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో, ఆయా సందర్భాల్లో ప్రజానుకూల నిర్ణయాలను తీసుకురావడంలో ఆయన పాత్ర ఎనలేనిదని కొనియాడారు. విద్యాహక్కుచట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం లాంటి ఎన్నో ప్రజలకు ఉపయోగపడే పథకాలు, కార్యక్రమాలను రూపొందించడంలో సీతారాం క్రియాశీలకపాత్రను పోషించారని గుర్తు చేశారు. ఆయా సందర్భాల్లో ప్రభుత్వాలతో, కూటమిలోని పార్టీలతో సైద్ధాంతికంగా విభేదించినప్పటికీ ప్రజానుకూల నిర్ణయాలను తీసుకురావడంలో అందరినీ ఒప్పించి మెప్పించి వాటిని ఆచరణలో అమలు చేయించిన ఘనత ఏచూరికే దక్కుతుందని ప్రశంసించారు. ఆయన స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గాంధీ కుటుంబంతో ఆయనకు మంచి సంబంధం ఉందన్నారు. రాహుల్‌గాంధీకి మార్గదర్శకులుగా వ్యవహరించారని చెప్పారు. మార్క్సిస్టు మేధావి, సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నిర్వహించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,

...14లో

విభేదాలున్నా విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చారు : రాఘవులు



దేశంలోని విపక్ష పార్టీల మధ్య ఎన్ని తేడా లున్నా, విభేదాలున్నా ఆమోద యోగ్యమైన విష యాలపై కలిసి పని చేయాలంటూ వాటిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత సీతారాం ఏచూరికే దక్కుతుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. దేశానికి ప్రజా స్వామ్యం ఎంతో అవసరమనీ, దానికి బీజేపీ పాలనలో ప్రమాదం వచ్చిందన్నారు. లౌకిక వ్యవస్థకు భంగం కలుగుతున్నదని చెప్పారు. 1947 నుంచి ఇప్పటి వరకు ఐక్యంగా కొనసాగుతున్న భారత్‌ను విచ్ఛిన్నం చేయాలని నేటి పాలకులు చూస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఫెడరలిజంపై దాడి చేస్తున్నదని అన్నారు. రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తే దేశం సమైక్యంగా ఉండబోదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం ప్రమా దంలో పడిందన్నారు. ఏచూరి ప్రసంగాలు, రచనలు ఈ నాలుగు అంశాల ...14లో

ఆదర్శనేత ఏచూరి : కేటీఆర్



'బతికున్నంత వరకు ప్రజల కోసమే బతకడం కాదు, చనిపోయాక కూడా తన దేహం ఈ దేశ ప్రజానీకానికి వైద్యం అందించే డాక్టర్లకు ఉపయోగపడాలనే ఏచూరి ఆశయం చాలా గొప్పది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డప్పుడు మౌనం అనేది చాలా ప్రమాదకరమని ఏచూరి అన్న విషయాన్ని గుర్తు చేశారు. అందుకే ఆయన స్ఫూర్తితో రాజ్యాంగం అపహాస్యమైన ప్రతిసారి ప్రశ్నిస్తూనే ఉందామని పిలుపునిచ్చారు. ప్రజా హక్కుల కోసం చేతనైనంత వరకు పోరాడుదామన్నారు. ప్రశ్నించే గొంతుకలకు అండగా నిలబడుదామని కోరారు. అదే మనందరం ఏచూరికి మనస్ఫూర్తిగా

...14లో

ఏచూరి బాటలో కొనసాగుదాం : మోహన్‌కందా



'మన కంటే చిన్న వాళ్లు మన కండ్ల ముందు చనిపోవడం చాలా బాధాకరం. నేడు ఏచూరి మన మధ్యన లేకపోయినా ఆయన ఆశయాలను కొనసాగించాలి. ఏచూరి ముందే వారి అబ్బాయి మరణించారు. నా ముందు ఏచూరి వెళ్లిపోయారు. ఆయన ఎలాంటి పరిస్థితి అనుభవించారో నాకు అలాంటి పరిస్థితి వచ్చింది. జరిగి దేందో జరిగి పోయింది. ఆయన చేసిన గొప్ప పనుల గురించి ఆలోచించాలి తప్ప ఆయన చనిపోయారంటూ

ప్రజాస్వామ్య రక్షకుడు ఏచూరి

జేఎన్‌యూ యుద్ధభూమిలో ఆయనను స్మరించుకున్న మేధావులు

ఆర్ఎస్ఎస్ కుట్రల ఛేదనే ఏచూరికిచ్చే ఘన నివాళి : ప్రకాశ్‌కరత్



వివరాలు 3లో



అతిశి అనే నేను..

ఢిల్లీ సీఎంగా ప్రమాణం

ఆమెతో పాటు మంత్రులుగా ఐదుగురు బాధ్యతలు స్వీకరణ

రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా కార్యక్రమం

వివరాలు 13లో



ఇరువురి ప్రాధాన్యతలు ఒక్కటే

రాష్ట్ర ప్రభుత్వానికి కితాబిచ్చిన ప్రపంచబ్యాంకు బృందం

ముఖ్యమంత్రి రేవంత్‌తో భేటీ

ఆర్థిక సహకారాన్ని కోరిన సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధి విషయంలో ప్రభుత్వ ప్రాధాన్య తలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసించింది. గత నెలలో వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తదుపరి ...13లో

రూ.8,888 కోట్ల కుంభకోణం

- తెరతీసిన సీఎం
- బావమరిది సృజన్‌రెడ్డికి అక్రమంగా కాంట్రాక్టులు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమృత్ పథకం టెండర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 8,888 కోట్ల భారీ అవినీతికి తెరతీశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శనివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాను బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా ఈ కుంభకోణానికి సీఎం తెరతీశారని అన్నారు. బావమరిది సూదిని సృజన్‌రెడ్డి కంపెనీకి అర్హతలు లేకపోయినా వేల కోట్ల రూపాయల పనులను కట్టబెట్టారని విమర్శించారు. ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీ యాజమాన్యాన్ని బెదిరించి, ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని తెలిపారు. టెండర్ దక్కించుకున్న కంపెనీతో సృజన్‌రెడ్డి జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకు తెరలేపారని తెలిపారు. రూ. 1,137 కోట్ల కాంట్రాక్టు దక్కించుకున్న తర్వాత ఆ కంపెనీ 20 శాతం పని చేస్తుందనీ, రేవంత్ బావమరిది కంపెనీ 80 శాతం పని ...5లో



రుజువు చేయకుంటే రాజీనామాకు సిద్ధమా?

సీఎంపై ఆరోపణలు పచ్చి అబద్ధం

- టెండర్ల విలువ రూ.3,515 కోట్లు
- 8,888 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? : కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్

వివరాలు 5లో

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కండ్ల లాంటివి

- పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కండ్లలాంటివని ప్రజాపద్దుల సంఘం చైర్మెన్ అరికెపూడి గాంధీ అన్నారు. పీఏసీ కమిటీ ఏర్పాటై వందేండ్లు పూర్తవుతున్న తరుణంలో తమను చైర్మెన్‌గా నియమించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తన బాధ్యతను నిబంధనల ప్రకారం నిర్వహిస్తానని తెలిపారు. శనివారం హైదరాబాద్ అసెంబ్లీ కమిటీ హాల్‌లోగాంధీ అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగింది. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు తదితర అంశాలపై మొదటి సమావేశాన్ని నిర్వహించారు. పీఏసీ చైర్మెన్‌గా గాంధీని నియమించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, పీఏసీ సభ్యులు హాజరయ్యారు. చైర్మెన్‌గా అరెకపూడి గాంధీని నియమించడంపై శ్రీధర్‌బాబును నిలదీశారు. ఎంపిక అప్రజాస్వామికంగా జరిగిందన్నారు.

స్కూల్ గ్రాంట్ నిధుల విడుదలపై పీఆర్టీయూటీఎస్ హర్షం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, క్రీడా పాఠశాలలకు 2024–25 విద్యాసంవత్సరం కంటింజెనీ నిధుల విడుదలపై పీఆర్టీయూటీఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ బిల్లులకు సంబంధించి కంటింజెన్సీ నిధుల నుంచి కాకుండా ప్రభుత్వమే చెల్లించేందుకు ఉత్తర్వులిచ్చి పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించి వారి వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటు కూడా విడుదల చేసి, బడుల మౌలిక సదుపాయాల కోసం నిధులను నేరుగా ప్రధానోపాధ్యాయుల ఖాతాలో జమచేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి బోనస్ బోగస్

- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వట్టి బోగస్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు విమర్శించారు. మొత్తం రూ.4,701 కోట్లలో 33శాతాన్ని బోనస్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లాభాల వాటాలో 50 శాతం కోత విధిస్తూ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేశారన్నారు. 2022–23లో సంస్థకు రూ.2,222 కోట్లు లాభాలు వస్తే, దానిలో దానిలో రూ.710 కోట్లు (32 శాతం) బోనస్‌గా ఇచ్చామని తెలిపారు.

జీవో 25 నిబంధనలు మార్చాలి

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

రేషనలైజేషన్ జీవో 25 నిబంధనలను మార్చాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పీసీ) ప్రభుత్వాన్ని కోరింది. ఉపాధ్యాయుల సర్దుబాటుతో బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలని ఆ సంఘం స్టీరింగ్ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ దవాఖానల్లో 842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో 421 పోస్టులను పురుష అభ్యర్థులతో, మరో 421 పోస్టులను మహిళా అభ్యర్థులను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్టు నోటిఫికేషన్‌లో తెలిపారు. పురుష యోగా ఇన్‌స్ట్రక్టర్లు నెలకు 32 యోగా తరగతులకు హాజరు కావాలని, మహిళా యోగా ఇన్‌స్ట్రక్టర్లు నెలకు 20 యోగా తరగతులకు హాజరు కావాలని పేర్కొన్నారు. గంటసేపు ఉండే ప్రతి తరగతికి రూ.250 చొప్పున రెమ్యునరేషన్ చెల్లిస్తారని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు అటెండ్ కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా ఆయుష్ హెడ్ క్వార్టర్స్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఈ నెల 24న ఆదిలాబాద్, హైదరాబాద్, 25న నిజామాబాద్, 26న మెదక్, రంగారెడ్డి, 27న వరంగల్, నల్గొండ, 28న కరీంనగర్, 30వ తేదీ ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లా హెడ్ క్వార్టర్ ఆస్పత్రుల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయి. పూర్తి వివరాల కోసం ayush.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

క్వాడ్ సదస్సులో చైనానే ప్రధాన ఎజెండా !

- అమెరికా కుయుక్తులు ఫలించేనా?

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సొంత పట్టణమైన విల్మింగ్టన్‌లో ఈ వారాంతంలో క్వాడ్ సదస్సు జరుగుతోంది. ఈ సదస్సు ఎజెండాలో చైనా సంబంధిత అంశాలే ప్రధానంగా వున్నాయని వైట్‌హౌస్ పేర్కొంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనాతో గల వ్యూహాత్మక పోటీ నేపథ్యంలో తన పట్టును మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతోనే క్వాడ్ సదస్సును నిర్వహిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. క్వాడ్ సభ్య దేశాలకు గల విభిన్నమైన వ్యూహాత్మక ప్రయోజనాలు, చైనాతో వారికి గల ఆర్థిక బంధాలు దృష్టిలో పెట్టుకుంటే విభజనలు తీసుకువచ్చి, ఘర్షణలు సృష్టించాలన్న అమెరికా ఎత్తుగడ నెరవేరడం కష్టం కావచ్చని వారు భావిస్తున్నారు. భద్రత విషయంలో చూసినట్లైతే ఆసియా పసిఫిక్ దేశాలు అమెరికా మీద మరింత ఆధారపడేలా చూసేందుకు క్వాడ్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని అమెరికా భావిస్తోంది. భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లకు వారి వారి అభిప్రాయాలు వున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాతో వ్యూహాత్మక విలీనానికి సంబంధించి అంశాలు వున్నట్లే చైనాతో ఆర్థిక విలీనాంశాలు కూడా క్వాడ్ సభ్య దేశాలకు వున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో క్వాడ్ ద్వారా ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో చీలికలు, ఘర్షణలు తీసుకు రావాలన్న అమెరికా ప్రయత్నాలు బెడిసికొట్టే అవకాశాలు లేకపోలేదని చైనా విదేశీ సంబంధాల యూనివర్శిటీ ప్రొఫెసర్ లీ హైడాంగ్ వ్యాఖ్యానించారు.



వేకువ సూర్యుడు ఏచూరి

మరువదయ్య మరువదయ్య నీ త్యాగం ఈ లోకం
ఆ చంద్ర తరార్కం చెదరదు నీ ఆదర్శం
కరుగుతు వెలుగును పంచె సూర్యునిలా నీ రూపం
తలపుకొచ్చి ప్రతి ఎదలో పొంగుతున్నది శోకం

సిరులకు యే లోటు లేని కుదురులోన పుట్టినావు
పరుల భాదలకు కరిగి ఎర్రజెండ పట్టినావు
అనంతమవు కదలి వోలె అంతులేని నీ జ్ఞానం
అలసటన్నదే లేని అవని వోలె నీ పయనం

నేల మీద నడయాడే సందమామ దీవి నీవు
జాలి గుండె బుద్దుని వలె మానవతకు తావి నీవు
ఆశలు నింపే నీ బోదలు వేసవిలో వాన జల్లు
కష్టజీవి దారులలో నీ రాతలే హరివిల్లు

సుడిగుండాలు ఎదురీదే విప్లవాల నావ నీవు
కష్ట జీవి కడగండ్లను తొలిగించే తోవ నీవు
చంద్ర రాజేశ్వరుడు సుందరయ్య వేసినట్టి
ఉద్యమాల వారధివై ఉప్పెనలను ఆపినావు

నిస్వార్ధము కొలువుండే చిరునామా నీ పాదు
నిజం ఎంత బరువున్న భుజము నీవు వొంచలేదు
ప్రతి మలుపులో నీ గమనం విప్లవాల గుణపాఠం
అణువణువున కమ్యూనిజం నీవు నిలుపుకున్న ధనం

కోన ఊపిరిలో సైతం విప్లవ కళ కన్నావు
ఆ గగనపు ఎర్రజెండా కదలికవై ఉన్నావు
ఈ మట్టి నుదిటి మీద మాసిపోని త్యాగలిపివి
ఆ యెర్రని చెట్ల పూల వీసే వేకువ గాలివి



– గోరటి వెంకన్న

ప్రజాస్వామ్య రక్షకుడు ఏచూరి

- జేఎన్‌యూ యుద్ధభూమిలో ఆయనను స్మరించుకున్న మేథావులు
- ఆర్ఎస్ఎస్ కుట్రల ఛేదనే ఏచూరికి మనమిచ్చే ఘన నివాళి : ప్రకాశ్‌కరత్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి సంరక్షకుడిగా జేఎన్‌యూ యుద్ధ భూమిలో ఎదిగిన సీతారాం ఏచూరితో అనుభవాలను, జ్ఞాపకాలను జేఎన్‌యూ కామ్రేడ్స్ పంచుకున్నారు. శనివారం నాడిక్కడ స్థానిక ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో ఏర్పాటు చేసిన సంస్మరణ సభ "సెలబ్రేటింగ్ సీత...రిమెంబరింగ్ సీత"లో జెఎన్‌యూ విద్యార్థి సంఘం తొలితరం నాయకులు సీతారాం ఏచూరిని స్మరించుకున్నారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం తొలి అధ్యక్షుడిగా పనిచేసిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్‌కరత్ తొలుత తన జ్ఞాపకాలను పంచుకున్నారు. "సీతారాం ఏచూరి 1973లో జేఎన్‌యూలో ఎంఎ ఎకనామిక్స్‌లో చేరారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా నేను పోటీ చేయగా సీతారాం ప్రచారం చేశారు. దాంతో ఏచూరి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు" మేము 74 నుంచి కలిసి పనిచేయడం ప్రారంభించామని ప్రకాశ్‌కరత్ తెలిపారు. ఎమర్జెన్సీ తరువాత, యూనియన్ అధ్యక్షుడైన సీతారాం, ఎమర్జెన్సీకి ముందు ఉన్న జేఎన్‌యూని పునర్నిర్మించడానికి గట్టి ప్రయత్నాన్ని ప్రారంభించారు. ఛాన్సలర్ ఇందిరాగాంధీపై పెట్టిన చార్జిషీట్‌ను ఆయన ఆమె ముందు చదివి వినిపించడంతో ఓ చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైందని తెలిపారు.

దశాబ్దాల తరువాత మోడీ ప్రభుత్వం ఏర్పాటైన రెండో వార్షికోత్సవం సందర్భంగా జేఎన్‌యూపై దాడి జరిగినప్పుడు మళ్లీ సీతారాం తెరపైకి వచ్చారని గుర్తు చేశారు. హిందుత్వ రాష్ట్ర ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేయాలన్న ఉద్యమానికి జేఎన్‌యూ పెను సవాల్ అని, దానిని ధ్వంసం చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీతారాం ఎత్తిచూపారని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటంలో ఎప్పుడూ ముందుండే జేఎన్‌యూపై జరుగుతున్న దాడులను ఛేదించడమే సీతారా ఏచూరికి ఇచ్చిన ఘనమైన నివాళి అని అన్నారు. జేఎన్‌యూ ఎస్‌యూ మాజీ అధ్యక్షులు డి.రఘునందన్, జగదీశ్వర్ చతుర్వేది, రష్మీ దొరైస్వామి, టికెఅరుణ్, నళినీ రంజన్ మొహంతి, అమిత్‌సేన్ గుప్తా, సూరజిత్ మజుందార్ తదితరులు మాట్లాడారు. సోహైల్ హష్మీ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

వైమానిక దళ అధిపతిగా అమర్‌ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ : త్రివిధ దళాల్లో ఒకటైన భారత వైమానిక దళ (ఐఏఎఫ్) చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ నియమితులయ్యారు. యుద్ధ విమానాల పైలట్ అయిన సింగ్ ప్రస్తుతం ఐఏఎఫ్ వైస్ చీఫ్‌గా వున్నారు. ప్రస్తుతమున్న ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరి ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆ రోజునే సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఐఏఎఫ్‌కు నాయకత్వం వహించిన సిక్కు అధికారుల్లో ఎయిర్ మార్షల్ సింగ్ నాల్గవ వారు. 1984లో ఫైటర్ పైలట్ విభాగంలోకి వచ్చిన సింగ్ దాదాపు 40ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక పదవులు నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్‌లోని ఐఏఎఫ్ సెంట్రల్ కమాండ్‌కు ఆయన కమాండర్‌గా కూడా పనిచేశారు. 1964 అక్టోబరు27న జన్మించిన అమర్ ప్రీత్‌సింగ్ నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, డిఫెన్స్ సర్వీసెస్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో భారత వైమానిక దళంలో చేరారు.

శ్రీలంక ఎన్నికల్లో 75శాతం పోలింగ్



కొలంబో : శనివారం జరిగిన కీలకమైన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో 75శాతం పోలింగ్ నమోదైంది. ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదని, భద్రతా ఉల్లంఘనలు నమోదు కాలేదని ఎన్నికల కమిషన్ పేర్కొంది. 4గంటలకు పోలింగ్ ముగిసిన వెంటనే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నారు. ఆ తర్వాత సాధారణ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు ప్రారంభమైన రెండు మూడు గంటలతర్వాత ఫలితాలు వస్తాయని కొలంబో నగర డిప్యూటీ ఎన్నికల కమిషనర్ బందారామప తెలిపారు. ఓటింగ్‌ను పురస్కరించుకుని శ్రీలంక, న్యూజీలాండ్ మధ్యజరిగే టెస్ట్ మ్యాచ్‌కు కూడా ఒక రోజు బ్రేక్‌ఇచ్చారు. 85 ఫిర్యాదులు అందాయని, వాటిని నిశితంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సమస్యలే కీలకంగా మారిన ఈ ఎన్నికల్లో ముక్కోణపు పోటీలో వున్న ముగ్గురు అభ్యర్థులు దేశ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణపై హామీలిచ్చారు.



మార్కెట్ అవసరాలకు
అనుగుణంగా కోర్సులు
అందుకోసం ప్రత్యేక కమిటీ

- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐ, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు : సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఐటీఐల్లో కోర్సులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆయా కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పనకు ఓ కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తల సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆయన సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐ కళాశాలలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. వాటిలో శిక్షణ తీసుకుంటున్న వారికి ట్రైనింగ్ సమగ్రంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. క్రమం తప్పకుండా ఆయా కళాశాలలను పర్యవేక్షించి, తనిఖీలు చేపట్టాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ కొత్త ఏటీసీ(అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్)లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో ఐటీఐ/ ఏటీసీ లేని శాసనసభ నియోజకవర్గాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరం మినహా మిగతా వంద నియోజకవర్గాల్లో ఐటీఐ/ ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. వృత్తి నైపుణ్యాలను అందించే ఐటీఐ/ ఏటీసీ, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధివిధానాలు రూపొందించాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎమ్‌డీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణలే కీలకం

జమిలీపై కోవింద్ కమిటీ | సమాఖ్య స్ఫూర్తికే విఘాతం : నిపుణులు



జమిలీ ఎన్నికలు చర్చకు రావడం ఇది మొదటిసారి కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండు దశాబ్దాల పాటు లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకే సారి ఎన్నికలు జరిగాయి. 1951-52, 1957, 1962, 1967లో దేశంలో జమిలీ ఎన్నికలు నిర్వహించారు. 1968-69లో కొన్ని రాష్ట్రాల శాసనసభలు రద్దు కావడం, 1970లో లోక్‌సభను రద్దు చేయడం, ఆ తర్వాత 1971లో సార్వత్రిక ఎన్నికలు జరగడం వంటి పరిణామా లతో జమిలీ ఎన్నికల నిర్వహణ అటకెక్కింది. ఈ ఎన్నికలపై లా కమిషన్ 2018లో సమర్పించిన ముసాయిదా నివేదికలో ఈ వివరాలను పొందు పరిచారు. అప్పటి నుంచి 'ఒకేసారి ఎన్నికల నిర్వహణ'పై అనేక సార్లు చర్చలు జరిగాయి.

న్యూఢిల్లీ : ఒకే దేశం...ఒకే ఎన్నిక ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ మార్చి 15వ తేదీన అందజేసిన నివేదికలోని సిఫారసులకు కేంద్ర మంత్రిమండలి ఓకే చెప్పింది. క్యాబినెట్ నిర్ణయాన్ని విలేకరులకు వివరించిన సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ దేశంలో 1951 నుంచి1967 వరకూ జమిలి ఎన్నికలే జరిగాయని గుర్తు చేశారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని లా కమిషన్ తన 170వ నివేదికలో సూచించిందని కూడా చెప్పారు.

ఎవరేమన్నారు?

కేంద్ర ఎన్నికల సంఘం 1983లో విడుదల చేసిన తన ప్రారంభ వార్షిక నివేదికలో జమిలీ ఎన్నికల ప్రస్తావన తెచ్చింది. 2015లో సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 79వ నివేదికలో కూడా జమిలీ ఎన్నికలను సమర్థిం చింది. సుమారు నాలుగు సంవత్సరాల తర్వాత...2018 ఆగస్ట్ 30న జస్టిస్ బీఎస్ చౌహాన్ నేతృత్వంలోని లా కమిషన్ ముసాయిదా నివేదికను విడుదల చేసింది. రాజ్యాంగంలో సవరణలు చేయకుండా ప్రస్తుత నిబంధనల ప్రకారం జమిలీ ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. రాజ్యాంగంతో పాటు 1951వ సంవత్సరపు ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని కూడా సవరించాలని సూచించింది. ఈ రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు ఉభయ సభలలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని కూడా స్పష్టం చేసింది.



ఏం చేయాలి?

ఈ నివేదిక ప్రకారం...జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే కొన్ని కర్తవ్యాలను నెరవేర్చాలి ఉంటుంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల పదవీకాలాన్ని కుదించడమో లేదా పొడిగించడమో చేయాలి. రాజ్యాంగంలో సంబంధిత నిబంధనలను సవరించాలి. 1951వ సంవత్సరపు ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాలి. ఈ రాజ్యాంగ సవరణలకు రాష్ట్రాలు ఆమోదం తెలపాలి.

రెండంచెలుగా...

జమిలీ ఎన్నికలను రెండంచెలుగా నిర్వహించాలని కోవింద్ కమిటీ సూచించింది. ముందుగా లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలి. రెండో దశలో...ఆ ఎన్నికలు జరిగిన 100 రోజుల లోగా మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి. ఎందుకంటే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలంటే సామగ్రి, సిబ్బంది, ఇతర వనరులు అధికంగా అవసరమవుతాయి. ఒకవేళ పదవీకాలం పూర్తికాక ముందే చట్టసభ రద్దయిన పక్షంలో రాజ్యాంగంలో 'పూర్తి పదవీకాలం', 'పూర్తికాని పదవీకాలం' అనే పదాలను చేర్చాల్సి ఉంటుంది. జమిలీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయడానికి ముందు కొన్ని రాజ్యాంగ పరమైన మార్పులు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం కొన్ని కొత్త నిబంధనలను చేర్చడంతో పాటు ప్రస్తుతం ఉన్న నిబంధనలలో మార్పులు చేయాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ బిల్లులు తీసుకురావాల్సి ఉంటుంది.


ఈ సవరణలు అవసరం

రాజ్యాంగంలోని ఆర్టికల్ 83 (పార్లమెంట్ సభల పదవీకాలం), ఆర్టికల్ 172 (రాష్ట్రాల శాసనసభల పదవీకాలం)ను సవరించడం చాలా ముఖ్యం. వీటిని సవరించడంతో పాటు ఆర్టికల్ 82-ఏ (జమిలీ ఎన్నికలకు మారడానికి చేపట్టాల్సిన పద్ధతి)ని ప్రవేశపెట్టాలి. ఈ సవరణలు చేయడానికి రాష్ట్రాల అంగీకారం అవసరం లేదని కోవింద్ కమిటీ తెలిపింది. ఆర్టికల్ 83 (2)లో 'ఐదు సంవత్సరాల పదవీకాలం' అనే దానిని 'పూర్తి పదవీకాలం'గా మార్చాలని సూచించింది. ఆర్టికల్ 83, ఆర్టికల్ 172 ప్రకారం చట్టసభల పదవీకాలాన్ని పరిమిత కాలం మాత్రమే పొడిగించగలం. అది కూడా ఎమర్జెన్సీ పరిస్థితులలోనే.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 82-ఏ (అప్పాయింటెడ్ తేదీ), 324-ఏ (స్థానిక ఎన్నికలు), ఆర్టికల్ 325 (సాధారణ ఓటర్ల జాబితాలో స్థానిక ఎన్నికలను కూడా కలపడం) వంటి వాటిని కూడా సవరించాల్సి ఉంటుందని కోవింద్ కమిటీ తెలియజేసింది. ఢిల్లీ ప్రభుత్వ శాసనసభకు ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని కల్పిస్తున్న నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్-1991ని కూడా సవరించాల్సి ఉంటుంది. 1063వ సంవత్సరపు కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాన్ని, జమ్మూకాశ్మీర్ పునర్విభజన చట్టాన్ని కూడా సవరించాల్సిన అవసరం ఉంది.

నిపుణులు ఏమన్నారు?

జమిలీ ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగంలో చేయాల్సిన సవరణలపై నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సవరణలు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీస్తాయని, చట్టసభల పదవీకాలం అస్థిరతకు గురవుతుందని లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ పీడీటీ ఆచార్య తెలిపారు. శాసనసభలకు రాజ్యాంగం ఐదేండ్ల నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించిందని, సవరణల ద్వారా వాటి పదవీకాలం రెండేండ్లకో లేదా నాలుగేండ్లకో పరిమిత మవుతుందని చెప్పారు. రాష్ట్ర శాసనసభలపై ప్రభావం చూపే నిబంధనను ప్రవేశపెట్టాలని పార్లమెంట్ ప్రయత్నిస్తోందని, ఇది సమాఖ్య సూత్రానికే విఘాతం కలిగిస్తుందని వివరించారు. మౌలిక స్వరూపాన్ని మార్చే ఏ సవరణనైనా పార్లమెంట్ తీసుకురాకూడదని అన్నారు. కోవింద్ కమిటీ కేవలం స్వల్ప మార్పులు మాత్రమే సూచించిందని బాంబే హైకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్ చెప్పారు.



జమిలీని ప్రస్తావించని రాజ్యాంగ నిర్మాత

జమిలీ ఎన్నికలను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎన్నడూ ప్రస్తావించలేదు. ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ఎన్నికల కమిషన్ మాత్రమేనని రాజ్యాంగంలోని ఆర్టికల్ 289లో స్పష్టంగా ఉన్నదని 1949 జూన్ 15న రాజ్యాంగ అసెంబ్లీలో జరిగిన చర్చ సంద ర్భంగా ఆయన తెలిపారు. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యుడైన షిబ్బన్ లాల్ సక్సేనా కూడా చర్చ సంద ర్భంగా అంబేద్కర్ అభిప్రాయంతో ఏకీభవించారు.



వెంకన్న లడ్డూపై జగడం

బాబు, జగన్ డిష్యూం.. డిష్యూం

- నెయ్యి కొనుగోలులో ఏం జరిగింది?
- ప్రశ్నలు లేవనెత్తుతున్న టెండర్ డాక్యుమెంట్ పత్రాలు
- అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్టకు 300 కేజీల నెయ్యి సరఫరా
- 300 కిలోల లడ్డూలు జగన్ సర్కార్ పంపిణీ
- సుప్రీంకోర్టులో పిటిషన్

హైదరాబాద్ : తిరుపతి లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందంటూ వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన కీలకమైన టెండర్ పత్రాలు 'ఇండియా టుడే' పత్రిక చేతికి అందాయి. ఈ పత్రాలు నెయ్యి సేకరణ ప్రక్రియపై పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. 2023 ఆగస్ట్, ఈ ఏడాది జూలై మధ్యకాలంలో టీటీడీ కొనుగోలు చేసిన నెయ్యి పైనే వివాదం నడుస్తోంది. జగన్ పాలన చివరి ఏడాదిపై నన్న మాట! టెండర్ డాక్యుమెంటులోని క్లాజ్ 80 ప్రకారం సరఫరాదారుడు ప్రతి కన్‌సైన్‌మెంటుతో పాటు ఎన్ఏబీఎల్ అక్రెడిటేషన్ కలిగిన, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి పొందిన క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను టీటీడీకి అందజేయాల్సి ఉంటుంది. క్లాజ్ 81 ప్రకారం ఆ నెయ్యి నమూనాలను టీటీడీ ల్యాబ్ పరీక్షలకు పంపాలి.

కచ్చితమైన నిబంధనలు ఉన్నప్పటికీ నెయ్యిని ఎలా కల్తీ చేశారన్నదే ఇక్కడ ప్రధాన ప్రశ్న. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యి నుండి తీసుకున్న నమూనాలలో ఈ కల్తీ ఎందుకు బయటపడలేదన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఎందుకంటే అయోధ్య రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో తిరుమల లడ్డూ పంపిణీ 300 కేజీల నెయ్యి కూడా ఏపీ సర్కార్ సరఫరా చేసింది. నెయ్యి అయితే హోమ గుండంలో వాడి వుండవచ్చు!

ఇక తిరుమల లడ్డూ వ్యవహారమే దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఈ అంశంపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమల పవిత్ర ప్రసాదమైన ఈ లడ్డూను.. ఈ ఏడాది జనవరిలో జరిగిన అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులకు పంపిణీ చేసినట్టు ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తాజాగా తెలిపారు.

అయితే, ఎన్ని లడ్డూలు వచ్చాయన్నదానిపై తనకు స్పష్టంగా తెలియదని.. 300 కేజీల వరకూ లడ్డూ ప్రసాదంగా వచ్చినట్టు అంచనా వేశారు. ఆ విషయం ఆలయ ట్రస్ట్‌కు స్పష్టంగా తెలుసని చెప్పారు. అక్కడి నుంచి వచ్చిన లడ్డూలను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. పవిత్ర ప్రసాదంలో జంతువుల కొవ్వు కలపడం అన్నది క్షమించరాని నేరం అని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 'వైష్ణవులు, కొందరు భక్తులు కనీసం వెల్లుల్లి, ఉల్లిపాయ కూడా ముట్టరు. అలాంటి పరిస్థితుల్లో నెయ్యిలో కొవ్వు కలిపారనడం నిజంగా దురదష్టకరం. ఇది హిందువుల విశ్వాసాలను ఎగతాళి చేయడమే' అని అన్నారు. దీంతో పాటు 300 కేజీల నెయ్యి కూడా అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి అప్పటి ఏపీ సర్కార్ సరఫరా చేసిందని అధికార వర్గాలు తెలిపాయి.

సుప్రీం కోర్టులో పిటిషన్

తిరుమల కల్తీ నెయ్యి వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. తిరుమల లడ్డూ కల్తీతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకుని హిందువుల మతపరమైన హక్కులను కాపాడాలని సత్యం సింగ్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు.

నెయ్యిని సరఫరా చేసిన ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రయివేట్ లిమిటెడ్‌ను దేవాలయం పాలకమండలి బ్లాక్‌లిస్టులో పెట్టిందని, కల్తీ నెయ్యిని సరఫరా చేసినందుకు ఆ కంపెనీపై చట్టపరమైన చర్యలు ప్రారంభించామని టీటీడీ కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను ఏఆర్ డెయిరీ తోసిపుచ్చింది. ల్యాబ్ నివేదికను సవాలు చేశామని తెలిపింది. పైగా జూన్, జులై నెలల్లో మాత్రమే టీటీడీకి నెయ్యి సరఫరా చేశామని చెప్పింది. తిరుమల దేవాలయానికి ప్రతి రోజూ 10 టన్నుల నెయ్యి అవసరమవుతుందని, అందులో తాము 0.1 శాతం కూడా సరఫరా చేయలేదని వివరణ ఇచ్చింది. ఇది రాజకీయ వివాదంగా మారిందని అంటూ నెయ్యి కన్‌సైన్‌మెంటును అక్రెడిటెడ్ ల్యాబ్ నివేదికతో పాటు పంపామని గుర్తు చేసింది. 'నివేదికలో మా పేరు లేదు. ల్యాబ్ ఫలితాలు జంతు సంబంధమైన మందులు వంటి ఇతర కారణాలను కూడా ప్రస్తావించాయి' అని తెలిపింది.

కాగా, ఈ ఏడాది జనవరి 22న అయోధ్యలో నిర్మించిన రామ మందిరంలో రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం కోసం లక్ష లడ్డూ ప్రసాదాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేకంగా తయారు చేసి పంపింది. అయోధ్య ఆలయ కమిటీ సభ్యులు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, భక్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా పంపిణీ చేసింది. ప్రధాని మోడీ నేతత్వంలో జరిగిన ఈ వేడుకలకు దాదాపు 8 వేల మంది ప్రముఖులు హాజరయ్యారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై నివేదికివ్వండి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత వైసీపీ ప్రభుత్వ కాలంలో టీటీడీ తయారు చేసిన ప్రసాదం కల్తీ సరుకులతో, జంతు కొవ్వుతో తయారైందని చెప్పడంతో పెద్ద దుమారం చెలరేగింది. కాగా, తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిన కల్తీ నెయ్యి వాడిన ఘటనను కేంద్రం తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ సర్కారును కేంద్ర మంత్రి నడ్డా కోరారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతో తాను మాట్లాడానని, వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపాలని కోరానన్నారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు, ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు అవసరమని, దోషులకు తగిన శిక్ష పడాల్సిందేనని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. కల్తీ నెయ్యి ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ డిమాండ్ చేశారు. ఇది కేవలం కుంభకోణమే కాదని, హిందూయిజం నాశనానికి జరిపిన కుట్రగా ఆయన అభివర్ణించారు.

తనను మతం మార్చుకోమని, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినట్టూ ఆమె చెపుతున్నది. కచ్చితంగా విచారణ చేయాలి. దోషిని శిక్షించాలి. కానీ సందులో సడే మియాలా అది లవ్‌జీహాద్ అని, మతపరమైన అంశంగా మార్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇదే సందర్భంలో పూనమ్‌కౌర్ అనే ఉత్తరాది హీరోయిన్, త్రివిక్రమ్ శ్రీనివాస్ నాపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని నేనెప్పుడో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశానని, కానీ ఏ చర్యలూ తీసుకోలేదని ఆరోపించారు. డబ్బు, రాజకీయ ప్రాబల్యాలు కూడా ఇలాంటి వాటిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

సినిమా చూస్తున్నంతసేపూ ఓ రంగుల ప్రపంచం కనపడుతుంది. అన్యాయాలపై, అక్రమాలపై, దౌర్జన్యాలపై తిరగబడటం, నాయకుడు విజయం సాధించడం చూస్తుంటే ఆనందం కలుగుతుంది. అందులో కథ, బాధితులవైపు నిలబడుతుంది. హీరో బాధితులకు న్యాయం జరిగేట్టు పోరాడుతాడు. చాలా వరకు సినిమా న్యాయం వైపే ఉంటుంది. కానీ అది సినిమానే. సినిమా అల్లిక కథ, అందులోదంతా నటన. నిజ జీవితంలో వేరుగా ఉంటుంది. సినిమా హీరోలంతా బయట మాత్రం అంత నిజాయితీగా ఏమీ ఉండరు. ఈ విషయాలను ఎప్పుడో మన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ తన 'పాకుడు రాళ్లు' నవలలో చాలా వివరంగా రాశారు. ఇప్పుడు ప్రత్యక్షంగానే చూస్తున్నాము. అన్నదాతలను ఉన్నతంగా చూపించే సినిమాలు అందులోని హీరో హీరోయిన్లు బయట, వారిని హేళన చేస్తారు. స్త్రీల పట్ల గౌరవంగా నటించే నటులు అత్యంత అభ్యంతరంగా స్త్రీల గురించి మాట్లాడతారు. కులము, మతము, ప్రాంతము, రాజకీయము, అసూయ, ద్వేషాలు అన్నీ ఈ రంగుల తెరలకింద మనం చూస్తాము.

అందుకు ఓ ఉదాహరణ, జానీ మాస్టరుగా చెప్పబడుతున్న కొరియో గ్రాఫర్ వ్యవహారం. నృత్యం అంటే మనకెంతో ఆనందం వేస్తుంది.అదొక గొప్పకళ. అది ఒకప్పుడు. ఇప్పుడు బజారులో అమ్మబడు తోన్న నైపుణ్యం మాత్రమే. సినిమా అంటే యువతలో ఎప్పటికీ ఎంతో క్రేజ్ ఉంటుంది. సినిమాలో పనిచేయటం అనేది ఒక జీవిత లక్ష్యంగా పని చేస్తున్న వాళ్లూ, వెంపర్లాడుతున్న వాళ్లూ



అనేకం.అందులో ముఖ్యంగా ఆడపిల్లలు ఈ సినీ జగత్తులోకి రావటానికి ప్రయత్నం చేస్తే ఎదురయ్యే సమస్యలు ఎన్నో ఉంటాయి. అనేక అనుభవాలూ మనముందున్నాయి. కొన్నయితే భయంకరమైనవిగా కనపడతాయి. ఆడపిల్లలపై వివక్ష ఏరంగంలోనైనా సాగుతున్నదే.

సంపాదకీయం

జానీ మాస్టారు, తనతో పనిచేస్తున్న ఒక మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగికంగా దాడి చేశాడని, ఓ నలభై పేజీల ఫిర్యాదు, ఆ మహిళే పోలీసు స్టేషన్‌లో ఇచ్చింది. క్విడ్ ప్రోకో ఒప్పందాలు ఇప్పటివేం కాదు. క్యాస్టింగ్ కౌచ్‌పై మీటూ ఉద్యమాలు చాలా రోజులుగా జరుగుతున్నాయి. ఆ మహిళా కొరియో గ్రాఫర్ ఫిర్యాదు ఆధా రంగా జానీ మాస్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె మైనర్‌గా ఉన్నప్పుడే లైంగిక దాడి జరిగినందున ఫోక్సో కేసు పెట్టారు. కోర్టు రిమాండుకు పంపింది. అవకాశాలు ఇవ్వాలంటే, తాము చెప్పినట్లు వినాలని అనేక మంది సినీ పురుష పుంగవులు వేధించడం దారుణం. లైంగిక వేధింపులకు దిగడం సహించ రానిది. చట్టప్రకారం విచారణ చేసి చర్యలు తీసుకోవాలనే అందరూ కోరుతున్నారు. ఎప్పుడో 2020లో జరిగిన సంఘటనను ఇప్పుడు ఆ మహిళ చెప్పడానికి కారణ మేమిటనీ విమర్శకులు ప్రశ్నిస్తున్నారు. తనను మతం మార్చుకోమని, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసి నట్టూ ఆమె చెపుతున్నది. కచ్చితంగా విచారణ చేయాలి. దోషిని శిక్షించాలి. కానీ సందులో సడేమియాలా అది లవ్‌జీహాద్ అని, మతపరమైన అంశంగా మార్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇదే సందర్భంలో పూనమ్‌కౌర్ అనే ఉత్తరాది హీరోయిన్, త్రివిక్రమ్ శ్రీనివాస్ నాపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని నేనెప్పుడో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశానని, కానీ ఏ చర్యలూ తీసుకోలేదని ఆరోపించారు. డబ్బు, రాజకీయ ప్రాబల్యాలు కూడా ఇలాంటి వాటిలో ప్రధానపాత్ర పోషిస్తున్నాయి.

కేరళలో తమ సినిమా ఫీల్డులో మహిళల రక్షణ, దాడులకు సంబంధించిన వివరాలు సేకరించడానికి హేమకమిటీని వేసి, అన్నింటినీ బయటపెట్టింది. చర్యలకూ ఉపక్రమించింది. అలాంటి ప్రయత్నం మన తెలుగు, తమిళ, హిందీ సినిమా రంగంలోనూ జరగాలి. అప్పుడే వేధింపులకు గురవుతున్న మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి చెప్ప గలుగు తారు. అయితే టాలీవుడ్‌లో ఇలాంటివి జరగకుండా చూసుకోవడానికి, మహిళల రక్షణకు సరైన గైడ్‌లైన్స్ ఏవీలేవని, ఇది అన్ ఆర్గనైజ్డ్ సెక్టార్‌గా ఉందని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు. జానీ మాస్టర్ కేసుకు సంబంధించి, ఎన్ని భిన్న వాదనలు వినిపిస్తున్నా గానీ తెలుగు సినిమా రంగంలో కొనసాగు తున్న ఈ మురికి, అనైతిక, నేరపూరిత విషయాలపై సమగ్ర దర్యాప్తు జరపవలసే ఉన్నది. కనపడ్డంత రంగుల ప్రపంచం కాదని, వివక్షతలు, దాడులు అన్నీ ఇందులో ఉన్నాయనేది గుర్తించి అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం తగిన చర్యలూ తీసుకోవాలి.

2024 ప్రారంభంలో కొలీజియం పిఎం మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక చేస్తే కేంద్రం అడ్డుపడింది. ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనీ, రెండుసార్లు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆయన్ను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించిందనీ సిఫార్సు వెనక్కు పంపింది. అయితే ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనే వాదన అస్పష్టమైందని కొలీజియం మార్చి 13న బదులిచ్చింది. ఫలానా రాజకీయ నేపథ్యంతో వున్నారనే ఒక్క కారణంగా అన్ని సందర్భాల్లో వారి నియామకాన్ని తిరస్కరించలేమని పేర్కొంది. లంకేశ్‌చంద్రగౌరి బీజేపీలో ఆఫీసుబేరర్‌గా వున్నా 2023 ఫిబ్రవరిలో ఆమెను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియమించిన సందర్భాన్ని పేరు తీయకుండా కొలీజియం గుర్తుచేసింది.

జడ్జిలే జడ్జిలను నియమించుకునే పద్ధతి కాకుండా అందుకు సమగ్రమైన జ్యూడిషియల్ కమిషన్ వుండాలనేది వాస్తవమే. అయినా మోడీ ప్రభుత్వం ఆ పేరుతో కేవలం నియామకాలు మొత్తంగా తన చేతిలోకి తీసుకోవాలనే రీతిలో వ్యవహరిం చడం కూడా సరైంది కాదు. సమగ్ర సంస్కరణలతో కూడిన కమిషన్ కాకుండా తనకు నచ్చిన విధంగా ఆ కమిషన్‌ను రూపొందించాలనుకోవడం అవాంఛనీయం. దీనికి తోడు ప్రధాని మోడీ, మంత్రులూ తరచూ న్యాయ వ్యవస్థపై చేసే వ్యాఖ్యలు దాన్ని మరింత పెంచాయి. ఇక ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ ఆ పదవి పరంగానూ, రాజ్యసభ చైర్మన్ హోదాలో కూడా నేరుగా కోర్టులను సవాలు చేసేట్టు మాట్లాడుతుంటారు.

జడ్జిల నియామకంలో అంతుపట్టని జాప్యం


తెలకపల్లి రవి

భారతదేశంలో న్యాయమూర్తుల నియా మకం సమస్య కేంద్రం ఏకపక్ష వైఖరి వల్ల మరోకసారి వివా దంగా మారింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజేఐ డివై చంద్రచూడ్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు కోర్టు ఆగ్రహాన్ని వెల్లడించాయి. ముగ్గురు సీనియర్ న్యాయ మూర్తులతో కూడిన కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను పక్కన పెట్టడానికి కారణం ఏమిటని ఆయన కేంద్రాన్ని నిలదీశారు. కొలీజియం కేవలం సెర్చి కమిటీ లాంటిది కాదు. కొలీజియంకు రాజ్యాంగ పరమైన కొన్ని బాధ్యతలున్నాయి. దాని సిఫార్సులను ఆమోదించవచ్చు లేదా తోసిపుచ్చవచ్చు. కానీ సిఫార్సు చేసినప్పుడు దానిపై ఏదో ఒక స్పందన చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుంది. వాటిపై ఎడతెగని ఆలస్యం చేసి గుండుగుత్తగా వెనక్కు పంపితే ఏమని అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రశ్నిం చింది. ఈ వారం మొదట్లో హైకోర్టులకు సంబంధించిన ప్రధాన న్యాయమూర్తులు పలువురిని కొలీజియం సిఫార్సు చేసింది. అంతకుముందు చేసిన సిఫార్సులను కేంద్రం సలహా మేరకు మార్చింది కూడా. ఢిల్లీ హైకోర్టుకు జస్టిస్ సుకుమార్, సురేష్ కుమార్ పంజాబ్, హర్యానా హైకోర్టుకు జస్టిస్ శాంతాబాయి అను జమ్మూ కాశ్మీర్ లడక్ హైకోర్టుకు జస్టిస్ దర్శి రాబిట్‌సన్ పంపించాలంటూ చేసిన సిఫార్సులను వెనక్కు తీసుకోవడానికి కూడా న్యాయస్థానం సిద్ధపడింది. రెండో జడ్జిల కేసులో తీర్పు ప్రకారమైతే ఒకసారి పంపిన పేర్లను మళ్లీ పరిశీలన తర్వాత కూడా కొలీజియం పంపినట్టయితే ప్రభుత్వం తప్పనిసరిగా ఆమోదించి తీరాలి. న్యాయవ్యవస్థతో సంబంధం ఉన్నవారు ఎవరైనా ఈ ధోరణి వ్యవస్థ స్వయం ప్రతిపత్తికి భంగకరమని భావిస్తారు ఆ విధమైన విమర్శలు అభ్యం తరాలు నిరసనలు చాలానే వచ్చాయి. కొలీజియం పంపిన పేర్లపై కేంద్రం నిర్ణయం తీసుకోవడానికి నిర్దిష్ట కాలవ్యవధిని నిర్ణయించాలంటూ దాఖలైన పిల్ విచారణ సందర్భంగా ఈ సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. జార్ఖండ్ ప్రభు త్వం దాఖలు చేసిన ఇలాంటి మరో పిటిషన్ కూడా వచ్చింది. ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావును నియమించాలని కొలీజియం చేసిన సిఫార్సును ఎంతకు తేల్చకపోవడంపై అది అభ్యంతరం చెప్పింది.

కేంద్రం తరపున వాదించిన అటార్నీ జనరల్ ఆరు వెంకటరమణి మాత్రం అసలు ఈ విషయంలో కోర్టు జోక్యం ఏమేరకు సాధ్యమని సందేహం వెలిబుచ్చారు. దానిపై ఆగ్రహించిన సీజేఐ చంద్రచౌదరి అసలు ఈ నియామకాలు జరపకపోవడానికి కారణాలేంటో ముందు చెప్పండని ప్రశ్నించారు. 'మేము పంపిన సిఫార్సులలో ఒక్కొక్క దాని పరిస్థితి ఏంటో మాకు వివరాలతో సహా నివేదించండి. ఇవన్నీ చెప్పడంలో మా ఉద్దేశం తప్పులు పట్టడం కాదు, న్యాయస్థానాల పాలన నిర్వహణకు సంబంధించిన వ్యవహారాల్ని ముందుకు తీసుకోవడం కోసమే ఈ మాట చెప్తున్నామని' సీజేఐ అటార్నీ జనరల్‌తో అన్నప్పుడు నాకు బాగా అర్థమైందని ఆయన బదులిచ్చారు. అయితే అసలు ఇలాంటి పిటిషన్ విచారణ అర్హత కలిగివుందో లేదో తన అభిప్రాయం ఒక నోట్ రూపంలో అంద జేస్తానని వ్యాఖ్యానించారు. 'మీరు సున్నితమైన విషయాన్ని మరి లాగకండి. కావాలంటే జార్ఖండ్ కేసు వాదిస్తున్న కపిల్ సిబాల్ గారే నియామకాల ప్రక్రియ చేపట్టవచ్చు. ప్రతి సిఫార్సు ఆనామోదానికి ఒక ప్రత్యేక కారణం ఉంటుందంటూ' కేంద్రాన్నే సమర్థించడానికి ఏజీ వెంకట రమణి ప్రయత్నించారు. 'ఒకచోట ఒకరు పేచీ పెడతారు అది ఎందుకు చేయకూడ దంటారు. వీటన్నింటిలో కోర్టు ఎలా తలదురుస్తుందో నేను చెప్పలేను.' అని సుప్రీంకోర్టు పాత్రనే ప్రశ్నించినట్టు మాట్లాడారు.

దీర్ఘకాల సంక్షోభం

ఈ వాదోపవాదాలు యాదృచ్ఛికమైన వని భావించడం కష్టం. దీర్ఘకాలంగా తేలని కొలీజియం కేంద్రం సంబంధాలు సమస్య దీంతో ముడిపడి ఉంది. ఉదయం కేసు ప్రారంభం కాగానే ఏజీ వెంకటరమణి వాయిదా వేయాలని కోరారు. ఈ విషయంలో 2018 నాటి నుంచి విచారణకు నోచని పిటిషన్‌లు కూడా వున్నాయని అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ గుర్తుచేశారు. జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకంపై పిటిషన్ దాఖలు చేసిన విషయం తనకు తెలియదని ఏజి చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తులు కీలకమైన పాలనా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. దాన్ని వాయిదా వేస్తూ తాత్కాలిక సిజెతో నడిపించడం సమస్యలకు దారితీస్తుందన్నారు. నిర్దిష్ట కాలంలో కొలీజియన్ సిఫారసులను ఆమోదించకపోతే ఆ నియామకాలు జరిగిపోయినట్టే భావించాలని ఈ సందర్భంగా ప్రశాంత్ భూషణ్ సూచించారు. నిజానికి రెండవ జడ్జీల కేసుగా పేరుపొందిన కేసులో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులు గనక రెండోసారి పంపినట్టయితే ప్రభుత్వం ఆమోదించి తీరాలని ఆదేశిస్తున్నది. మళ్లీ మళ్లీ పంపిన పేర్లను కూడా విస్మరించటం, తిరగ్గొట్టడం రెండవ జడ్జీల కేసు తీర్పు స్ఫూరికి విరుద్ధమని డిసెంబర్ 2022లో ఇచ్చిన ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడైతే ఢిల్లీ హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, కేరళ, మధ్యప్రదేశ్, మద్రాస్, మేఘాలయ హైకోర్టులకు జడ్జిలను నియమించవలసి వుంది.ఢిల్లీ హైకోర్టులో సౌరభ్ కిర్పాల్ నియామకం దీర్ఘకాలంగా పక్కన పెట్టారని అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ వాదించారు.ఇలా తొక్కిపట్టిన 12 పేర్లను తాను పిటిషన్‌లో ఉదహరించానని ప్రశాంత్ భూషణ్ అన్నారు. తనను గనక నియమించి ఉంటే భారత దేశంలో మొదటి గే జడ్జి ఉండేవారు. అతని పేరు ఆయన పేరును ఢిల్లీ హైకోర్టు కొలీజియం 2017 ల్లో పంపించింది. కొలీజియం 2021 నవంబర్‌లో సిఫార్సు చేసింది. 2023 జనవరిలో మరోసారి చెప్పింది. కానీ స్వలింగ సంపర్కుల హక్కులను గట్టిగా వాదించే కిర్పాల్ నియామకానికి కేంద్రం అభ్యంతరం పెట్టింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జాన్ సత్యంను సుప్రీంకోర్టు కొలీజియం 2022 ఫిబ్రవరిలో సిఫార్సు చేసింది. 2023 జనవరిలో పునరుద్ఘాటించింది. అయినప్పటికీ ఇవి జరగ లేదు. జార్ఖండ్ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బిఆర్ సారంగి పేరును ఆలస్యంగా ఖరారు చేయడంవల్ల ఆయన 15రోజులు మాత్రమే సిజెగా పనిచేసి దిగిపోవాల్సి వచ్చింది!

రాజకీయ అభ్యంతరాలా?



ఇంతకంటే తీవ్రమైనవి రాజకీయ ఆటంకాలు. 2024 ప్రారంభంలో కొలీజియం పిఎం మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక చేస్తే కేంద్రం అడ్డుపడింది. ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనీ, రెండుసార్లు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆయన్ను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించిందనీ సిఫార్సు వెనక్కు పంపింది. అయితే ఆయన సీపీఐ(ఎం) అభిమాని అనే వాదన అస్పష్టమైందని కొలీజియం మార్చి 13న బదులిచ్చింది.ఫలానా రాజకీయ నేపథ్యంతో వున్నారనే ఒక్క కారణంగా అన్ని సందర్భాల్లో వారి నియామకాన్ని తిరస్కరించలేమని పేర్కొంది. లంకేశ్‌చంద్రగౌరి బీజేపీలో ఆఫీసుబేరర్‌గా వున్నా 2023 ఫిబ్రవరిలో ఆమెను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియమించిన సందర్భాన్ని పేరు తీయకుండా కొలీజియం గుర్తుచేసింది. నిజానికి గౌరి చేసిన కొన్ని వ్యాఖ్యలు అభ్యంతరకరంగా వున్నాయి గనక నియామకం చేయవద్దంటూ ఆమె ప్రమాణ స్వీకారానికి ముందే సుప్రీం కోర్టుకు అనేక లిఖిత అభ్యంతరాలు వెళ్లినా కొలీజియం ఖాతరు చేయలేదు. ఆ విధంగా చూస్తే ఎస్‌సి వర్గానికి చెందిన మాధవన్ 35 మంచి తీర్పులు ఇచ్చారని కొలీజియం స్పష్టం చేసింది. పైగా ఆయన ప్రభుత్వం ఒక పక్షంగా వుండే కేసుల ద్వారా భిన్న సందర్భాలలో ఎలా వ్యవహరించాలో కూడా అనుభవం గడించి వుంటారని అభిప్రాయపడింది. కేరళ హైకోర్టులో ఆయనతో పాటు పనిచేసిన జడ్జిలు మాధవన్ సమర్థత గురించి సంతృప్తి వెలిబుచ్చారని కూడా తెల్పింది. హైకోర్టులకు సంబంధించినంతవరకూ ఎస్‌సి కొలీజియం కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో నుంచి నివేదికలు వచ్చిన తర్వాత మాత్రమే తనకు అందిన ప్యానల్స్ నుంచి పేర్లను షార్ట్‌లిస్ట్ ఎంపిక చేస్తుంది.వాటిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి. అప్పుడు కొలీజియం వాటితో ఏకీభవించడం లేదా పునరుద్ఘాటించడం చేస్తుంది. ఏ కారణం లేకుండా ఆలస్యం చేయడమేమిటనేది ఇక్కడ సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్న.

ఒత్తిడి అవాంఛనీయం

వేర్వేరు హైకోర్టులకు ఆదేవిధంగా సుప్రీం కోర్టుకు నియామకాలు చేసే సమయంలో ఇలాంటి చాలా ప్రశ్నలు అడ్డం రావడం ఇటీవలికాలంలో బాగా పెరి గింది. సుప్రీం కోర్టుకు ఒరిస్సా మాజీ సిజె జస్టిస్ మురళీ ధరన్‌ను ఒకటికి రెండుసార్లు సిఫార్సు చేసినా ఆమోదించకపోవడం ఇలాంటి వాటిలో బాగా విమర్శకు గురైంది. ఎన్ని అర్హతలున్నా తనను సుప్రీంకోర్టుకు రానివ్వకుండానే పదవీ విరమణ చేయించడం ఉద్దేశపూర్వకమేనని న్యాయ వర్గాలు నిర్ధారిస్తున్నాయి. 1982లో ఎస్‌పి గుప్తాకు సంబంధించిన మొదటి జడ్జిల కేసు,1993లో సుప్రీంకోర్టు అన్ రికార్డ్ అడ్వకేట్సు కేసు,1998లలో మూడవ జడ్జిల కేసు, వీటన్నిటిలోనూ అత్యున్నత న్యాయస్థానం తన వైఖరిని చెబుతూ వస్తున్నది. 2014లో నేషనల్ జ్యుడిషి యల్ అపాయింట్‌మెంట్స్ కేసులో జ్యుడిషియల్ కమిషన్ నియామకాన్ని కోర్టు నిలిపేసింది. జడ్జిలే జడ్జిలను నియమించుకునే పద్ధతి కాకుండా అందుకు సమగ్రమైన జ్యుడిషియల్ కమిషన్ వుండాలనేది వాస్తవమే. అయినా మోడీ ప్రభుత్వం ఆ పేరుతో కేవలం నియామకాలు మొత్తంగా తన చేతిలోకి తీసుకోవాలనే రీతిలో వ్యవ హరిం చడం కూడా సరైంది కాదు. సమగ్ర సంస్కరణలతో కూడిన కమిషన్ కాకుండా తనకు నచ్చిన విధంగా ఆ కమిషన్‌ను రూపొందించాలను కోవడం అవాంఛనీయం. దీనికి తోడు ప్రధాని మోడీ, మంత్రులూ తరచూ న్యాయ వ్యవస్థపై చేసే వ్యాఖ్యలు దాన్ని మరింత పెంచాయి. ఇక ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ ఆ పదవి పరంగానూ, రాజ్యసభ చైర్మన్ హోదాలో కూడా నేరుగా కోర్టులను సవాలు చేసేట్టు మాట్లాడుతుంటారు.ఒక సందర్భంలో ఆయన మాటలను కోర్టు ధర్మాసనం దాదాపు సూటిగానే ఖండించిన ఉదంతాలున్నాయి. అయినా ఇటీవల కూడా సిబిఐపై, ఎన్నికల సంఘంపై వ్యాఖ్యానాలు చేయకూడదని ఆయన సెల విచ్చారు.మొత్తంపైన అటూ ఇటూ వాదనలు ఎలావున్నా న్యాయమూర్తుల నియామ కంలో జాప్యం, కేంద్రం జోక్యం వంటి అనేక విమర్శలు అనుభవాల రీత్యా న్యాయవ్యవస్థ స్వతంత్రతనూ, ప్రజా స్వామిక నియామక ప్రక్రియనూ సమతుల్యం చేయడం చాలా అవసరమనేది నిర్వివాదాంశం. పైగా కేంద్రం చేసే ఎడతెగని ఆలస్యం న్యాయాన్ని మరింత అందకుండా కేసులు గుట్టలు పడటానికి కారణమవుతున్నది.మరి ప్రస్తుతం జరుగుతున్న విచారణలో మరోసారి కేంద్రం ఏం చెబుతుందో, సుప్రీం కోర్టు ఎలాంటి ఆదేశాలిస్తుందో వేచిచూడాల్సిందే.

ఎర్ర కాగడా



ఉదయ కిరణ బాణాలు
ఒక నిరంకుశత్వాన్ని చీల్చేస్తూ
నిత్య నిర్మల వికాసానికి
వారధిగా నిలబడి గెలిచింది
ఎర్ర జెండా రెపరెపలు
ఒక వినూత్న గేయాలాపనకు
సమసమాజ గీతికగా
నిరంతరం పోరాటం చేసింది
అట్టడుగు నిర్బంధాలతో
ఒక గీత అడ్డంగా వచ్చినప్పుడు
ఎరుపు కండ్ల పరిష్కారపు ఒరవడి
ఉవ్వెత్తున లేచి నిలబడింది

అణగదొక్కే పరిణామపు కోరల్ని
ఎర్రటి కాగడా వెలుగు ఖడ్గం
ఖండించే పనిలో నిమగ్నమైంది
ఆ ఎర్ర సూరీడు మండుతుంటే
వెక్కిరించే అరచేతుల మధ్యన
పెదబబ్బుల గుణపాఠం
ఒక పరిష్కారపు మార్గమైంది

చిన్న చూపుల పరంపరలో
దూరమౌతున్న మానవతకు
బుద్ధి చెప్పే ఉద్యమాల పోరు గడ్డ
ఒక్కసారిగా దండెత్తి కదిలింది

ఎగురుతున్న ఎరుపు పతాకం
కొడవండ్లు చేతబట్టి
కలుపు మొక్కల కొత్తకై కదులుతూ
సమధర్మ పాలిత ప్రాంతానికై
సమర శంఖం పూరిస్తూ కదిలింది

బడుగు సమర భేరి నినాదంలో
అనచబడే ప్రక్రియకు తిలోదకాలిస్తూ
పగ్గాలను చేతబట్టే చైతన్యానికి
ఊతమిస్తూ ఉరకలేస్తోంది
ఎర్రసూరీడు సాక్షిగా
ఒక ఉద్యమ బాట
ఒక ఉద్ధారణ హోమానికి
ఆజ్యం పోస్తూ బతుకునిస్తోంది
సమాజంలో బతకనిస్తోంది

- నరెద్దుల రాజారెడ్డి,
9666016636

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికుల సంక్షేమానికే!

బీమా కంపెనీల లాభాల కోసం కాదు!!


వంగూరు రాములు
9490098247

తెలంగాణ ప్రభుత్వం మరియు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా పదకొండు రకాల పథకాలు అమలవుతున్నాయి. ప్రమాద, సహజ మరణం, పాక్షిక అంగవైకల్యం, శాశ్వత అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టి బోర్డు బాధ్యతల నుండి వైదొల గాలనే ప్రయత్నం చేయడం కార్మికరంగానికి అన్యాయం చేయడమే. ఆగస్టు 21న ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్లు ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 27 వరకు గడువు పెట్టి 28న టెండర్లు ఓపెన్ చేసి ఆ తరువాత అమలు చేస్తున్నట్లు టెండర్ నోటీసు ద్వారా ప్రకటించింది. ఈ సంక్షేమ పథకాలను 15.9 లక్షల మంది భవన, ఇతర నిర్మాణ కార్మికులకు,పది వేల మంది గిగ్ వర్కర్స్‌కు కూడా వర్తింపచేస్తున్నట్లు పేర్కొంది. బీమా కంపెనీలకు వెల్ఫేర్ బోర్డు స్కీంలను అప్పగించడం మూలంగా కార్మికులకు వచ్చే అదనపు లాభం ఏమిటి? బెనిఫిట్స్ ఏమైనా పెరుగుతాయా? కొత్త సంక్షేమ పథకాలు ఏమైనా అమల్లోకి తెస్తున్నారా? వెల్ఫేర్ బోర్డు ఏర్పడింది కార్మికుల సంక్షేమం కోసమే, కానీ బోర్డు నిధులు ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టి వారి లాభాలు పెంచడం కోసం కాదు. కార్మికులకు ఏ ప్రయోజనాలు లేనప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడమెందుకు? ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలు సవరణలో భాగంగా మిషన్ మోడ్ ప్రాజెక్ట్ పేరుతో అన్ని రాష్ట్రాల్లో వెల్ఫేర్ బోర్డులలో ఉన్న నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడం కోసం ఎంఎంపిని తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. భవన నిర్మాణ కార్మికులు దేశవ్యాప్త సమ్మె పోరాటంతో వెనక్కు తగ్గింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వా లపై ఒత్తిడి తెచ్చి అమలు చేయించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. దేశంలో ఏ రాష్ట్రంలో బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వలేదు. మన తెలంగాణను ప్రయోగశాలగా అమలుకు పూనుకుంటున్నది.

బీమా కంపెనీలకు ఎందుకు?

రాష్ట్రంలో అనేక పోరాటాల ఫలితంగా 2009లో వెల్ఫేర్ బోర్డు ఏర్పడింది. ప్రమాద మరణానికి రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.లక్ష, దహన సంస్కరణల ఖర్చు రూ.30 వేలు, శాశ్వత అంగవైకల్యం రూ.5 లక్షలు, పాక్షిక అంగవైకల్యం రూ.4 లక్షలు, ప్రసూతి సహాయం రూ.30 వేలు, వివాహ కానుక రూ.30 వేలు, చనిపోయిన వారిని సొంత గ్రామానికి తీసుకుపోవడానికి వాహన కిరాయి, హాస్పిటల్ ఖర్చులు తదితర సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు కొంత అండగా ఉన్నాయి. ఇంకా 60 ఏండ్ల వయస్సు పైబడిన వారికి పెన్షన్, కార్మికుల పిల్లలు చదువుకోవడం కోసం స్కాలర్‌షిప్‌లు, గృహవసతి, కార్మిక అడ్డాల్లో షెడ్ల నిర్మాణం, మంచినీరు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలు ఢిల్లీ, హర్యానా, పంజాబ్, కర్నాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నూతన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం లేదు. ఉన్న స్కీమ్‌లకు నిధులూ పెంచడం లేదు. 2009 నుండి ఇప్పటివరకు పాత స్కీమ్‌లే అమలు చేస్తున్నారు, ప్రభుత్వాలు మారినా సంక్షేమ పథకాల్లో ఎలాంటి మార్పు లేదు. భవన నిర్మాణ కార్మికులకు రక్షణగా ఉన్న వెల్ఫేర్ బోర్డు స్కీంలు బీమా కంపెనీలకు ఇవ్వడం, ఈ కొద్దిపాటి సహాయం కూడా కార్మికులకు అందకుండా కాకులను కొట్టి గద్దలకు వేసిన చందమే అవతుంది.

రాష్ట్రంలో 25,71,880 మంది కార్మికులు వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు చేసుకుంటే 15.9 లక్షల మంది మాత్రమే బోర్డులో అర్హత ఉన్నట్లు సర్కార్ లెక్కలు. మిగతా 10.50 లక్షల మంది కార్మికులకు



ఎందుకు వర్తించవు? వారిని రెన్యువల్ చేయకుండా ఎందుకు అధికారులు నిర్లక్ష్యం చేశారు. 2009లో మ్యానువల్ రిజిస్ట్రేషన్ చేసి, ఇప్పుడు డిజిటలైజ్ చేస్తూ వారి పేర్లు కంప్యూ టర్‌లో లేవని, వారికి నష్ట పరిహారాలు, సంక్షేమ పథకాలు అందించడం లేదు. బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులందరినీ రెన్యువల్ చేయిం చుకోవాలని గుర్తుచేయాల్సిన బాధ్యత కార్మిక శాఖ అధికార్లకు లేదా? మ్యాన్యువల్ చేసిన పేర్లు కంప్యూటర్‌లోకి ఎక్కించాల్సింది ఎవ్వరు. కార్మిక అధికార్ల తప్పులకు కార్మికులను బలిచేస్తారా? ఇప్పుడు రెన్యువల్ కాలేదనే పేరుతో 10.50 లక్షల మంది కడుపుకొట్టి, కొద్దిమందికి కొన్ని స్కీంలు మాత్రమే అమలు చేసి, మిగతా స్కీంలకు ఎగనామం పెట్టడం కోసమే ఇన్సూరెన్స్ కంపెనీలకా! భవన నిర్మాణ కార్మికులతో ఎలాంటి సంబంధాలు లేని గిగ్ వర్కర్స్‌ను బోర్డులో ఎలా మెర్జ్ చేస్తారు? వారికి ఎక్కడ నుండి ప్రీమియం చెల్లిస్తారనేది స్పష్టత లేదు. భవన నిర్మాణ కార్మికుల నోట్లో మట్టి కొట్టి బడా కార్పొరేట్ ఇన్సూరెన్స్ కంపెనీల లాభాలు పెంచడం కోసమేనా? ప్రభుత్వ అధికారులకు వచ్చే కమీషన్ల కోసమే వెల్ఫేర్ బోర్డును బీమా కంపెనీలకు కట్టబెడుతున్నారు తప్ప, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదు.

బోర్డు నిధులు దుబారా

1996 భవన, ఇతర నిర్మాణ కార్మిక కేంద్ర చట్టం నిబంధనల ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించి వారి ఆమోదంతోనే నిధులను ఖర్చు చేయాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా అడ్వైజరీ కమిటీని నియమించకుండానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఇష్టానుసారంగా వేల కోట్ల రూపాయలు దుబారా చేసింది. తెలంగాణ ఏర్పడిన నాటినుండి 2024 జూలై వరకు రూ.5 వేల 65 కోట్లు సెస్సు ద్వారా బోర్డులో జమయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి మన రాష్ట్రానికి రావల్సిన వాటా రూ.450 కోట్లు బ్యాంకులో మూలుగుతున్నాయి. గత పదేండ్లగా బోర్డు నుండి అన్నిరకాల నష్టపరిహారాలు, 3,02,687 మంది కార్మికులకు, రూ.1613.5281 కోట్లు మాత్రమే కార్మికుల కోసం ఖర్చు చేశారు. ఇతర శాఖలకు బదిలీ చేసినవి అన్నీ కలిపి రూ.2,649.3286 కోట్లు. కార్మికుల కోసం ఖర్చు చేసిన నిధులకంటే ఇతర శాఖలకు బదిలీ చేసినవే రెండింతలు. బోర్డు నుండి ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధులు రూ.4262.8767 కోట్లుగా లెక్కలు చూపుతున్నారు. నిధులు పుష్కలంగా ఉన్న కార్మికుల సంక్షేమం మరిచి అడ్డగోలుగా నిధులు దుర్వినియోగానికి ప్రభుత్వం పాల్పడింది. కరోనా సమయంలో సివిల్ సప్లై శాఖకు రూ. 1,005 కోట్లు, బీసీ బంధు కోసం బీసీ సబ్ ప్లాన్‌కు రూ.500 కోట్లు, సిఎస్‌సి వైద్య పరీక్షల పేరుతో రూ.300 కోట్లు, ఐటిఐ పేరుతో రూ.325 కోట్లు, ఆయుష్మాన్ భారత్‌కు రూ.92 కోట్లు, వృత్తి నైపుణ్యం పెంచు టకు రూ.300 కోట్లు, చలివేంద్రాల నిర్వహణ, ఆఫీస్ సుందరీకరణ పేరుతో వేల కోట్ల రూపాయలు నిబంధనలకు విరుద్ధంగా అడ్డ దారిలో ఇతర శాఖలకు దారి మళ్లించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసింది.

బోర్డే ముద్దు - కంపెనీలు వద్దు

ఇప్పుడు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు సంక్షేమ పథకాలు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగిస్తే భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, లేబర్‌కార్డులో చిన్న అచ్చు తప్పులు వెతికి కార్మికులకు అందకుండా చేసే ప్రమాదముంది. ప్రస్తుతం అందుతున్న పదకొండు రకాల సంక్షేమ పథకా లను నాలుగు స్కీంలకు తగ్గిస్తారు. బోర్డులో ఉన్న నిధులు మొత్తం కాజేసి, బోర్డునే దివాళా తీయించి, వెల్ఫేర్ బోర్డు ఉనికే ప్రమాద కరంగా మారుతుంది. స్కీంలు ఇప్పించడం కోసం మధ్యవర్తులు, కొత్తరకం బ్రోకర్లు తయారవుతారు. అనేక కొత్త రూల్స్ రూపొందించి కార్మికులను కొత్తగా నమోదు చేయ కుండా, రెన్యువల్ చేయకుండా కార్మికులకు నష్టపరిహారాలు అంద కుండా చేస్తారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులకు ఇంత నష్ట దాయకంగా ఉన్న ఇన్సూరెన్స్ కంపె నీలకు ఇవ్వాలనే ఆలోచనను ఉపసంహరించుకొని ప్రభుత్వమే వెల్ఫేర్‌బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి. అడ్వైజరీ కమిటీని నియమించి, అక్రమంగా వివిధ శాఖలకు దారి మళ్లించిన వేల కోట్ల నిధులు తిరిగి బోర్డులో జమ చేయాలి.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలు సవరణలో భాగంగా మిషన్ మోడ్ ప్రాజెక్ట్ పేరుతో అన్ని రాష్ట్రాల్లో వెల్ఫేర్ బోర్డులలో ఉన్న నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడం కోసం ఎంఎంపిని తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. భవన నిర్మాణ కార్మికులు దేశవ్యాప్త సమ్మె పోరాటంతో వెనక్కు తగ్గింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి అమలు చేయించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. దేశంలో ఏ రాష్ట్రంలో బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వలేదు. మన తెలంగాణను ప్రయోగశాలగా అమలుకు పూనుకుంటున్నది. కేంద్రం విధానాలకు నిరసనగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వ్యతిరేకిస్తూ, పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డు రక్షణకు కార్మిక సంఘాలన్నీ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి)గా ఏర్పడ్డాయి. సెప్టెంబర్ 23న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. లేబర్ కమిషనర్ కార్యాయలం వద్ద జరిగే ధర్నాలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు పాల్గొని కార్మికుల సత్తా చాటాలి.

ఎస్‌బీఐ సామాజిక సేవల బలోపేతం

- అంధుల ఎన్‌జీఓకు మద్దతు
- పాల్గొన్న చైర్మెన్ సిఎస్ శెట్టి



నవతెలంగాణ- హైదరాబాద్

దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన సామాజిక కార్యక్రమాలను మరింత బలోపేతం చేసింది. శనివారం హైదరాబాద్ పర్యటనలో ఎస్‌బీఐ చైర్మెన్ సిఎస్ శెట్టి పలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంధుల ఎన్‌జీఓ దేవ్‌నర్ ఫౌండేషన్‌కు భారీ సాయం అందించారు. అదే విధంగా ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ చేపట్టిన 'అమ్మ పేరుతో ఒక్క చెట్టు' కార్యక్రమంలో ఆయన మొక్కలను నాటారు. సాయి సేవ సంఘ్‌కు ఎస్‌బీఐ లేడిస్ క్లబ్ నిత్యావసర సరుకులను అందించింది. దేవ్‌నర్ ఫౌండేషన్‌కు రూ.51 లక్షల విలువ చేసే ఫైర్ ఫైటింగ్ సిస్టమ్, సోలార్ ఫోటోవోల్టయిక్ సిస్టమ్‌ను సిఎస్ శెట్టి అందించారు. 2055 నాటికి శూన్య ఉద్గారాలకు చేరాలని తమ బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

దేవ్‌నర్ ఫౌండేషన్‌కు చెందిన సాయిబాబ గౌడ్ గొప్ప సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారని శెట్టి ప్రశంసించారు. ఇలాంటి వాటికి తమ బ్యాంక్ మద్దతును అందిస్తుందన్నారు. వైద్య, విద్యా, వాతావరణ,మహిళల సాధికారతకు తమ సంస్థ ఎల్లప్పుడు మద్దతును అందిస్తుందని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్ పేర్కొన్నారు.

మరో మూడ్రోజులు వర్షాలు

- గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- 23న బంగాళాఖాతంలో వాయుగుండం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. "పశ్చిమ మధ్య బంగాళా ఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న నైరుతిలో ఎగువ గాలులలో ఆవర్తనం కొనసాగుతోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో, తూర్పు, పశ్చిమ గాలి విచ్ఛిన్నతిలో కేంద్రీకృతమై, మధ్య ట్రో పోస్పిరిక్ స్థాయి వరకు విస్తరించింది. దీని ప్రభావం వల్ల సెప్టెంబర్ 23న వాయువ్య, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉంది" అని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దీని ప్రభావం వల్ల ఆది, సోమ వారాల్లో రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, ఆసిఫాబాద్, వికారాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉంది. సోమవారం.. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, మహబూబాబాద్, సూర్యాపేట, కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఆపరేషన్ ధూల్‌పేట్ ఉధృతం

- గంజాయి విక్రయాలపై ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల ఉక్కుపాదం
- 240 కేజీల గంజాయి పట్టివేత
- 116 మంది స్మగ్లర్ల అరెస్ట్.. పరారీలో 58 మంది నిరంతరం దాడులు: ఏసీపీ అంజిరెడ్డి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర రాజధానిలో గంజాయి స్మగ్లర్లకు డెన్‌గా మారిన ధూల్‌పేట్‌లో రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు ఆపరేషన్ ధూల్‌పేట్‌ను ఉధృతం చేశారు. ఈ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకున్న గంజాయి స్మగ్లర్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయటానికి అధికారులు వ్యూహాత్మక దాడులను చేపట్టారు. అప్పర్ ధూల్‌పేట్, లోయర్ ధూల్‌పేట్, జుంగూరుబస్తీ, బంగ్లాదేశ్, జాలీ హనుమాన్ ప్రాంతాల్లో ఏకకాలంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన 8 టీంలతో ఈ దాడులను జరుపుతున్నారు. గత 28 రోజుల్లో అనుమానిత ఇండ్లు, భవనాలతో పాటు వాహనాలను సోదాలు చేస్తూ గంజాయి పెడ్లర్లను ఎక్కడికక్కడ కట్టడి చేయటం ప్రారంభించారు. ఈ సందర్భంగా 240 కేజీల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారుల దాడులతో అనేక మంది గంజాయి పెడ్లర్లు తమ వద్ద ఉన్న గంజాయితో సహా పారిపోయారు. అయినప్పటికీ.. 116 మంది గంజాయి స్మగ్లర్లను అధికారులు అరెస్ట్ చేశారు. మరో 58 మంది వరకు కరుడుగట్టిన గంజాయి స్మగ్లర్లు తమ అడ్డాలను వదిలి పారిపోయినట్టు అధికారులు గుర్తించారు.

తమ ధూల్‌పేట్ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంటుందని హైదరాబాద్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ జాయింట్ కమిషనర్ ఖురేషీ, ధూల్‌పేట్ విభాగం ఎక్సైజ్ ఏసీబీ అంజిరెడ్డిలు 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ తెలిపారు. ధూల్‌పేట్ ప్రాంతంలోకి గంజాయి ఎలా దిగుమతి అవుతున్నది, ఏ ప్రాంతాల నుంచి దానిని ఎక్కువగా రవాణా చేస్తున్నారు, దీనికి అసలు సూత్రధారులు ఎవరు అన్నది కనిపెట్టటానికి దర్యాప్తును ముమ్మరం చేసినట్టు చెప్పారు. తాము అరెస్ట్ చేసిన గంజాయి స్మగ్లర్లలో మహిళలు కూడా ఉన్నారని వారు తెలిపారు. రాష్ట్రం నుంచి డ్రగ్స్ మాఫియాను తరిమి కొట్టాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు తమ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని వారు చెప్పారు. కాగా, అడపాదడపా వచ్చి దాడులు చేసే కన్నా నిరంతరం ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో సోదాలను నిర్వహిస్తే ఈ గంజాయి మహమ్మారిని అరికట్టవచ్చని అనేకమంది స్థానికులు కోరుతున్నారు. గంజాయేగాక ఎంబీఎంఏ మాదక పదార్థాల కోసం ప్రతిరోజు దూర ప్రాంతాల నుంచి వ్యసనపరులు వచ్చి ఖరీదు చేస్తున్నారనీ, వీటిపై నిరంతర నిఘాతోనే కఠినంగా అణచివేయొచ్చని స్థానికులు సూచిస్తున్నారు.

28న రాష్ట్రానికి రాష్ట్రపతి ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈ నెల 28న రాష్ట్రానికి రానున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆమె శనివారం అధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి తన ఒకరోజు పర్యటన సందర్భంగా, ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవుతారని ఆమె తెలిపారు. అనంతరం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ క్రమంలో శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ సీఎస్ అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. విమానాశ్రయం, రాష్ట్రపతి నిలయం, అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రపతి కార్యాలయ అవసరాలకు అనుగుణంగా సహాయక సిబ్బందితో పాటు మహిళా వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలనీ, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను కోరారు.

కార్మికోద్యమ నేత లారెన్స్ కన్నుమూత



కోచి : కార్మికోద్యమ నేత, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం.ఎం.లారెన్స్ (95) శనివారం నాడిక్కడ ఆస్పత్రిలో కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధ సమస్యలతో ఆయన గత కొంతకాలంగా బాధ పడుతున్నారు. కార్మికుల హక్కుల కోసం గట్టిగా పోరాడిన యోధుడు. కేరళలో పారిశుధ్య పనివారలందరినీ ఏక తాటిపైకి తెచ్చిన తొలి తరం కార్యకర్తల్లో ఆయన ఒకరు. ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు, బంధువుల సందర్శనార్థం ఆస్పత్రి నుంచి ఆయన నివాసానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయం లెనిన్ సెంటర్‌కు తీసుకెళతారు. అటు పిమ్మట ఎర్నాకుళం టౌన్‌హాల్‌లో ప్రజల సందర్శనార్థం వుంచుతారు. అనంతరం వైద్య పరిశోధనల నిమిత్తం ఎర్నాకుళం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఆయన భౌతికకాయాన్ని అందజేస్తారు.

పొలిట్‌బ్యూరో సంతాపం

యూనియన్ నేత, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎం.ఎం.లారెన్స్ మృతి పట్ల పార్టీ పొలిట్‌బ్యూరో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. వివిధ పదవుల్లో పార్టీకి ఆయన విశేష సేవలందించారని కొనియాడింది. ఎర్నాకుళం జిల్లా కార్యదర్శిగా, కేరళ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఆయన సుదీర్ఘకాలం పని చేశారని తెలిపింది. అతడు ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడు. ఎల్‌డిఎఫ్ కన్వీనర్‌గా కూడా పని చేశారు. ఆయన కుటుంబసభ్యులకు పొలిట్‌బ్యూరో తన సానుభూతిని తెలియజేసింది.

అవిశ్రాంత పోరాట యోధుడు

యువకుడిగా వుండగానే క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన లారెన్స్ ఎడపల్లి పోలీసు స్టేషన్‌పై దాడి చేసినందుకు అరెస్టయ్యారు. పార్టీలోనూ, బయట ప్రజా జీవనంలోనూ ఆయన పోరాటయోధుడిగానే వున్నారు. తాను నమ్మిన సిద్ధాంతాలు, విలువల కోసం ఆయన అవిశ్రాంతంగా పోరాడారు. ఏడు దశాబ్దాలకు పైబడిన ఆయన రాజకీయజీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు వున్నాయి. క్రమశిక్షణ కలిగిన కార్మిక సంఘ నేత అయిన లారెన్స్ సీఐటీయూలో ఉపాధ్యక్షుడితో సహా అనేక పదవులు నిర్వహించారు.సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళనలతో దేశం అట్టుడుకుతున్న వేళ రాజకీయ రంగ ప్రవేశం చేసిన లారెన్స్ విద్యార్థిగా వున్నప్పుడు మూడు రంగుల బ్యాడ్జీని చొక్కాజేబులో పెట్టుకున్నందుకు ఎర్నాకుళం స్కూలు నుండి తొలగించారు. ఆ తర్వాత వేరే స్కూలుకు మారినా పదో తరగతి తర్వాత ఆయన చదువు కొనసాగించలేదు. తన పూర్తి సమయాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు, కమ్యూనిస్టు పార్టీకే కేటాయించారు. అవిభక్త కమ్యూనిస్టు పార్టీకి ఎర్నాకుళం మండల కార్యదర్శిగా తొలినాళ్లలో పనిచేసిన ఆయన 1968 నుండి 1977 వరకు సీపీఐ(ఎం) ఎర్నాకుళం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1978 నుంచి 1998 వరకు సీపీఐ(ఎం))) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా వున్నారు. 1980లో ఇడుక్కి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

సీఐటీయూ సంతాపం

లారెన్స్ మృతికి సీఐటీయూ సంతాపం వ్యక్తం చేసింది. 18ఏండ్ల చిరు ప్రాయంలోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన లారెన్స్ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఏఐటీయూసీ నేతగా సఫాయి పనివారలనందరినీ ఒక్క తాటిపైకి తీసుకురావడానికి ఆయన కృషి చేశారు. 1950లో చట్ట విరుద్ధంగా నిర్బంధించిన సహచరులను సమర్థించినందుకు గానూ పోలీసుల చేతుల్లో చావుదెబ్బలు తిన్నారు. జైలు జీవితం కూడా అనుభవించారు. సీఐటీయూ వ్యవస్థాపక నేతల్లో ఆయన ఒకరు. కార్మికుల హక్కులు, వారి ప్రయోజనాల కోసం అలుపెరగని పోరాటం చేసిన లారెన్స్ 1983 నుంచి 2010 వరకు సీఐటీయూ కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా,ఆలిండియా కార్యదర్శిగా చేశారు. 2000 నుండి 2003 వరకు సీఐటీయూ ఉపాధ్యక్షుడిగా వున్నారు. కొచిన్ పోర్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడిగా, జలరవాణా కార్మిక సమాఖ్య నేతగా కూడా పనిచేశారు. ఆయన మృతికి సంతాపసూచకంగా సీఐటీయూ పతాకాన్ని అవనతం చేశారు.

ఏఐకేఎస్ సంతాపం

కార్మికులు, కర్షకుల మధ్య ఐక్యత ఆవశ్యకతను లారెన్స్ ఎప్పుడూ నొక్కి చెప్పేవారని పేర్కొంటూ అఖిల భారత కిసాన్ సభ ఘనంగా నివాళులర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నట్టు ఏఐకేఎస్ అధ్యక్ష కార్యదర్శులు అశోక్ ధావలె, విజ్జూ కృష్ణన్‌లు పేర్కొన్నారు. రాబోయే తరాలకు కూడా ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన మృతికి సంతాపసూచకంగా ఏఐకేఎస్ పతాకాన్ని అవనతం చేశారు.

మహిళలు మార్పునకు ప్రధాన పాత్రధారులు కావాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- మహిళలు ప్రశ్నించాలి :సుధామూర్తి
- ఓయూలో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్



నవతెలంగాణ-ఓయూ

మహిళలు మార్పునకు ప్రధాన పాత్రధారులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం హైదరాబాద్ ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో "ఆల్ ఇండియా ఉమెన్ అకాడెమిషన్స్ కాన్ఫరెన్స్" "ఎన్విజనింగ్ న్యూ భారత్" అనే థీమ్‌తో, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసర్చ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు మద్దతు ఇవ్వడానికి ఫెమినిస్ట్ దృక్పథాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదని, ఇది భారతీయ సాంస్కృతిక విలువలకు అనుగుణంగా ఉంటుందని అన్నారు. కొత్తదనాన్ని వెతకడం కంటే సంప్రదాయ ఆలోచనలను పునర్నిర్మించడం, పునరుద్ధరించడం అవసరమని తెలిపారు.

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ.. మహిళలు సమాజానికి విలువల ను అందించడంలో కీలక పాత్ర పోషించారనే విషయాన్ని గుర్తు చేశారు. మహిళలు ప్రశ్నించాలని, వారికి మార్గనిర్దేశం చేయడం తప్ప, నియంత్రించకూడదని తెలిపారు. సవాళ్లను ఎదుర్కొనడం, కఠిన పరిస్థితులను అధిగమించడం, విద్యార్థులకు విలువలు నేర్పించడం ముఖ్యమని చెప్పారు. ఇతరులతో కాకుండా మనతో మనం పోటీపడటమే ముఖ్యంగా ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు మార్పును తీసుకురావడానికి తమ శక్తిని ఉపయోగించాలని సూచించారు. ఏబీఆర్ఎస్ఎం నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ముఖ్యంగా మహిళా విద్యావేత్తలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు పరస్పరం ఆలోచనలు పంచుకోవడం, ఒకరిని ఒకరు ప్రోత్సహించుకోవడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐసీఎస్ఎస్ఆర్, ఎస్‌టీసీ డైరెక్టర్ డా.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సదస్సు మహిళా ఉపాధ్యాయులను శక్తివంతం చేయడంలో కీలకంగా ఉందని ప్రశంసించారు. దేశ వ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, సహకారం, మద్దతు, వృత్తిపరమైన అభివృద్ధి కోసం ఈ ప్రయత్నం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. జేఎన్‌యూ వీసీ ప్రొ.శాంతిశ్రీ పండిట్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో మహిళా నాయకత్వం కీలకమని, పురుషుల కంటే సమావేశ మందిరంలో ఎక్కువ మంది మహిళలు ఉండటం అందుకు సంకేతమని అన్నారు. మహిళలు మరింతగా నాయకత్వ భూమికలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతి.. మహిళలను రక్షించడంలో, శక్తివంతం చేయడంలో కమిషన్ పాత్రను చర్చించారు.సవాళ్లను అధిగమించడంతో పాటు, హక్కులు కోల్పోయిన వ్యక్తులందరికీ న్యాయం అందించడంలో కమిషన్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అదనంగా, వివిధ శాఖలు, రంగాల్లో సహకారం పెంపొందించడానికి ఎన్‌హెచ్ఆర్‌సీ మహిళల కోసం అనేక శిక్షణా కార్యక్రమాలు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వ హించినట్టు తెలిపారు. మహిళా సాధికారత అవసరాన్ని ప్రస్తావించి, పురుషుల దృక్పథంలో మార్పు అవసరమని ఐఏఎస్ అధికారి దేవసేన సూచించారు. మహిళల దుస్తులపై వ్యాఖ్యలు చేయడం ఆపి, ఇంటిలో, పని ప్రదేశంలో వారికి మరింత స్వేచ్ఛను ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కిషన్, ప్రొఫెసర్ కవితా దేవి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ తల తీసుకురావాలనడం గర్హనీయం

దానిపై బీజేపీ సమాధానం చెప్పాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలో మత పరిస్థితులపై వ్యాఖ్యలు చేసినందుకు ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ తల తీసుకురావాలని బీజేపీ నాయకులు పిలుపునివ్వడం గర్హనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తలలు తీసుకువచ్చే సంస్కృతి ఎవరిదో ఆపార్టీ చెప్పాలనీ, హిందూ మతం పేరుతో అరాచకాలు సృష్టిస్తున్న బీజేపీనే హిందూ తాలీబన్ అని విమర్శించారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, ఎన్ బాలమల్లేష్, కలవేణ శంకర్, ఎమ్ బాలనర్సింహాతో కలిసి మాట్లాడారు. చౌకబారు రాజకీయాలు, ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న వారు చాలా తప్పు చేస్తున్నట్టేననీ, అలాంటి వ్యాఖ్యల వల్ల దేశం నిరంతరం అగ్నిగుండంలా ఉండేలా చేస్తున్నారని అన్నారు. ప్రజలు కూడు, గూడు, ఉపాధి తదితర సమస్యల గురించి మాట్లాడకుండా దృష్టి మరల్చేందుకే ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ తప్పు చేస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనీ, అలా కాకుండా రాహుల్‌ను టెర్రరిస్టు అని సాక్షాత్తు బీజేపీ మంత్రే ముద్ర వేస్తున్నారన్నారు. హిందూ మతం పేరుతో ఏమైనా మాట్లాడటాన్ని హక్కుగా భావించడం అభ్యంతరకరమన్నారు. హైడ్రా అంటే పేదల్లో అభద్రతాభావం రాకూడదనీ, ఆక్రమణదారులకు మాత్రం భయం ఉండాలని అభిప్రాయపడ్డారు.

హైడ్రా ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీకి 'సూరవరం ప్రతాపరెడ్డి' పేరును, కోఠిలోని మహిళా యూనివర్సిటీకి 'వీరనారి చాకలి ఐలమ్మ' పేరును, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి 'కొండా లక్ష్మణ్ బాపూజీ' పేరును పెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై మగ్దూం మోహియుద్దీన్ విగ్రహం ఉన్న చోటే, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి విగ్రహాలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ సాయుధ పోరాటయోధులు షోయబుల్లాఖాన్, షేక్ బందగీ, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి వీరులను కూడా సముచితంగా గౌరవించాలని చెప్పారు.

అన్నవరం టూ హైదరాబాద్

- హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- 2.3 కిలోల హాష్ ఆయిల్, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం
- మరోచోట చాక్లెట్స్‌గా గంజాయి సరఫరా



నవతెలంగాణ-హయత్‌నగర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరం నుంచి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్‌ను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని నలుగురిని ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 2.3 కిలోల హాష్ ఆయిల్, 5 సెల్‌ఫోన్లతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎల్బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. సైదాబాద్ టెలికాం క్వార్టర్స్‌లో నివాసముంటున్న వి.రంజిత్‌కుమార్, మీర్‌పేట్ తిరుమళా ఎన్‌క్లేవ్‌కు చెందిన బి.సాయి నితిన్, బి.నరేంద్ర, ఎల్‌బీనగర్‌కు చెందిన బి.సాయి కృష్ణ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ప్రయివేటు రంగంలో ఉద్యోగాలు చేస్తున్న వీరు జల్సాలకు అలవాటు పడ్డారు. దాంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో విశాఖపట్నం వెళ్లి గంజాయి, హాష్ ఆయిల్, డ్రగ్స్ దందా నిర్వహించే సాయిని కలుసుకున్నారు. సాయి నుంచి హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో కొద్ది రోజుల కిందట సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

9 రోజుల అనంతరం బయటకు వచ్చిన తర్వాత తిరిగి హాష్ ఆయిల్ సరఫరా చేయాలని అన్నవరం వెళ్లారు. అక్కడ సాయి వద్ద 5గ్రాములకు రూ.2వేల చొప్పున 2700 గ్రాముల హాష్ ఆయిల్ కొనుగోలు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ తీసుకొచ్చి మీర్‌పేట్‌లోని సాయి నితిన్ ఇంట్లో దాచిపెట్టారు. చిన్నచిన్న బాటిళ్లలో హాష్ ఆయిల్‌ను నింపి సరఫరా చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు మీర్‌పేట్ పోలీసులతో కలిసి ఈనెల 21న ఉదయం నిందితులను అరెస్టు చేశారు. కిలో హాష్ ఆయిల్ తయారు చేయాలంటే 35 నుంచి 40 కేజీల గంజాయిని నిందితులు ఉపయోగిస్తారని సీపీ తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సాయి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు.

చాక్లెట్ మాటున గంజాయి సరఫరా

చాక్లెట్స్ రూపంలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని ఆదిభట్ల పోలీసులు, మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలనూ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. బీహార్‌కు చెందిన సంతోష్ కుమార్ అలియాస్ సంతోష్ ప్రసాద్ హైదరాబాద్‌లో హెచ్ఎఫ్‌సీఎల్ కంపెనీ కేబుల్ వైర్ ఇన్‌స్టాలేషన్‌లో పని చేసేవాడు. అందులో పనిచేసే కూలీలకు గంజాయిని అలవాటు చేశాడు. బీహార్‌లో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరకు చాక్లెట్స్ రూపంలో అమ్మేవాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అతనితోపాటు బీహార్‌కు చెందిన బీరేందర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3.8కేజీల గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ రాజు తదితరులు ఉన్నారు.

రూ.8,888 కోట్ల కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తుందని అంటున్నారని పేర్కొన్నారు. ఐహెచ్‌పీ అనే కంపెనీ ఈ మేరకు సెబీకి సమాచారం ఇచ్చిందని తెలిపారు. తొమ్మిది నెలల రేవంత్ పాలనలో జరుగుతున్న కుంభకోణాలకు సంబంధించిన వివరాలను ప్రజల ముందు వరుసగా ఉంచుతామని కేటీఆర్ తెలిపారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఫోర్త్ సిటీ వంటి కుంభకోణాల్లో వేల కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్వయంగా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఈ కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు. అమృత్ పథకం అనేది కేంద్ర ప్రభుత్వ పథకమనీ, అందుకే టెండర్లలో జరిగిన అక్రమాలపై కేంద్ర పట్టణాభివద్ధి శాఖ మంత్రులకు లేఖ రాశామని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉన్నా, అమృత్ పథకంలో జరిగిన అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో బీజేపీ కుమ్మక్కు కాకపోతే పూర్తిస్థాయి ఎంక్వైరీకి కేంద్రం ఆదేశించాలని డిమాండ్ చేశారు.

రుజువు చేయకుంటే రాజీనామాకు సిద్ధమా?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలనీ, రుజువు చేయకుంటే రాజీనామాకు సిద్ధమా అని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. "2023 సెప్టెంబర్ 20న రూ.3,616 కోట్ల చొప్పున 3 ప్యాకేజీలుగా గత ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఎన్నికల కోడ్ ఉన్నా అనుమతి తీసుకొని .పీఎల్ఆర్, మేఘా, గజా కంపెనీలకు ఇతర కంపెనీలతో కలిపి 3.99 ఎక్సెస్‌తో పనులు అప్పగించారు. టెండర్లలో అవకతవకలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారించిన నేపథ్యంలో తమ ప్రభుత్వం తిరిగి రూ. 3,515 కోట్ల విలువగల టెండర్లను పిలిచింది. గత సర్కార్ కంటే తక్కువ(2.44) ఎక్సెస్‌తో జేఎస్ఆర్, కోయా, ఏఎమ్ఆర్ కంపెనీలు ఇతర కంపెనీలతో కలిపి టెండర్లు దక్కించు కున్నాయి" అని పొంగులేటి వివరించారు. ఎక్కడా అవినీతి అక్రమాలు జరగ లేదని స్పష్టం చేశారు. కేటీఆర్ ఆరోపించిన సృజన్ రెడ్డికి 2015లో పాలమూరు, రంగారెడ్డి ప్యాకేజీ నెంబర్ ఏడులో రూ.1,100 కోట్ల కాంట్రాక్టు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పగించిందని గుర్తు చేశారు. కేటీఆర్ ఆరోపించి నట్టుగా సాదా కంపెనీకి 20శాతం వాటా ఉందని స్పష్టం చేశారు. ఇందులో దాయాల్సిందేమీ లేదని తేల్చి చెప్పారు. సృజన్‌రెడ్డి సీఎంకు సొంత బావమరిది కాదనీ, దూరపు బంధువు మాత్రమేనని గుర్తు చేశారు. ఖమ్మంలో తనపై పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి ఉపేందర్‌రెడ్డి అల్లుడే సృజన్‌రెడ్డి అని చెప్పారు. ఆయనకు తమతో కంటే కేటీఆర్, కేసీఆర్‌తోనే వ్యాపార పరంగా, రాజకీయ పరంగా దగ్గరి సంబంధం ఉందని పేర్కొన్నారు. టెండర్లు వేయొద్దని తాము ఏ కంపెనీని బెదిరించలేదని అన్నారు. ప్రభుత్వం పిలిచిన రీ టెండర్లలో గతంకంటే రూ.54 కోట్లు తక్కువకే బిడ్లు వచ్చాయని మంత్రి పొంగులేటి చెప్పారు. కొడంగల్ టెండర్లపై కూడా తగిన సమయంలో ఆధారాలతో స్పందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తప్పుడు ఆరోపణలు చేసిన కేటీఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావావేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రయివేటు, కార్పొరేటు ఆస్పత్రులపై నిరంతర నిఘా

- ప్రతి నెలా నివేదికలు ఇవ్వాలి
- అధికారులకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నిత్యం తనిఖీలు జరపాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఆ వివరాలను ప్రతి నెలా తనకు నివేదిక రూపంలో అందించాలని సూచించారు. ఫుడ్ సెక్యూరిటీ అధికారులు ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో డైట్ క్యాంటీన్లను తనిఖీ చేయాలని చెప్పారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలు నెలకు కనీసం రెండుసార్లు జిల్లాల్లోని ఆస్పత్రుల్ని సందర్శించాలనీ, హెచ్ఆర్, అటెండెన్స్, ఎక్విప్‌మెంట్, మెడిసిన్, శానిటేషన్, డైట్ సహా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. శనివారంనాడాయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలనీ, గిరిజన ప్రాంతాల్లో గర్భిణుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ (ఈడీడీ) వివరాలతో ప్రత్యేకంగా క్యాలెండర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని కోరారు.

తిరుమల లడ్డూ కల్తీపై కఠిన చర్యలు తీసుకోండి

- ఏపీ సర్కార్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోట్లాది ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఆ దిశగా పోలీసు యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ముందుకు వెళ్తున్నాయని ఆశిస్తున్నానని చెప్పారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులను, చేపనూనెలను వినియోగించడం క్షమించరాని నేరమని అన్నారు. అలాగే తిరుపతిలో అన్యమత ప్రచారం, తిరుమల కొండపైకి మద్యం, మాంసాహారాన్ని తీసుకెళ్లడం, టీటీడీలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే వార్తల పట్ల సర్కార్ దృష్టి పెట్టాలని సూచించారు. కోట్లాది భక్తుల మనోభావాల తో ముడిపడిన ఈ అంశాన్ని సంచలనాత్మకంగా మార్చొద్దని రాజకీయ పార్టీలకు, ధార్మిక సంస్థలకు విజ్ఞప్తి చేశారు. పదేపదే తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలతో భక్తుల నమ్మకం, విశ్వాసం సడలే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో బాధ్యతతో వ్యవహరించి అందరూ సంయమనం పాటించాలని సూచించారు.

రౌడీషీట్స్ ఓపెన్ చేస్తాం

- ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేయొద్దు
- తార్నాక ఆస్పత్రిలో డ్రైవర్‌ను పరామర్శించిన ఎమ్‌డీ సజ్జనార్



నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. నిందితులపై పోలీసుల సహకారంతో రౌడీషీట్స్ ఓపెన్ చేస్తామన్నారు. శుక్రవారం అఫ్జల్‌గంజ్ నుంచి ఘట్‌కేసర్‌కు వెళ్తున్న రూట్ నెంబర్ 231/1 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ గణేష్‌పై ఉస్మానియా యూనివర్సిటీ వై జంక్షన్ వద్ద ఆరుగురు దుండగులు అసభ్య పదజాలంతో దూషిస్తూ, విచక్షణారహితంగా దాడి చేసి, గాయపరిచారు. దీనితో డ్రైవర్ అపస్మారకస్థితిలోకి వెళ్లారు. ఆయన్ని వెంటనే తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో డ్రైవర్‌ది ఎలాంటి తప్పు లేకున్నా, బైక్‌లపై వచ్చిన వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడ్డారని విచారణలో తేలింది. శనివారం ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ తార్నాక ఆస్పత్రిలో డ్రైవర్ గణేష్‌ను పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుండగులపై భారత న్యాయ సంహితలోని 109, 132, 352, 351(2), ఆర్/డబ్ల్యూ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారనీ, ఐదుగురు దుండగులను శనివారం అరెస్ట్ చేశారని సజ్జనార్ తెలిపారు. ప్రజల మధ్య విధులు నిర్వర్తించే టీజీఎస్‌ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేయడం బాధాకరమన్నారు. సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతిస్తూ, మనోవేదనకు గురిచేసే ఇలాంటి దాడులను యాజమాన్యం ఏమాత్రం సహించబోదని, నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రైవర్‌ను పరామర్శించిన వారిలో జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, తార్నాక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజామూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఆస్పత్రి ఓఎస్డీ సైదిరెడ్డి, సికింద్రాబాద్ ఆర్‌ఎం ఖుస్రోషా ఖాన్ తదితరులు ఉన్నారు.

యుద్ధోన్మాదాన్ని తరిమికొట్టాలి

- మాజీ ఎమ్మెల్సీ కే యాదవరెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భూగోళం మీద యుద్ధోన్మాదం, సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టేందుకు శక్తివంతమైన యువతరం ముందుకు రావాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ నేత, మాజీ ఎమ్మెల్సీ కే యాదవరెడ్డి అన్నారు. ప్రపంచశాంతి కవి సమ్మేళనం శనివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దీనిలో పాల్గొన్న కవులు ప్రపంచ శాంతిపైకవితలను వినిపించారు. ఇజ్రాయిల్, అమెరికా యుద్ధోన్మాదం, పాలస్తీనా, ఉక్రెయిన్, రష్యా మధ్య జరుగుతున్న యుద్ధాలను ఖండించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ కవులు తమ కవిత్వం ద్వారా సమాజాన్ని మార్చగలిగే శక్తివంతులని అన్నారు అంతర్జాతీయంగా జాతీయంగా జరుగుతున్నటువంటి పరిణామాలను కవులు గ్రహించి రచనలు చేయాలని ఆకాంక్షించారు. డాక్టర్ డీ సుధాకర్ మాట్లాడుతూ యుద్ధాలను నివారించాలన్నారు. రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవియల్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రమేష్‌చంద్ర శాంతి అవార్డును కే యాదవరెడ్డికి అందచేశారు. సీనియర్ నాయకులు జీ రఘుపాల్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తాం

- డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేయాలని నిర్ణయించాం : మంత్రి పొన్నం ప్రభాకర్
- చంచల్‌గూడ, వనస్థలిపురంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసీ ఆధునీకరణలో భాగంగా చేపడుతున్న పనుల వల్ల నష్టం జరిగే కుటుంబాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని, ఈ విషయంలో ఎవరూ ఎలాంటి ఆందోళనా చెందొద్దని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను ప్రపంచ స్థాయికి తీసుకొని పోవడానికి మూసీ నది తీరాన్ని టూరిజం హబ్‌గా చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. చంచల్‌గూడ, వనస్థలిపురంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను శనివారం ఉదయం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూసీనది అభివృద్ధిలో భాగంగా నిర్దేశించిన పనుల్లో భాగంగా ఇండ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత మూసీ బాధితులకు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు.సుమారు 90 ఇండ్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ నగరానికి సాంస్కృతికంగా పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. బాధిత కుటుంబాల్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి కింద లబ్ది చేకూర్చేలా చర్యలు తీసుకుంటా మన్నారు. నిరుపేదలు కూడా డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని అడుగుతున్నారని, వారికి కూడా న్యాయం చేస్తామని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా 3,500 మందికి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జంట జలాశయాలకు గోదావరి నీరు సరఫరా కోసం రూ.2005 కోట్ల నిధులు కేటాయించినట్టు తెలిపారు. తద్వారా మూసీ నదిలో మురుగు నీరు లేకుండా స్వచ్ఛంగా ఉంటుందని, టూరిజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. చంచల్‌గూడ ఎక్స్‌రోడ్‌లో 284 ఇండ్లు నిర్మించారని, అందులో 142 మందికి పంపిణీ చేయగా.. 142 ఇండ్లు ఖాళీగా ఉన్నట్టు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. మంత్రి వెంట రాష్ట్ర మున్సిపల్, పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రామిరెడ్డి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకటాచారి, ప్రతిమాసింగ్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, హౌసింగ్ సీఈ అనిల్‌రాజ్, ఎస్ఈ, కార్పొరేటర్ షహీద్, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు, హయత్‌నగర్ డీసీ తిప్పర్తి యాదయ్య ఉన్నారు.

ఆదివాసీల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

పరిష్కారానికి ప్రభుత్వం కృషి : మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాని, తన పరిధిలో లేని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. మహిళా శక్తి క్యాంటిన్, వికాసం పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం సార్మెడీలు, పటేళ్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను సార్మెడిలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తాము అస్థిత్వం కోల్పోతున్నామని, ఆదివాసీ మహిళలను ఇతరులు పెండ్లిలు చేసుకొని భూ బదలాయింపులు చేసుకుంటున్నారని తెలిపారు. పోడు భూముల సమస్యలు, నిరుద్యోగం పెరిగాయని వారు ఆవేదన వ్యక్తం చేశారని మంత్రి వివరించారు. రాయి సెంటర్‌ల బలోపేతం కోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమగ్ర నివేదిక రూపొందించి ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీనిచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు ఇస్తామని వివరించారు. తమ పరిధిలో లేని సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్‌ఆలం పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- పార్టీ సమీక్షా సమావేశంలో మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను అందిస్తూ...అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. అయినా బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని చేస్తున్నాయనీ, దాన్ని తిప్పికొట్టాలని పార్టీ నాయకులకు ఆయన పిలుపుచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో ఆయన సమీక్షా సమావేశాలను నిర్వహించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పని తీరుపై ఆయన సమీక్షించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిశా నిర్దేశం చేశారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి : మల్లు రవి

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలనే అంశంపై టీపీసీసీ అధ్యక్షులు పార్టీ నాయకులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని ఎంపీ మల్లు రవి చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని తిప్పి కొట్టి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించాలని సూచించారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అందిస్తున్నట్టు తెలిపారు. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

బస్సులో ప్రయాణికుడికి గుండెపోటు

- సీపీఆర్ చేసి ప్రాణం కాపాడిన మహిళా కండక్టర్
- ఆర్టీసీ సిబ్బందికి సన్మానం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో \ కుత్బుల్లాపూర్

బస్సులో గుండెపోటు వచ్చిన ప్రయాణికుడికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించిన సిబ్బందిని టీజీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ అభినందించారు. హైదరాబాద్ బస్‌భవన్‌లో శనివారం జీడిమెట్ల డిపోనకు చెందిన కండక్టర్ అంజలి, డ్రైవర్ సైదులును ఆయన ఘనంగా సన్మానించారు. జీడిమెట్ల డిపోనకు చెందిన 192/1 రూట్ నంబర్ బస్సు శుక్రవారం బాలానగర్ నుంచి బహదూర్‌పల్లి వైపునకు వెళ్తుండగా, చింతల్ ఐడీపీఎల్ బస్టాప్ వద్దకు రాగానే మురళీకృష్ణ అనే ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. ఈ విషయాన్ని కండక్టర్ అంజలి గుర్తించి, డ్రైవర్ సైదులును అప్రమత్తం చేసి బస్సును ఆపించారు. వెంటనే 108కు ఫోన్ చేశారు.

ఒక ప్రయాణికుడి సాయంతో మురళీకృష్ణకు సీపీఆర్ చేశారు. అనంతరం ఆయన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. సమయానికి సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన కండక్టర్ అంజలి, డ్రైవర్ సైదులును సజ్జనార్ అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, చీఫ్ పర్సనల్ మేనేజర్ ఉషాదేవి, జీడిమెట్ల డిపో మేనేజర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



అమెరికా నేపథ్యంలో..

ఒక వైపు అగ్ర కథానాయకులతో భారీ చిత్రాలు చేస్తూనే, మరోవైపు యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ వైవిధ్యమైన చిత్రాలను నిర్మిస్తున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తాజాగా మరో కొత్త చిత్రాన్ని ప్రారంభించింది.

అశోక్ గల్లా కథానాయకుడిగా ప్రొడక్షన్ నెం.27 చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది.

సినీ ప్రముఖుల సమక్షంలో ఈ చిత్ర ప్రారంభోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. నమ్రత ఘట్టమనేని ఫస్ట్ క్లాప్ ఇవ్వగా, పద్మ గల్లా, మంజుల స్వరూప్ తమ చేతుల మీదుగా స్క్రిప్ట్‌ని చిత్ర బృందానికి అందజేసి, సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో అశోక్ గల్లాతో పాటు 'మ్యాడ్' ఫేమ్ శ్రీ గౌరీ ప్రియ, 'కోట బొమ్మాళి పి.ఎస్' ఫేమ్ రాహుల్ విజయ్, శివాత్మిక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అమెరికా నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రానికి యువ దర్శకుడు ఉద్భవ్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబర్ నెలాఖరు నుంచి చిత్ర బృందం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనుంది.

ఈ చిత్రంలో కడుపుబ్బా నవ్వించే హాస్యంతో పాటు, హృదయాన్ని హత్తుకునే డ్రామా ఉంటుందని, ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని నిర్మాతలు తెలిపారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడు: భరద్వాజ్ ఆర్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య.

లడ్డు గాని పెళ్లి..



కళాశాల నేపథ్యంలో ముగ్గురు యువకులు చేసే అల్లరి ప్రధానంగా రూపొందిన వినోదాత్మక చిత్రం 'మ్యాడ్' ఎంతటి సంచలన విజయాన్ని సాధించిందో తెలిసిందే.

దీనికి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'లడ్డు గాని పెళ్లి' అనే బారాత్ గీతంతో ప్రచార కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించింది చిత్ర బృందం. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా దీన్ని విడుదల చేశారు.

'మ్యాడ్' చిత్రంలో భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన 'కళ్ళజోడు కాలేజీ పాప' అనే పాట యువతను విశేషంగా ఆకట్టుకొని చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు 'మ్యాడ్ స్క్వేర్' కోసం ఆయన స్వరపరిచిన ఈ గీతం అంతకుమించిన ఆదరణ పొందుతుంది అనడంలో సందేహం లేదు. గాయని మంగ్లీతో కలిసి భీమ్స్ సిసిరోలియో స్వయంగా ఈ గీతాన్ని ఆలపించారు. సినిమా ఇతివృత్తం, పాత్రలకు అనుగుణంగా.. కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం అందరూ పాడుకునేలా ఎంతో అందంగా ఉంది. అందరూ మెచ్చుకునేలా 'మ్యాడ్' చిత్రాన్ని రూపొందించిన రచయిత, దర్శకుడు కళ్యాణ్ శంకర్.. సీక్వెల్‌ను మరింత వినోదాత్మకంగా మలిచే పనిలో ఉన్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

శ్రీకరా స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సమర్పణ : సూర్యదేవ నాగవంశీ.

ఫ్లాష్ బ్యాక్ లేనిది ఎవరికి?



ఏఎస్ రవికుమార్

'యజ్ఞం, పిల్లా నువ్వు లేని జీవితం' లాంటి బ్లాక్‌బస్టర్ మూవీస్‌ని అందించిన డైరెక్టర్ ఏఎస్ రవికుమార్ చౌదరి తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా ఓ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చేస్తున్నారు.

ఎఎస్ రిగ్వేద చౌదరి సమర్పణలో ఆద్య ఆర్ట్ ప్రొడక్షన్ బ్యానర్ పై కార్తీక్ రెడ్డి రాకాసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఫ్లాష్ బ్యాక్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ని ఖరారు చేశారు. 'లేనిది ఎవరికి?' అనే క్యాప్షన్ క్యురియాసిటీని క్రియేట్ చేసింది.

'దర్శకుడు రవికుమార్ చౌదరి సినిమాల్లో వినోదానికి, యాక్షన్‌కి కొదవే ఉండదు. దీంతోపాటు ఈ సినిమాకి పెట్టిన టైటిల్ సరికొత్తగా ఉండటంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సరికొత్త కాంబినేషన్‌లో ఈ చిత్రాన్ని తనదైన శైలిలో ఆయన ప్రజెంట్ చేయనున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.

న్యూ ఏజ్ స్టోరీతో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర వివరాలని మేకర్స్ త్వరలో తెలియజేస్తారు. ఈ చిత్రానికి మ్యూజిక్: జెబి, డీవోపీ: ప్రభాకర్ రెడ్డి, లిరిక్స్: సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను, ఫైట్స్: వెంకట్, రైటర్: డైమండ్ రత్నం బాబు.

ఆటలు

యువ బ్యాటర్లు రిషబ్ పంత్ (109), శుభ్‌మన్ గిల్ (119) చెపాక్‌లో సెంచరీ మోత మోగించారు. పంత్, గిల్ శతకాలతో చెలరేగటంతో తొలి టెస్టులో టీమ్ ఇండియా పట్టు బిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా పరుగులు పిండుకున్న రోహిత్‌సేన.. బంగ్లాదేశ్‌కు 515 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

టెస్టులో పునరాగమనాన్ని రిషబ్ పంత్ ఘనంగా చాటాడు. 634 రోజుల తర్వాత టెస్టు క్రికెట్ ఆడుతున్న రిషబ్ పంత్.. రీ ఎంట్రీలోనే సెంచరీతో చెలరేగాడు. తనదైన ట్రేడ్‌మార్క్ షాట్లతో విజృంభించిన పంత్.. విలక్షణ షాట్లతో బంగ్లాదేశ్ బౌలర్లపై శివతాండవం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా నిష్క్రమించిన గిల్ ఈసారి మూడంకెల స్కోరు అందుకున్నాడు.

515 పరుగుల భారీ ఛేదనలో బంగ్లాదేశ్ ఎదురీదుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి టాప్ ఆర్డర్‌లో నాలుగు వికెట్లు కోల్పోయిన బంగ్లాదేశ్ 158 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ విజయానికి మరో 357 పరుగులు అవసరం కాగా.. భారత్ విక్టరీకి మరో ఆరు వికెట్ల దూరంలో నిలిచింది. భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టులో నేడు నాల్గో రోజు ఆట.

పంత్, గిల్ శతక మోత

- సెంచరీలతో కదం తొక్కిన యువ బ్యాటర్లు
- భారత్ రెండో ఇన్నింగ్స్ 287/4 డిక్లేర్డ్
- బంగ్లాదేశ్ లక్ష్యం 515, ప్రస్తుతం 158/4



నవతెలంగాణ-చెన్నై

చెపాక్ టెస్టులో టీమ్ ఇండియా విజయానికి చేరువైంది!. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ప్రదర్శన కనబరుస్తున్న భారత్ నాల్గో రోజే గెలుపు గీత దాటేందుకు సిద్ధమవుతోంది. యువ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్ (119 నాటౌట్, 176 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), రిషబ్ పంత్ (109, 128 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక మోగించారు. దీంతో బంగ్లాదేశ్ ముంగిట 515 పరుగుల కొండంత లక్ష్యం నిలిచింది. మరో రెండున్నర రోజుల ఆట మిగిలి ఉండగా ఛేదన షురూ చేసిన బంగ్లాదేశ్ అశ్విన్ స్పిన్ మాయకు అప్పుడే నాలుగు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ నజ్ముల్ హొసేన్ శాంటో (51 నాటౌట్, 60 బంతుల్లో 4 ఫోర్లు 3 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో బంగ్లాదేశ్ పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ ఛేదనలో 37.2 ఓవర్లలో 158/4 పరుగులు చేసింది.

అశ్విన్ మాయ

515 పరుగుల లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ దూకుడు చూపించింది. ఓపెనర్లు జాకిర్ హసన్ (33), షాద్‌మ్యాన్ ఇస్లామ్ (35)లు తొలి వికెట్‌కు 62 పరుగులు జోడించారు. పిచ్ నుంచి సహకారం లేకపోయినా పేస్ దళపతి బుమ్రా తొలి బ్రేక్ అందించాడు. జాకిర్ హసన్‌ను సాగనంపి వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ మాయజాలం చూపించాడు. ఓ ఎండ్‌లో నజ్ముల్ శాంటో (51 నాటౌట్) పేస్, స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. అజేయ అర్ధ సెంచరీతో కెప్టెన్ ముందుండి నడిపించాడు. కానీ మరో ఎండ్‌లో అశ్విన్ మాయ చేశాడు. ఇస్లామ్, మోమినుల్ హాక్ (13) సహ ముష్ఫీకర్ రహీమ్ (13)లను అశ్విన్ అవుట్ చేశాడు. శాంటో, షకిబ్ (5 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచారు. భారత్ విజయానికి మరో ఆరు వికెట్ల దూరంలో నిలువగా.. బంగ్లాదేశ్‌కు మరో 357 పరుగులు అవసరం. బ్యాటర్లలో లిటన్ దాస్, మెహిది హసన్ మిరాజ్ బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది.

ఆ ఇద్దరు శతకొట్టారు

ఓవర్‌నైట్ స్కోరు 81/3తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. యువ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్ (119 నాటౌట్), రిషబ్ పంత్ (109) శతకాలతో వేగంగా పరుగులు పిండుకుంది. ఓ ఎండ్‌లో పంత్ ధనాధన్ దంచికొట్టగా.. మరో ఎండ్‌లో గిల్ సమయోచిత ఇన్నింగ్స్ నమోదు చేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 88 బంతుల్లోనే పంత్ అర్ధ సెంచరీ సాధించాడు. 124 బంతుల్లో సెంచరీ బాదిన పంత్.. రీ ఎంట్రీని ఘనంగా చాటాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో అర్ధ సెంచరీ అందుకున్న గిల్.. 161 బంతుల్లో శతకం సాధించాడు. స్పిన్నర్లు, పేసర్లపై పంత్ విలక్షణ షాట్లతో అలరించగా.. గిల్ ఆఖరు వరకు అజేయంగా నిలిచాడు. కెఎల్ రాహుల్ (22 నాటౌట్) నాలుగు ఫోర్లతో మెరిశాడు. 64 ఓవర్లలో 4 వికెట్లకు 287 పరుగులు చేసిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌ను 514 పరుగుల ఆధిక్యంతో డిక్లరేషన్ ప్రకటించింది.



స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 376/10

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : 149/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి (సి) లిటన్ (బి) రానా 10, రోహిత్ (సి) జాకిర్ (బి) టస్కిన్ 5, గిల్ నాటౌట్ 119, కోహ్లి (ఎల్బీ) మిరాజ్ 17, పంత్ (సి,బి) మిరాజ్ 109, రాహుల్ నాటౌట్ 22, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం :** (64 ఓవర్లలో 4 వికెట్లకు) 287 డిక్లేర్డ్.

వికెట్ల పతనం : 1-15, 2-28, 3-67, 4-234.

బౌలింగ్ : టస్కిన్ అహ్మద్ 7-1-22-1, హసన్ మహ్మద్ 11-1-43-0, నహిద్ రానా 6-0-21-1, షకిబ్ 13-0-79-0, మిరాజ్ 25-3-103-2, మోమినుల్ 2-0-15-0.

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ : జాకిర్ (సి) యశస్వి (బి) బుమ్రా 33, ఇస్లామ్ (సి) గిల్ (బి) అశ్విన్ 35, నజ్ముల్ శాంటో నాటౌట్ 51, మోమినుల్ (సి) రాహుల్ (బి) 13, ముష్ఫీకర్ రహీమ్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13, షకిబ్ నాటౌట్ 5, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం :** (37.2 ఓవర్లలో 4 వికెట్లకు) 158.

వికెట్ల పతనం : 1-62, 2-86, 3-124, 4-146.

బౌలింగ్ : బుమ్రా 7-2-18-1, సిరాజ్ 3.2-1-20-0, ఆకాశ్ 6-0-20-0, అశ్విన్ 15-0-63-3, జడేజా 6-0-29-0.

ఫ్రీ లోక్ అదాలత్‌లో 50కేసులు రాజీ

నవతెలంగాణ-హయత్‌నగర్



ఫ్రీ లోక్ అదాలత్‌ను హయత్‌నగర్ కోర్ట్ ఆవరణలో శనివారం నిర్వహించగా మొత్తం 50కేసులు రాజీ అయ్యాయని 14వ అదనపు కోర్ట్ జడ్జి సల్మా ఫాతిమా, ఏడవ అదనపు కోర్ట్ జడ్జి సంకేత్ మిత్ర అన్నారు. కక్షీ దారులు రాజీ కాదలచిన కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉందని దానిని ఇరువురు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టుకు వచ్చిన ప్రతి ఒక్కరూ స్నేహభావంతో మెలగాలి, ఆవేశంతో చేసిన పని ఏదైనా కూడా కోపతాపాలకు దారి తీసి కోర్టు మెట్లు ఎక్కేలా చేస్తుంది, ఏదైనా సమస్య వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలి, రాజీమార్గమే రాజ మార్గం అని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశీ రెడ్డి, హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్లు, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, కోర్ట్ సూపరిటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



బైరమల్‌గూడ ఎస్.వి కాలనీలో నివాసం ఉంటున్న పల్లె రమేష్, రవళి దంపతులు వినా యక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన వేలం పాటలో కలశంను దక్కించు కున్నారు. వాళ్లు వరుసగా మూడవ సారి కలశంను కైవసం చేసుకున్నారు. వారి వెంట కూతుళ్లు చంద్రజా, తులసితో పాటు కుటంబ సభ్యులు, బంధు మిత్రులు ఉన్నారు.

నవతెలంగాణ- హస్తినాపురం



అనాథాశ్రమంలో

సినీ హీరో కార్తికేయ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సినీ హీరో కార్తికేయ గుమ్మకొండ జన్మదిన వేడుకలను శనివారం ఎల్బీనగర్‌లోని శ్రీ కీర్తన అనాథ వృద్ధ, బాలుర మరియు మానసిక వికలాంగుల ఆశ్రమంలో నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్దులు, చిన్నారుల మధ్య కార్తికేయ కేక్ కట్ చేశారు. తర్వాత వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం హీరో కార్తికేయ మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించడానికి ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. బాల్యం ప్రతి ఒక్కరీ జీవితంలో ఎంతో విలువైనదని అన్నారు జీవితంలో ఉన్నత స్థితికి చేరుకున్న తర్వాత తమ వంతుగా ఇతరులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆశ్రమంలో చిన్నారులు కంప్యూటర్ విద్యను నేర్చుకునేందుకు కావాల్సిన పరికరాలను విరాళంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మకొండ విట్టల్ రెడ్డి, వైస్ చైర్మెన్ జి. రజిని విటల్ రెడ్డి, డైరెక్టర్ లోహిత రెడ్డి, అకాడమిక్ డీన్ ఎస్ రాజశేఖర్, సిఏఓ శేషారావు, కీర్తన ఫౌండేషన్ నిర్వాహకులు అనిల్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాస వారోత్సవాలు

నవతెలంగాణ - వనస్థలిపురం



బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ గ్రామంలో హయత్ నగర్ ప్రాజెక్టు ఎస్‌టిపి నగర్ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ మాస వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హయత్ నగర్ ప్రాజెక్ట్ సీడీపీఓ రేణుక, సూపర్ వైజర్ సావిత్రిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దీనిలో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం ఈవెంట్లను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, చిన్న పిల్లలు గర్భిణీ స్త్రీలు పోషకాహారాన్ని తీసుకోవాలని, దీనివలన రక్తహీనత రాకుండా నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మన్సూరాబాద్ ప్రధానోపాధ్యాయులు దినేష్ కుమార్, ఉపాధ్యాయుడు రాధాకృష్ణ, పోషణ అభియాన్ యాదగిరి, డిస్టిక్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, డాక్టర్ మౌనిక, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఆర్‌పై పల్టీకొట్టిన కారు

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు
- మృత దేహాన్ని ఉస్మానియాకు తరలింపు
- కేసు నమోదు చేసిన పోలీసులు







నవతెలంగాణ -అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తారామతిపేట ఎగ్జిట్ నెం.10 వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి అదుపు తప్పి కారు పల్టి కొట్టిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి సీఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ నుంచి హైదరాబాద్ ఈసీఐఎల్ వైపు వెళ్తుతుండగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట ఎగ్జిట్ నెం.10 వద్దకు రాగానే ఎర్టీగ కారు అదుపు తప్పి పల్టి కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సొపతి శ్రీవెల్లి(23), మేడిశెట్టి శివ, శనిక అనిల్‌లకు తీవ్ర గాయాలు కాగా.. శ్రీవెల్లి ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హాస్పిటల్ కు తరలించారు. మృతురాలు సొపతి శ్రీవెల్లి ఈసీఐఎల్ నివాసిగా, గాయపడిన శివ జవహర్ నగర్ వాసిగా, శనిక అనిల్ దమ్మాయిగూడ వాసిగా గుర్తించి నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్కు స్థలాలను కాపాడాలని వినతి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పార్కు స్థలాలను కబ్జాకు గురి కాకుండా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంసిఆర్ కాలనీలోని ఒక లేఔట్లలో ప్రజల అవసరాల నిమిత్తం మూడు చోట్ల ఓపెన్ స్థలాలను వదిలేయడం జరిగిందని, ఆ స్థలాల వైశాల్యం 2160 గజాలు ఉంటుందని వీటిని కబ్జాకు గురి కాకుండా వెంటనే ప్రభుత్వం అధికారులు తమ ఆధీనంలోకి తీసుకొని..



వాటి చుట్టూ ప్రహరి గోడను ఏర్పాటు చేసి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ఉన్న పార్కులను కాపాడాలన్నారు. అందులో ఎంసిఆర్ కాలనీలో పార్కులను కొందరు కబ్జా చేయటం జరిగిందని ఆరోపించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా ఉన్న అన్ని పార్కు స్థలాలను, ఓపెన్ ప్లేసులను గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాల్సిందిగా ప్రభుత్వ అధికారులను కోరుతున్నామని తెలిపారు. వినతి అందజేసిన వారిలో రంగారెడ్డి జిల్లా బీజేవైఎం నాయకులు ఇల్లెందుల సాయి సంతోష్, మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం నాయకులు శివ ప్రసాద్ పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ అధికారులు
- మంత్రి మహేష్







నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలో ఉన్న వివిధ కాలనీలలో విద్యుత్ స్తంబాలు వంగి ప్రమాదకరంగా మారాయని, దీనిపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ సీనియర్ నాయకులు మంత్రి మహేష్ శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కాలనీలలో ఒక వైపు ఒరిగి ఉన్న స్తంబాలను సరిచేయాలని ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు వినతి పత్రాలను అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభాలను రోడ్డుపై వేయడం వలన ప్రజలు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కల్గుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో త్వరలో విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

గడ్డిఅన్నారం మార్కెట్

కమిటీ డైరెక్టర్‌గా బోయపల్లి గోవర్ధన్ రెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ గ్రామానికి చెందిన బోయపల్లి గోవర్ధన్ రెడ్డి గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసినట్టు తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషి చేసినట్టు చెప్పారు. తనపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్లు పరిశుభ్రంగా

ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట



నవతెలంగాణ-సిటీబ్యూరో

గణేష్ నిమజ్జనం పూర్తయిన నేపథ్యంలో నిమజ్జనం జరిగిన ప్రాంతాల్లో రోడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం జోనల్, అడిషనల్ కమిషనర్లు, ఇతర విభాగాల ఉన్నతాధికారులతో ఆమె టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంకా కొన్ని ప్రదేశాలలో శనివారం సైతం గణేష్ నిమజ్జనం జరుగుతున్నందున తగు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను అదేశించారు. నిమజ్జనానికి జోనల్ వారీగా నియమించిన సూపర్వైజర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మోడ్ కలర్ పేపర్స్‌ను చెత్తాచెదారంతోపాటు అపరిశుభ్రత ఉన్న ప్రాంతాలల్లో పరిశుభ్రంగా ఉండేందకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటి ద్వారా చెత్తను తొలగించాలన్నారు. ఇంటి పన్ను వసూలు లక్ష్యం మేరకు వసూలు చేయాలని, ట్యాక్స్ లక్ష్యం మేరకు వసూలుకు వారం వారం టార్గెట్ ఇవ్వాలని కమిషనర్ క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణలో భాగంగా ఇంటింటి సర్వే ప్రక్రియను పూర్తి చేసి తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి





మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ల ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అపుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్చత హి సేవా-2024లో భాగంగా విద్యార్థులకు స్వచ్చత పట్ల నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంటి చుట్టూ, పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం బడంగ్‌పేట్‌లోని బట్టేల్ గుట్ట పార్కు వద్ద చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘు, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు గట్టు బాలకృష్ణ, పెద్దబావి బాబు, సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను జయించవచ్చు



- వాసవీ శ్రీ నిలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ప్రారంభించిన హైదరాబాద్ జిల్లా అడిషినల్ జడ్జి కె.మురళీమోహన్



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధి చింతలకుంటలోని వాసవి శ్రీ నిలయంలో మా భూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక, ఎమ్ఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును శనివారం హైదరాబాద్ జిల్లా అడిషినల్ జడ్జి కె.మురళీమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ మహిళలు ప్రతి సంవత్సరం క్యాన్సర్‌తో పాటు అన్ని రకాల ఆరోగ్య సంబంధిత టెస్టులు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను సులువుగా జయించవచ్చని, క్యాన్సర్ వలన భయపడవలసిన అవసరం లేదని అన్నారు. ఎంతో మంది ప్రముఖులు ముందస్తుగానే టెస్ట్ చేయించుకొని కాన్సర్ విజేతలుగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. 160 మందికి ఓరల్, సర్వైకల్, పాప్ స్మియర్, మెమోగ్రామ్ టెస్టులు చేసినట్లు రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక, కో ఆర్డినేటర్ సర్వేశ్వర ప్రసాద్ తెలిపారు. ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులో ఎంఎన్‌జె కాన్సర్ ఆస్పత్రికి చెందిన 12 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. వాసవీ శ్రీ నిలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరగానే క్యాంపు ఏర్పాటు చేసిన ఎంఎన్‌జె కాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఎం శ్రీనివాసులుకు మా భూమి సాహిత్య సాంస్కృతిక చైతన్య వేదిక పక్షాన సమన్వయకర్త గొర్రెపాటి నర్సింహా ప్రసాద్, సభ్యులు ఉదయశంకర్, నాగిరెడ్డి, ఇ.రఘునందన్, శంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి శ్రీ నిలయం సొసైటీ డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, సంజీవ రావు, మాభూమి మహిళా సభ్యులు పద్మలత, శరణ్య, దివ్య రాజేశ్వరి, సుధా గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

చేనేత విభాగం ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం అర్పించిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, కుమార్ రావు, కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మసున రవి కుమార్, ప్రధాన కార్యదర్శి మాజీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు మచ్చ వరలక్ష్మి, భోగా జగదీశ్, అంకం శ్రీనివాస్, నర్సింగ్, కళ్యాణ్, కరుణ శ్రీ పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ పితామహుడు స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ నేత 13వ వర్ధంతిని పద్మశాలి నేత సంఘ కార్యాలయం, నాగార్జున కాలనీ, రాగన్నగూడ, తుర్కయంజాల్ గ్రామం యందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గంజి సంజీవ రాయుడు నేత, ప్రధాన కార్యదర్శి గంజి వెంకట మల్లికార్జున నేత , కోశాధికారి మాకం రమేష్ నేత, కార్యవర్గ సభ్యులు కర్నాటి అశోక్ నేత, సంఘ సభ్యులు తెలిపారు.



గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా చిలుక మధుసూదన్ రెడ్డి

- వైస్ చైర్మెన్‌గా భాస్కరా చారి
- 18 మంది సభ్యులతో నూతన పాలవర్గం ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ





నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా, వైస్ చైర్మెన్‌గా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, అనాజీపూర్ గ్రామానికి చెందిన చిలుక మధుసూదన్‌రెడ్డిని, గండి చెరువు గ్రామానికి చెందిన సీహెచ్ భాస్కరాచారితో పాటు 16 మంది డైరెక్టర్లతో కూడిన నూతన పాల పాలకవర్గం ఏర్పాటుకు ఏపీసీ కార్యదర్శి ఎం. రఘునందన్ రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

డైరెక్టర్లు వీరే..

దోమలపలి అంజయ్య, మేకం లక్ష్మి, చిన్నా రెడ్డి రఘుపతి రెడ్డి, చుంచు నర్సింహ, చిల్కూరి మచ్చేంద్ర రెడ్డి, మెగావత్ గణేష్, పి.జయపాల్ రెడ్డి, కులపతి నవరాజ్, బండి మధు సూధన్ రావు, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మొహమ్మద్ అబ్దుల్ ఇబ్రహీం, గిన్నం వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మెన్, (హయత్‌నగర్) రంగారెడ్డి జిల్లా మార్కెటింగ్ అధికారి, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, తుర్కాయంజాల్ మున్సిపాలిటీ, చైర్‌పర్సన్స్ ఉన్నారు.

విద్యార్థి నాయకుడుగా సీఎంఆర్ ..

విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన చిలుక మధుసూదన్ రెడ్డి... విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు/ఉద్యమాలు నిర్వహించారు. విద్యార్థుల సమస్యలతో పాటు మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన వంతు బాధ్యతను నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం టీఎన్ఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా, తెలంగాణ ఆవిర్భావ అనంతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేస్తూ కార్పొరేట్ కాలేజీ ఫీజుల దోపిడీపై, విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై విద్యార్థులతో కలిసి రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. విద్యార్థి ఉద్యమ నాయకుడుగా అంచెలంచెలుగా ఎదుగుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు, ఇటు యువ నేత రేవంత్ రెడ్డికి విధేయుడుగా ఉంటూ మంచి విశ్వాసాన్ని పొగుచేసుకున్నారు. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో చిలుక మధుసూదన్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ రెడ్డికి అత్యంత నమ్మిన బంటుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోసిస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారు. అదే నమ్మకం ఏఎంసీ చైర్మెన్ పదవి స్థాయికి తీసుకెళ్ళింది. ఏఎంసీ చైర్మెన్‌గా నియామకంతో సీఎంఆర్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుంటున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోంచాలని ఆకాంక్షిస్తున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-తుర్కయంజాల్



తెలంగాణలోనే అతిపెద్ద మార్కెట్ అయిన గడ్డిఅన్నారం మార్కెట్ యార్డ్ చైర్మెన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు శనివారం మధుసూదన్ రెడ్డిని రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నేతలు కలిసి అభినందనలు తెలియజేశారు. తర్వాత శుభాకాంక్షలు తెలియ జేస్తూ.. శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల అర్జున్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం

గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా కాంగ్రెస్ నాయకులు చిలుక మధుసూదన్ ఎన్నిక కావడం శుభ పరిణామమణి హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తర్వాత ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్త నుండి నాయకుల వరకు పార్టీలో సముచిత స్థానం కల్పించి.. తగిన ప్రాధాన్యత కాంగ్రెస్ పార్టీ ఇస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కారు ఆరు గ్యారెంటీలను అమలు పరిస్తూ తెలంగాణ ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ వెన్నుదన్నుగా నిలుస్తున్నదని అన్నారు.



నవతెలంగాణ
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
ఆదివారం | సెప్టెంబర్ 22, 2024 | www.navatelangana.com

జాతీయ లోక్ అదాలత్ గోడ పత్రికల ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చైర్మెన్, జడ్జి వి. బాల భాస్కర్ రావు , మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి యస్. రవీందర్ మూడో అదనపు మేజిస్ట్రేట్ చిరాగ్ మెహతా జాతీయ లోక్ అదాలత్ గోడ పత్రికలను శనివారం విడుదల చేశారు. ఈ గోడ పత్రికలు అన్ని పోలీస్ స్టేషన్‌లో ప్రదర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, కేసులను త్వరగా పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడ్తుతుందన్నారు. సివిల్, క్రిమినల్, చెక్కు బౌన్స్, వాహన ప్రమాద, బ్యాంకు రికవరీ, భూ వివాదాల కేసులు పరిష్కరించుకోవచ్చు సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని కోరారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి : సీడీపీఓ శారద



నవతెలంగాణ-శామీర్‌పేట

గర్భిణీ స్త్రీలు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సీడీపీఓ శారద అన్నారు. శనివారం మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలోని శామీర్‌పేట, అలియాబాద్ క్లస్టర్లలో ఉన్న ఉద్దేమర్రి గ్రామంలో పోషణా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సాముహిక శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు నాగమణి, రేణుక, సి హెచ్‌ఓ, ఎంపీహెచ్‌ఓ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలి



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రజలు స్వచ్ఛతహీ సేవలో భాగస్వాములు కావాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం పురపాలక సంఘం పరిధిలోని ఆరో వార్డు, 18వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో కౌన్సిలర్లతో కలిసి పాల్గొన్నారు. నాగారం పురపాలక సంఘం కార్యాలయం నుండి వికాస్ నగర్, హనుమాన్ టెంపుల్ రోడ్లను చీపుర్లతో ఊడ్చి అవగాహన ర్యాలీలు తీశారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ప్రజలు తాము నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను పారేయకుండా డోర్ టూ డోర్‌కు వచ్చే చెత్త ఆటో వారికి ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలో చేపడుతున్న పరిసరాల పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, ఆరో వార్డు కౌన్సిలర్ కౌకుంట్ల అనంతరెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

వినాయక లడ్డూకు రూ. 2,33,333



నవతెలంగాణ-బోడుప్పల్

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొదటి డివిజన్ కమలానగర్‌లో యువ చైతన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి పెద్ద లడ్డూ వేలంలో రూ.2,33,333లకు మురారి లాల్ దక్కించుకున్నారు. చిన్న లడ్డూ రూ.86,000 సింగ్గి రెడ్డి సందీప్ రెడ్డి, స్వామి వారి శాలువా రూ.13,000 ధరవాత రవి నాయక్ దక్కించుకున్నారు. వారికి మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి చేతులు మీదిగా లడ్డూను అందజేశారు. 20వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరు మహేష్, మధుసూధన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు రఘుపతి రెడ్డి, జావీద్ ఖాన్, మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మలమ్మ, శ్యామాల సాయిలు, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహా, కందుకూరి ఆంజనేయులు, శ్రీనివాస్ శామల, చిందం రమేష్, శామాల రమేష్, యూత్ సభ్యులు, పలు కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



- జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ జి. రాజు
- స్వచ్ఛ ఆటోలను ఉపయోగించుకొని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ జి.రాజు అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని బాల సరస్వతీ నగర్, చింతల బస్తీలోని బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద ఉన్న జీవీపీ చెత్త చెత్త పాయింట్‌ను శనివారం పరిశీలించి సంపూర్ణంగా తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు 150 గృహాలు చెత్త వేయకపోవడంతో బహిరంగంగా రోడ్ల పై చెత్త వేయటంతో జీవీపీలుగా ఏర్పడుతున్నాయని తెలిపారు. ఆ గృహాలకు జీవీపీలు అనుసంధానం చేసేందుకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు తమ ఇంటిలోని చెత్తను ఇవ్వాలని, అందుకు ప్రతి నెలా రూ.100 ఆటో డ్రైవర్‌కు ఇవ్వాలన్నారు. నిబంధనలను అతిక్రమించి బహిరంగ ప్రదేశాలలో రోడ్లపైన చెత్త వేస్తే రూ.1,000 జరిమానా విధించి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ ఊరపల్లి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ..చెత్త నిర్మూలన సమాజంలోని చైతన్యవంతమైన ప్రజల నుండి మాత్రమే జరుగుతున్నదని, ప్రజల సహకారం భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. స్వచ్ఛ ఆటోలను ఉపయోగించుకొని పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ ఉప వైద్య అధికారిని మంజుల, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, రాములు, గిరి, యాదగిరి, ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

చిన్నారుల్లో పౌష్టికాహారలోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. పోషణ మాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నాగారంలోని 18వ వార్డు ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రధాని మోడీ దేశంలోని చిన్నారుల్లో , గర్భిణీ స్త్రీలు , బాలింతలకు పౌష్టికాహార లోపం లేకుండా ఉండటానికి పోషణ్ అభియన్ అనే కార్యక్రమం ప్రవేశ పెట్టారని తెలిపారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడుగురు గర్భిణీలకు చైర్మెన్ చంద్రారెడ్డి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ఇచ్చి సామూహిక శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సీడీపీఓ శారద, మున్సిపల్ మేనేజర్ చంద్ర శేఖర్, కౌన్సిలర్ లు పంగా హరిబాబు, బిజ్జ శ్రీనివాస్ గౌడ్ , అంగన్వాడీ సూపర్వైజర్,అంగన్వాడీ టీచర్స్ , గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

ఐక్య కార్యాచరణతో సమస్యలను పరిష్కరించుకుందాం

- టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఎన్నిక







నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐక్య కార్యాచరణతో సమస్యలను పరిష్కరించుకుందామని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం తూంకుంటలోని మొగుళ్ల వెంకటరామిరెడ్డి గార్డెన్‌లో టీజీవో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యాక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షులుగా బి.వినోద్‌కుమార్, కార్యదర్శిగా డాక్టర్ కురుమూర్తిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యథితిగా హాజరైన ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు విడదీసి పాలన చేసిందన్నారు. ఇప్పటికీ కొన్ని కొత్త సంఘాలు పుట్టుకొచ్చి, ఉద్యోగుల మధ్య గందరగోళం సృష్టించే పని చేస్తున్నాయనీ, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వం డీఏలను పెండింగ్‌లో పెట్టిందనీ, హెల్త్ కార్డులు విషయం తేల్చలేదనీ, ఓడీలు లేవనీ, ఉద్యోగులకు గజం జాగా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉద్యోగుల ఐక్య కార్యాచరణతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టీజీవో బలోపేతానికి కృషి చేస్తున్నామనీ, అందులో భాగంగానే అన్ని జిల్లాల్లో సమావేశాలు, ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అసోసియేషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 75 అనుబంధ ఫోరంలు ఉన్నాయనీ, వారి సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా మహిళా అధికారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేషన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించి, జిల్లా కమిటీ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించారు. అన్ని పోస్టులకు ఒకే నామినేషన్ దాఖలు కావటంతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు ప్రకటించారు. ఈ కొత్త కమిటీ మూడేండ్లపాటు అమలులో ఉంటుందని ఆయన వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీజీవో నూతన కమిటీని 19 మందితో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.వినోద్ కుమార్, కార్యదర్శిగా పశుసంవర్థక శాఖ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ కురుమూర్తి ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జిల్లా ఆడిట్ ఆఫీసర్ కె.వెంకటేశం, ఉపాధ్యక్షులుగా ఐ.విజయకుమారి, డి.రవీందర్, ఎం.రఘునందన్ గౌడ్, జాయింట్ సెక్రెటరీగా విష్ణు వర్ధన్ రావు (ఎఫ్ఆర్ఓ), ఎం.అర్చన, ఆర్.ఎం.వి ఆనందరావు, ట్రెజరర్‌గా డి.కరుణాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సీహెచ్.రమేష్, పబ్లిసిటీ సెక్రెటరీగా డాక్టర్ ఈ.సత్యనారాయణ, ఆఫీసు సెక్రెటరీగా ఎస్.సాయికష్ణ, కల్చరర్ సెక్రెటరీగా బి.నాగమణి, స్పోర్ట్స్ సెక్రెటరీగా పి.శంకరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ శ్యామల హెచ్.నాయుడు, డాక్టర్ ఎస్.స్వాతి, పి.డాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30తేదీ వరకు జరుపుకునే పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అల్వాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మల్కాజిగిరి, అల్వాల్ సెక్టర్ పరిధిలో పోషణ మాసోత్సవం కార్యక్రమం న్యూ నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జీకే సరస్వతీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య తిథిగా హాజరై ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తల వేతనాల పెంపు కోసం కృషి చేస్తామని, ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన అంగన్వాడీ కార్యకర్తలకు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ స్వాతి, కార్పొరేటర్లు సబితా అనిల్ కిషోర్, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, మేకల్ సునీత రాము యాదవ్, సబిత అనిల్ కిషోర్, మాజీ కార్పొరేటర్ జీకే. శ్రీదేవి, నాయకులు రావుల అంజయ్య, బద్దం పరశురామ్ రెడ్డి, జీ.కే హనుమంతరావు, అంగన్వాడీ, సూపర్వైజర్‌లు అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి గురజాడ అప్పారావు 162వ జయంతిని శనివారం కమలానగర్ ఆఫీసులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం గొడుగు యాదగిరి రావు మాట్లాడుతూ.. గురజాడ అప్పారావు 1862 సెప్టెంబర్ 21వ తేదీన విశాఖపట్నంలో జన్మించారని గుర్తు చేశారు. ఆయన తెలుగు భాషను వాడుక భాషలో ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో అనేక కవితలు రాశారని తెలిపారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని దేశం గొప్ప తనాన్ని అందరికీ అర్థమయ్యేలా చెప్పారని తెలిపారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడి ఆచరణలో చేసి చూపించారని వివరించారు. కన్యాశుల్కాన్ని నాటక ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని పేర్కొన్నారు. కవితలతో ప్రజలను చైతన్య పరిచి సంఘసంస్కర్తగా, అభ్యుదయ రచయితగా నూతన వరవడిని సృష్టించారని చెప్పారు. వెంకటేష్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు ఆదర్శనీయులని అన్నారు. అనంతరం అందరూ చిత్రపటానికి పూలను వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాస్, ఉన్నికృష్ణన్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్, అక్షయ కాలనీల గణేశ్ లడ్డూకు భారీ ధర

- రూ.5.20 లక్షలకు దక్కించుకున్న అలజింగి అరుణ కిశోర్ నాయుడు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్ల ఎంఎల్ఆర్, అక్షయ కాలనీల గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు నిత్యం పూజలందుకున్న గణనాథుడికి కాలనీల ప్రజలు ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్, అక్షయ కాలనీల గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొలిసారిగా జరిగిన గణేశ్ లడ్డు వేలం పాటలో ఎంఎస్ఆర్ కాలనీకి చెందిన అలజింగి అరుణ కిశోర్ నాయుడు పాల్గొని లడ్డును రూ.5 లక్షల 20 వేల దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అలజింగి అరుణ కిశోర్ నాయుడు మాట్లాడుతూ.. గణేశ్ లడ్డు తమకు దక్కడం అదృష్టమన్నారు. విఘ్నేశ్వరుడి కరుణాకటాక్షాలు తమ కుటుంబంతో పాటు కాలనీవాసులందరిపైన ఉండాలని వేడుకుంటున్నామని పేర్కొన్నారు. గణేశ్ లడ్డును దక్కించుకున్న అలగింజి అరుణ కిశోర్ నాయుడు దంపతులను ఉత్సవ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బోడుప్పల్ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏర్పుల మహేష్‌తో పాటు గణేశ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ అలజింగి కిశోర్ నాయుడు. కో కన్వీనర్ ఉప్పల దేవరాజు, సభ్యులు బి.శ్రీనివాస్ రెడ్డి, అనంత రెడ్డి, దత్తు. కె.శశిధర్ రెడ్డి, ఉపేందర్, నవీన్, రమేశ్, సుధాకర్, శివారెడ్డి వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనానికి హాజరైన పరమేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ హైటెన్షన్ లైన్ రోడ్డు ప్రశాంత్ నగర్‌లో యంగ్ లియోస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన కార్యక్రమానికి కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజ చేశారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొత్త అంజిరెడ్డి, వేణుగోపాల్ రావు, ఏఎస్‌రావు నగర్ డివిజన్ ఇన్‌చార్జి ప్రసాద్ కొశెట్టి, లోక్‌సత్తా నాయకులు శివరామ కృష్ణ, బీజేపీ నేతలు శరత్‌చంద్ర, అడ్వకేట్ షణ్ముఖం, ప్రశాంత్‌నగర్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

హ్యుందాయ్‌లో మరో న్యూ మోడల్

- షోరూంలో కొత్త కారును ప్రారంభించిన హ్యుందాయ్ షోరూం సీఈవో అనిత ప్రసాద్



నవతెలంగాణ-బోడుప్పల్

వినియోగదారులకు ప్రత్యేక సదుపాయాలతో కూడిన నూతన వాహనాలను మార్కెట్‌లోకి తీసుకువచ్చినట్లు హ్యుందాయ్ సీఈవో అనిత ప్రసాద్ పేర్కొన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ వరంగల్ జాతీయ రహదారిలో ఉన్న హుందాయ్ షోరూం ఆయన నూతన వాహనం హ్యుందాయ్ అల్కాజర్‌ను ప్రారంభించారు. అన్ని రకాల ఫ్యూచర్స్‌తో కూడిన ఈ కారు ధర రూ.14 లక్షల నుండి రూ.28 లక్షల వరకు ధర ఉందని తెలిపారు. ఈ కారు షోరూంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారక హ్యుందాయ్ సభ్యులు పాల్గొన్నారు.

పోల్స్ షిఫ్టింగ్, ట్రాన్స్ ఫార్మర్ షిఫ్టింగ్ పనులు పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బిజేఆర్ నగర్‌లో జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, పోల్స్ షిఫ్టింగ్, ట్రాన్స్ ఫార్మర్ షిఫ్టింగ్ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, ఎలక్ట్రికల్ ఏఈ గోపాల్, కాంగ్రెస్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వెలసిన దుకాణాల తొలగింపు



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్ చౌరస్తా నుండి చక్రపురం వరకు రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను కాప్రా ఏసీపీ గిరిరాజు ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్య శనివారం తొలగించారు. ఫుట్‌పాత్‌పై వెలిసిన దుకాణాలను జేసీబీ ద్వారా తొలగించారు. బాధితులు అడ్డుకున్నా ఫలితం లేకుండాపోయింది. కుషాయిగూడ బస్టాండ్‌లో అక్రమంగా పూల వ్యాపారాన్ని నిర్వహిస్తున్న దుకాణాలు సైతం తొలగించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ సర్పంచ్ కంతం కృష్ణారెడ్డి




నవ తెలంగాణ-శామీర్‌పేట


బతుకమ్మ, దసరా పండగ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కంతం కృష్ణారెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డిని గ్రామస్తులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ఆడపడుచులు రామాలయం వద్దకు బతుకమ్మలు తీసుకువెళ్లే రహదారి వెంబడి విధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. వాగులో ఉన్న చెట్లు చెదారం క్లీన్ చేసి బతుకమ్మ పండుగ రోజు రామాలయం వద్ద డిజె సౌండ్, దసరా పండుగ రోజు సబ్‌స్టేషన్ నుండి జంబి వరకు లైట్ ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కంతం నరేందర్ రెడ్డి , లింగం, బాల్ రెడ్డి , బాలేష్ ఉన్నారు.



మౌలాలిలో సయ్యద్ ఇక్బాల్ భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్ - ఉన్ నబీ ప్రోగ్రాంకు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరయ్యారు. ఆమె వెంట డివిజన్ నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, కిశెట్టి ప్రసాద్, వెంకటరెడ్డి ఉన్నారు.
నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ కోసం పోరాడిన యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ





నవతెలంగాణ - జవహర్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జీవితాంతం పోరాడిన గొప్ప మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు చిట్టిమల్ల గణేష్ నేత, జిల్లా మహిళా అధ్యక్షురాలు బొమ్మ ప్రవలిక అమర్ నేత అన్నారు. శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించి జవహర్ నగర్ ఆదర్శ వెల్ఫేర్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాలను, త్యాగాలను గుర్తించి బీఆర్ఎస్ ప్రభుత్వం బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాపూజీ జయంతితో పాటు వర్ధంతిని ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీ కృష్ణ గౌడ్, మాజీ వార్డు సభ్యులు ప్రసాద్ గౌడ్, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి హరినారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నేత, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నేత, జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ నేత, ముఖ్య సలహాదారులు బొమ్మ అమరేందర్ నేత, విజయ కుమార్ స్వామినేత, ప్రసాద్, యాపురం గణేష్, ప్రశాంత్ , చక్రపాణి పాల్గొన్నారు.

కాప్రాలో..

కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్గంతిని శ్రీభావనారుషి కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పద్మశాలి టౌన్షిప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని బాపూజీ విగ్రహానికి అధ్యక్షులు సీత ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సుదేశ్, కోశాధికారి రామ కృష్ణ, కార్యవర్గ సభ్యులు సుదర్శన్, వసుధ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్, వార్డు మెంబర్లు, పద్మశాలి టౌన్షిప్ కాలనీ వాసులు, మేడ్చల్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, దమ్మాయిగూడ, అంబేద్కర్ నగర్, జవహర్ నగర్ పద్మశాలి సంఘం ప్రతినిధులు హాజరై నివాళులర్పించారు.

జాబ్ మేళాలో 15 మందికి ఉద్యోగాలు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి ఎం.రాధిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ ఐటీఐలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 15 మంది ఉద్యోగాలు పొందినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి ఎం.రాధిక తెలిపారు. బెల్ స్టార్ అనే ప్రయివేటు మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ కంపనీలో ఈ ఉద్యోగాలు సాధించినట్టు తెలిపారు. ఈ జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా 50 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా.. కంపనీ హెచ్ఆర్ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి అరులైన 15 మందికి ఉద్యోగ అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఇందులో ఇద్దరికి బ్రాంచ్ అకౌంటెంట్ పోస్టులు దక్కినట్టు తెలిపారు.

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

ఆదివారం | సెప్టెంబర్ 22, 2024 | www.navatelangana.com

విఘ్నేశ్వరుడి శోభాయాత్రలో పాల్గొన్న అరికెపూడి గాంధీ



నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్‌పల్లి మాధవరం కాలనీ ఏ బ్లాక్ రోడ్ నెంబర్-2లోని శ్రీగణేష్ యూత్ అసోసియేషన్ యూత్ ఆధ్వర్యంలో నెలకొన్న విఘ్నేశ్వరుడి శోభయాత్రకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు తెల్ల హరికృష్ణ ఆహ్వానం మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ అరకెపూడి గాంధీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మెన్ తూం వినయ్ కుమార్‌లు ముఖ్యతిధులుగా పాల్గొని శోభయాత్రను ప్రారంభించారు. డప్పుల వాయిద్యాలతో, కోలాటం ఆటలతో, భక్తి పార్వశంతో వినాయక నిమర్జనం ఊరేగింపు మహోత్సవ కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం





నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌ను మళ్లీ భారీ వర్షం ముంచెత్తింది. శనివారం రాత్రి దాదాపు గంటపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. సికింద్రాబాద్, ఎల్బీనగర్, ఉప్పల్, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్, ఆబిడ్స్, నాంపల్లిలో భారీ వర్షం పడింది. లక్డీకపూల్ నుంచి చార్మినార్ వరకు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. అల్వాల్, యాప్రాల్, జవహర్ నగర్‌లోనూ ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. ఈ వాన కారణంగా

అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షం నేపథ్యంలో అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో గత రెండు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం పడుతుండడంతో నాళాల వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, మాన్ హోల్స్ వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల్లో, ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసినప్పుడు నీళ్ళు నిల్వ ఉండే 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది వెంటనే వెళ్ళేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్య తీవ్రమైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

వినాయక నిమజ్జనంలో పాల్గొన్న రామకృష్ణ



నవతెలంగాణ - కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీ నగర్ కాలనీలో ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి ముఖ్యఅతిధిగా దొడ్ల రామకృష్ణ గౌడ్ హాజరై, ప్రత్యేక పూజ చేశారు. అనంతరం వినాయక నిమజ్జనం ఊరేగింపు మహోత్సవంలో పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

నవతెలంగాణ - కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్, ఎల్లమ్మబండలో వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని వినాయక మండపం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమానికి పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగించి విజయాలను దరిచేర్చేవాడు వినాయకుడు అని పేర్కొన్నారు. అందుకే ఆయన్ను విఘ్నేశ్వరుడు అంటారని తెలిపారు. ఎంతోమంది దేవుళ్లు ఉన్నప్పటికీ మొదటి పూజలు అందుకునేది ఆయనే అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాస్ యాదవ్, జిల్లా గణేష్, అనిల్ రెడ్డి, కాశినాథ్ యాదవ్, ఇబ్రహీం, చిన్నోళ్ల శ్రీనివాస్, రమేష్, మహేష్ గౌడ్, రాకేష్, ,యాదగిరి,సాయి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



- హైదరాబాద్ క్రెడాయ్ అధ్యక్షులు వి.రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యార్థులు కష్టపడి చదివి విజయాలను సాధించడానికి పట్టుదలగా ఉండాలని హైదరాబాద్ క్రెడాయ్ అధ్యక్షులు వి.రాజశేఖర్ రెడ్డి అన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శనివారం జేఎన్టీయూ హెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు జేఎన్టీయూ హెచ్ రెక్టార్ డా. కె. విజయ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వర రావు, జేఎన్టీయూహెచ్ యుసీఈఎస్టీహెచ్ ప్రిన్సిపాల్ డా. జీ. వి. నరసింహా రెడ్డి, మెటీ ఇంజనీరింగ్ అండ్ కన్సల్టెన్సీ ప్రయివేటు లిమిటెడ్ డైరెక్టర్ ఈఆర్ సీపీ ప్రసాద్, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డా. బి. డీన్ కుమార్లు ముఖ్య అతిథులు పాల్గొని మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య రూపకల్పన చేసిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, ఆయన చేసిన సేవలు అందరికీ ఆదర్శం కావాలన్నారు. విద్యార్థులు కూడా ఇంజినీరింగ్ విజయాల్లో అగ్రగాములుగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తేజావత్ సురేష్ కుమార్‌కు నివాళి



మృతుడి (ఫైల్)

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్టీయూ యూనివర్సిటీ పరీక్షా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తేజావత్ సురేష్ కుమార్ శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ హెచ్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి యూనివర్సిటీ పరీక్షా విభాగాధిపతి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో మృతి చెందడం చాలా బాధకరమన్నారు. తోటి వారికి సాయం చేసే గుణం ఉన్నవాడు అందరితో తలలో నాలుకల మెదిలేవారన్నారు. అతని ఆత్మకు శాంతి చేకూర్చి అతని కుటుంబానికి మనోధైర్యం కలిగించాలని కోరారు.

విద్యుత్ వ్యవస్థ నియంత్రణపై అవగాహన



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడ లోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం వారు గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొ డా. నవీన భార్గవి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు విద్యుత్ వ్యవస్థ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల విద్యుత్ ఉత్పాదనలు, గ్రిడ్ల మధ్య విద్యుత్ పంపిణీ, ప్రసార వ్యవస్థ యొక్క విద్యుత్ ప్రవాహ విశ్లేషణలపై కొన్ని ముఖ్యమైన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ ఇలాంటి గెస్ట్ లెక్చర్స్ వల్ల విద్యార్థులలో విశ్లేషణాత్మక దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం విభాగాధిపతి ప్రొ. డా. శశికళ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల పై దృష్టి సారించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె. నర్సింహారెడ్డి , కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కళాశాల కోశాధికారి త్రిలోక్ రెడ్డి ,కళాశాల డైరెక్టర్ డా. ఏ మోహన్ బాబు , ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం, విభాగాధిపతి ప్రొ. డా. శశికళ, కార్యక్రమ సమన్వయకర్త డా. ఈశ్వరమూర్తి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి సంస్మరణ సభ



నవతెలంగాణ - బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో కమ్యూనిస్టు నాయకుడు రావి నారాయణరెడ్డి సంస్మరణ సభను శనివారం రావి నారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు కూకట్ పల్లి మండలం నుండి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ ఆధ్వర్యంలో మండల నాయకులు మనోచారి, రాములు, దావీద్, రాజు గౌడ్, నారాయణ తరలివెళ్లారు. ఈ సందర్భంగా జి. కృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యవాది, వామపక్ష సాయుధ పోరాటగా పరివర్తన చేసిన సాయుధ పోరాటానికి ఆద్యుడిగా ఆంధ్రమహాసభను ప్రారంభించి సాంస్కృతి కోద్యమాన్ని నడిపిన గొప్ప నాయకుడని ఆయన కొనియాడారు.

కల్మషం లేని దీక్షాపరులు గురువులు

- చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అభినవ కవి,పుడమిరత్న అవార్డు గ్రహీత వాకిటి రాంరెడ్డి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సమాజంలో కల్మషం లేని దీక్ష పరులు గురువులేనని చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అభినవ కవి, పుడమిరత్న అవార్డు గ్రహీత వాకిటి రామిరెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు చేయూత ఫౌండేషన్, చెన్నారెడ్డినగర్ అభివృద్ధి సొసైటీ సంయుక్తంగా నిర్వహించారు. ఈ మేరకు గాంధీనగర్, రంగారెడ్డి నగర్, చెన్నారెడ్డినగర్ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల చెందిన 34 మంది ఉపాధ్యాయ బృందాన్ని శాలువాలతో మెమెంటలతో సత్కరించారు. చెన్నారెడ్డి నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పదేళ్లుగా విధులు నిర్వహించి ఇటీవలే బదిలీపై వెళ్లిన హెచ్ఎం కల్పనా రెడ్డి, ఉపాధ్యాయురాలు పార్వతిలను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనలతోనే ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకుంటారని గుర్తు చేశారు. విద్యార్థులకు మార్గదర్శకులు, సమాజ దిశానిర్దేశికులు ఉపాధ్యాయులేనని కొనియాడారు. గురువుల పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. అనంతరం సభాధ్యక్షులు, గాంధీనగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాములు మాట్లడుతూ తమ పాఠశాల అభివృద్ధి కోసం, విద్యార్థులకు బాసటనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు,దాతలు ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఇటువంటి గొప్ప సన్మానం మరింత రెట్టింపు ఉత్సాహం ఇచ్చిందన్నారు. ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రంగారెడ్డినగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పనారెడ్డి మాట్లడుతూ చెన్నరెడ్డినగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషిచేసినందుకు బదిలి వీడుకోలు పలికిన సంఘ సేవకులు మోతే రాజేశ్వర్,సంస్థ ప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోసంస్థలప్రతినిధులు పాఠశాలల పాధ్యాయులు నాగేశ్వరి, అనురాధ, అరుణ, ఉమ, మహిపాల్ రెడ్డి, కుమార్, సబిత, పార్వతీ, హరేరాం తదితరులు పాల్గొన్నారు .

బాచుపల్లిలో మహాలక్ష్మి పథకం ప్రారంభం



నవతెలంగాణ-దుండిగల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభయ హస్తం ఆరు గారెంటీలల్లో భాగంగా రూ.500 ఎల్పీజీ సిలిండర్ మహాలక్ష్మి పథకం శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ అన్ని సరఫరా చౌక ధరల దుకాణంలో మహాలక్ష్మి పథక లబ్దిదారులకు రూ.500 ఎల్పీజీ పత్రాన్ని అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు, పౌరసరఫరా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ పేదల కోసం మరిన్ని పథకాలను అందుబాటులోకి తీసుకొస్తుందని అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నాయకులు సీతారామ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, శంకర్, అశోక్, యాదయ్య, జితేందర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

బాలరాజు మరణం తీరని లోటు

- సీపీఐ (ఎం) నాయకులు



నవతెలంగాణ - కూకట్‌పల్లి

సీపీఐ(ఎం) నాయకులు టి.బాల రాజ్ మరణం తీరని లోటని పలువురు సీపీఐ(ఎం) నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లమ్మబండ శాఖ సభ్యులు టి. బాలరాజ్ శనివారం మరణించారు. ఆయన భౌతికకాయా నికి సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి సత్యం, కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, కమిటీ సభ్యులు కే. కృష్ణ నాయక్ ఎల్లమ్మ బండ శాఖ కార్యదర్శి కామ్రేడ్ శ్రీకాంత్ రాములు, రంజిత్ శివ హనుమాన్ భాగ్యలక్ష్మి తదితరులు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఈ ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. సాంస్కృతిక కళారూపాలలో చురుకుగా పాల్గొనేవాడని, చివరి శ్వాస వరకు, పేద ప్రజల సమస్యలపై పోరాటం చేశారని కొనియాడారు. బాలరాజు మరణం ఎల్లమ్మబండ శాఖకు తీరనిలోటన్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి సంతాప సానుభూతి తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు



నవతెలంగాణ-దుండిగల్

కులంపేరుతో దూషణలకు పాల్పడిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళ బాలపీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితులతో కలిసి శనివారం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వివరాలు వెల్లడించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని ప్రగతి నగర్, ప్రశాంత్ గోల్డ్ హీల్స్ కురుమూర్తి అనే వ్యక్తి కేజీఆర్ కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్ భోజనం చేస్తుండగా ఆయనతో పాటు ఉన్న మోహన్ అనే వ్యక్తికి వాటర్ ఇవ్వమని కోరాడు. అతడు మానవతా దృక్పతంతో వాటర్ బాటిల్ ఇస్తుండగా దండు స్వామి, వరికుప్పల దశరథ అనే వ్యక్తులు వాడికేంటి ఎంటి వాటర్ బాటిల్ ఇచ్చేది.. కులం తక్కువ మాదిగ నా కొడుకు అంటూ కురుమూర్తిని అవమానించారు. కులం పేరుతో దూషించిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాలపీరు కోరారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం

- స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్ల లక్ష్మీనాథ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో కార్పొరేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరమని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్ల లక్ష్మీనాద్ అన్నారు. శనివారం మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ (సూరారం)ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులచే సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మేకల ఎల్లయ్య,రాములు,వైద్యులు డాక్టర్ అనన్య,యుక్త,ఆసుపత్రి సిబ్బంది ఓబుల్ రెడ్డి, యువజన సంఘం సభ్యులు తిమ్మయ్య,శ్రీధర్,వెంకట సాయి, దత్తు, రాంచందర్, పర్వతాలు, అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం రాకుండా చూడాలి

- ఆదర్శనగర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు శంకరయ్య



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యుత్ అంతరాయం రాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆదర్శనగర్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య అన్నారు. గత కొద్ది నెలలుగా విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిపారు. ఈ మేరకు ఆదర్శనగర్ ప్రాంతంలో శనివారం 3 హెచ్.టి.విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని కోరారు.ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యులు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సదస్సు



నవతెలంగాణ-దుండిగల్

గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ హ్యాక థాన్ స్పెక్టన్ 2024 పేరుతో జాతీయ ముగింపు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె శ్రీలత మాట్లాడుతూ ప్రతి బ్యాచ్ ఒక ప్రైజ్ విన్నర్ అని ఇలాంటి హ్యాక్ థాన్స్ ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయుడానికి ఒక లేబరేటరీ లాగా ఉపయోగపడుతు ందని దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి పాల్గొనడానికి వచ్చిన విద్యార్థులను అభినందించారు. కళాశాల సెక్రటరీ టివి రెడ్డి మాట్లాడుతూ సృజనాత్మకతకు వయసుతో సంబంధం లేదని ఈ వయసులోని వారు కూడా వాళ్ళు ఎం ఎస్ సి కంపెనీలు స్థాపించి మంచి ఉన్నత స్థాయిలో ఉన్నారని మీరు కూడా సృజనాత్మకతను పెంపొందించు కొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మల్లికార్జున్ టెక్ మహేంద్ర ఇలాంటి వాటి ద్వారా పనిచేస్తే మన ఆర్థిక వ్యవస్థ తద్వారా మన దేశ ఆర్థిక వ్యవస్థను మార్చవచ్చని తెలిపారు. ఉదాహరణకు జపాన్ సీఈవో 19 సంవత్సరాల వయసున్నారని ప్రస్తావించారు. ఇక్కడ వచ్చే ఆలోచనలకు విద్యార్థులు ఎంటర్ప్రైజెస్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథి బి.వెంకట్ రెడ్డి సీనియర్ ఆర్కిటెక్ టెక్ అవుట్ మాట్లాడుతూ పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు వారిలోని నైపుణ్యాలను ఆలోచనలను ఆర్టిఫిషల్ ఇంటెన్సెస్ డేటా సైన్స్ అగ్రికల్చర్ లాంటివాటిలో ప్రదర్శనలు చాలా బాగా నిర్వహించారని అభినందించారు. అనంతరం విద్యార్థుల కు థర్డ్ ప్రైస్ కేశవ్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరిం గ్ హైదరాబాద్, సెకండ్ ప్రైస్ మెథడిస్ట్ కాలేజ్ హైదరాబాద్, ఫస్ట్ ప్రైస్ ఎస్ఎస్ఆర్ఐటి విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టీవీ బాలా రెడ్డి, సెక్రటరీ టివి రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి టిపిఓ డా. ఎన్ .శ్రీకాంత్, పిఆర్ఓ రవి సుధాకర్ పాల్గొన్నారు.

బోరబండలో కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్ పర్యటన



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండలోని బంజార నగర్ బస్తీలో అధికారులతో కలిసి కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసివుద్దీన్ శనివారం పర్యటిం చారు. అనంతరం స్థానికులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ భరత్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్

- కాంగ్రెస్ సనత్ నగర్ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్



నవతెలంగాణ-బేగంపేట్

ఉజ్జయిని మహంకాళి దేవాలయం పక్కన ఉన్న మూత్రశాలను తొలగించడం పై ప్రజలు భక్తులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్ అన్నారు. శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఆయన మాట్లాడుతూ... కొన్ని సంవత్సరాలుగా మూత్రశాల వల్ల భక్తులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ సనత్ నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ అధికారులు అక్కడ ప్రజలను భక్తులను వివరాలు అడిగి తెలుసుకుని ఇక్కడి నుంచి మూత్ర శాలను తొలగించాలని వారు చెప్పడంతో జీహెచ్ఎంసీ అధికారులు మూత్రశాలను తొలగించారన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కొందరు రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం మరలా నిర్మించాలని చూస్తున్నారని తెలిపారు. ప్రజలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.



పెద్ద సత్యనారాయణ యాదవ్ మృతి తీరని లోటు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

యాదవ జాతి కుల పెద్ద సత్యనారాయణ యాదవ్ మృతి తీరని లోటని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. కాచిగూడకు చెందిన యాదవ సంఘం కుల పెద్ద బత్తుల సత్యనారాయణ యాదవ్ శుక్రవారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం నింబోలి అడ్డాలోని వారి నివాసానికి వెళ్లి సత్యనారాయణ యాదవ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేసి, యాదవ సమాజానికి ఎనలేని సేవలు అందించిన సత్యనారాయణ యాదవ్ మృతి చాలా బాధాకరం అని తెలిపారు. ఆయన మృతి వారి కుటుంబానికే కాకుండా యాదవ సంఘానికి, యాదవ సమాజానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. మరణ వార్త తనను ఎంతో కలచి వేసిందని చెప్పారు.

బాబురావు యాదవ్ కు పరామర్శలి

ఇటీవల అనారోగ్యానికి గురైన అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు బద్దుల బాబూరావు యాదవ్ ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. శనివారం కాచిగూడ లోని నింబోలి అడ్డాలో గల వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు.

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి

- లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం
- బీసీ మహిళల వాటాలేని మహిళా బిల్లును అంగీకరించేదే లేదు
- బీసీ మహిళా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, వక్తలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, బీసీ మహిళల ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లును అన్ని పార్టీలు వ్యతిరేకించాలనీ బీసీ మహిళా సంఘాల రౌండ్ సమావేశంలో వక్తల అన్నారు. బీసీ మహిళా బిల్లు కోసం దసరా తర్వాత ప్రత్యక్ష కార్యచరణ ఏర్పాటుచేసి అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

అఖిల పక్ష పార్టీలు,బీసీ సంఘాల నేతలు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా బిల్లులో - బీసీ మహిళకు సబ్ కోటా- భవిష్యత్ కార్యాచరణ పై, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలి శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకలాభరణం కృష్ణమోహన్రావు,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు,డీఎస్పీ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహరాజ్,కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఇంద్ర శోభన్‌లు పాల్గొని ప్రసంగించారు.

దేశ ప్రధానిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మోడీ ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా బీసీలకు చారిత్రాత్మకంగా అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. ఎందుకు మహిళా బిల్లు పార్లమెంట్లో ఆమోదింపజేసి అందులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకుండా తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. బీసీ మహిళల రాజకీయ ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లు వల్ల బీసీలకు నిరుపయోగమన్నారు. స్వాతంత్రం వచ్చిన 78 సంవత్సరాలుగా చట్టసభలు అగ్రవర్ణాలకు చుట్ట సభలుగా మారాయని, దేశ జనాభాలో 60 శాతం పైగా ఉన్న బీసీలకు 18 శాతమే రాజకీయ ప్రాతినిధ్యం దక్కిందని, ఇందులో 30 శాతం ఉన్న బీసీ మహిళలకు రెండు శాతమే రాజకీయ ప్రాతినిధ్యం దక్కిందన్నారు. పిడికెడు శాతం ఉన్న అగ్రవర్ణాలకు మాత్రం 90 శాతం రాజకీయ ప్రాతినిధ్యం దక్కిందన్నారు.

మహిళా రిజ్వేషన్ల బిల్లు వల్ల బీసీ మహిళలకు ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేదని నల్లదొరల స్థానంలో నల్ల దొరసానులు అసెంబ్లీ, పార్లమెంట్లో అడుగు పెడతారే తప్ప ఉత్పత్తి చేసే శ్రామిక బీసీ మహిళలను చట్టసభలకు ఆమడ దూరంలో అన్ని రాజకీయ పార్టీలు ఉంచుతాయని అన్నారు పార్లమెంట్లో ప్రాతినిధ్యం ఉన్న 26 రాజకీయ పార్టీలు మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కావాలని గట్టిగా నిలదీయలేకపోయారని, మహిళా బిల్లును వ్యతిరేకించకపోవడం చాలా దారుణం అన్నారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ మహిళా బిల్లును దేశంలో అనేక రాజకీయ పార్టీలు బీసీ సామాజిక వర్గానికి సంబంధించిన పార్లమెంట్ సభ్యులు వ్యతిరేకించినప్పటికీ బీజేపీ ప్రభుత్వం బలవంతంగా బిల్లును పార్లమెంట్లో ఆమోదించుకుందని, మెజార్టీ మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం లేని బిల్లు ఎవరి ప్రయోజనాల కోసమని ఆయన ప్రశ్నించారు. తాను వ్యక్తిగతంగా,బీఆర్ఎస్ పార్టీ తరపున మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా సాధన కోసం జరిగే ఉద్యమానికి మద్దతు ఉంటుందని, కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచి మహిళా బిల్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీల ఓట్లతో గద్దెనెక్కిన వాళ్లు బీసీలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట దక్కడానికి దసరా తర్వాత రాష్ట్రంలో 1000 మంది మహిళ ప్రజా ప్రతినిధులతో బీసీ మహిళ రాజకీయ ప్లీనర్ ని నిర్వహిస్తామని, డిసెంబర్‌లో వేలాది మంది మహిళలతో మహిళా గర్జన సభను ఏర్పాటు చేస్తామని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో లక్ష మంది మహిళలతో పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు.బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వి కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ... పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి బీసీ మహిళలకు జనాభా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి మాట్లాడుతూ..72 సంవత్సరాలుగా అసెంబ్లీ లో బీసీ మహిళలు కేవలం ఇద్దరు మాత్రమే అడుగు పెట్టారని, మహిళలకు ఎంత రాజకీయంగా అన్యాయం జరుగుతుందో గ్రహించాలన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా సాధించడానికి అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. డీఎస్పీ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కులు సాధించు కోవడానికి రాజకీయ వాటా పొందడానికి విద్యార్థి దశ నుండి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఇందిరా శోభన్ మాట్లాడుతూ..ప్రధాని మోడీ పేరుకే బీసీ తప్ప బీసీలకు వరగబెట్టింది ఏమీలేదన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించకపోతే మహిళలంతా ఐక్యమై మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు.

బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మని మంజరి మాట్లాడుతూ బీసీ మహిళలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగించుకుంటూ తమ నాయకులుగా ఎదగడానికి మహిళలను రాజకీయంగా పావుగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకురాళ్లు సంధ్య రాణి, తారకేశ్వరి, సమత, శ్యామల రాణి, లావణ్య, మీన, నాయకులు కుందారం గణేష్ చారి బాలగోని బాలరాజు గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తాటికొండ విక్రమ్ గౌడ్ కనకల శ్యాంకుర్మా, విజయలక్ష్మి సరిత గౌతమి దేవిక తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న కేంద్రం

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర ప్రభుత్వం పేద వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ అన్నారు. నూతన విద్యా చట్టం ద్వారా యూజీసీని అడ్డం పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ, దివ్యాంగుల రిజర్వేషన్లను అమలు చేయకుండా పేద విద్యార్థులను మెడికల్, డెంటల్ ప్రయివేటు డీమ్డ్ యూనివర్సిటీలను తీసుకు రావడం వలన ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదన్నారు. స్వామి గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్ తో కలిసి శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వర్గాల ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీని తన నివాసంలో కలిశారు. మెడికల్, డెంటల్ కాలేజీలకు ప్రయివేటు, డీమ్డ్ యూనివర్సిటీల హోదాను తక్షణమే రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లేపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ ప్రయివేటు డీమ్డ్ యూనివర్సిటీలలో రిజర్వేషన్లను అమలు చేయకుండా కేవలం ధనవంతుల పిల్లలకు మాత్రమే మెడికల్ ఉన్నత విద్యను అందే విధంగా విచ్చల విడిగా మేనేజ్ మెంట్ కోటా ద్వార సీట్లు అమ్ముకునే విధంగా దోపిడీ చేసేందుకు పూనుకుందని ఆరోపించారు. దాంతో పేద విద్యార్థులకు మెడికల్ ఉన్నత విద్యను దూరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలను చేపడుతున్నదన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రయివేటు డీమ్డ్ యూనివర్సిటీల అనుమతులను తక్షణమే రద్దు చేయాలని కోరారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. త్వరలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంతో, అదే విధంగా కేఎన్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కరుణాకర్ రెడ్డి తో జేఎన్టీయూ వీసీలతో సమీక్ష సమావేశం పెట్టి ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడుతానని చెప్పడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఏర్పడిన ప్రయివేటు యూనివర్సిటీలలో రిజర్వేషన్లను కల్పించకపోవడం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని బొల్లెపల్లి స్వామి గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీతో చర్చించారు. ఈ సమస్యను పరిష్కరించే విధంగా పనిచేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండ ఏడుకొండలు, వినోద్ ,బాలరాజు, పవన్ ,ఆంజనేయులు పాల్గొన్నారు.



ఏఈజీ జాతీయ సెమినార్, వర్క్ షాప్ బ్రోచర్స్ విడుదల

నవతెలంగాణ-ఓయూ

అసోసియేషన్ ఆఫ్ ఎక్స్ప్లోరేషన్ జియోఫిజిక్సిస్ట్ (ఏఈజీ) ఆధ్వర్యంలో డిసెంబర్ 9 నుండి 11 వరకు ఓయూలో వర్క్ షాప్ , 12 నుంచి 13 వరకు జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహించనునట్టు ఎఈజీ ఉపాధ్యక్షులు ప్రో.బోయిళ్ళ వీరయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓయూ పరిపాలన భవన్‌లో ఓయూ రిజిస్ట్రార్ ప్రో.పప్పుల లక్ష్మీ నారాయణ, యూజీసీ డీన్ ప్రో.గడ్డం. మల్లేష్‌తో కలిసి అందుకు సంబంధించిన బ్రోచర్స్‌ను ఆవిష్కరిం చారు. 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ జియో ఫిజిక్స్ అనే అంశంపై వర్క్ షాప్ , 12 నుంచి 13 వరకు జియో ఎక్స్ప్లో రేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రెసియోస్ మెటల్స్ " అనే అంశంపై జాతీయ సెమినార్ ను నిర్వహించనునట్టు చెప్పారు. 46వ, ఎఈజీ యానువల్ కన్వెన్షన్ సందర్భంగా నిర్వహిస్తున్నట్టు సెక్రటరీ డా.బి.నరసింహ రావు, ప్రో.వీరయ్యలు చెప్పారు. సైంటిస్టులు, పీహెచ్డీ, పీజీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఓయూ ఓఎస్డీ ప్రో.రెడ్యా నాయక్ , డా.ఉదయ లక్ష్మీ, డా.మంజుల, డా.విద్యా సాగరా చారి పాల్గొన్నారు.

23న లేబర్ కమిషనరేట్ ఎదుట ధర్నా



- సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ జే స్వామి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

రహమత్ నగర్ డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో, ఎస్‌పీఆర్ హిల్స్ వినాయక్ నగర్ చౌరస్తాలో, భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ జే స్వామి హాజరై మాట్లాడుతూ, తెలంగాణలో కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేయాలని, ఈ నెల 23న హైదరాబాద్ లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. భవన, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ, మరణం, శాశ్వత, పాక్షిక, అంగవైకల్యం, ప్రసూతి, పెండ్లి కానుక,ఈ సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి, రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను తప్పించుకోవాలని చూస్తున్నదన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు తలపెట్టిన ధర్నాని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ జోన్‌లో ఉన్న భవనిర్మాణ కార్మికులందరూ పెద్ద ఎత్తున ఈ ధర్నా కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.సమావేశం అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను రిలీజ్ చేశారు. డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, బి.దేవదాస్, నాయకులు బి.బాలయ్య, ఆర్ జైపాల్ రాజు, టీ భాగ్యరాజ్, కేశప్ప, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఓయూలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

నవతెలంగాణ-ఓయూ

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతినిఓయూ జేఏసీ చైర్మెన్ బాలకష్ణ నేత ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా, విజేఎస్ అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్, టీడీబీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఈరెంటి విజయ్, బోనాల నగేష్, శేఖర్, రాపోలు వాసు, వర్కాల రవి, శ్రీనివాస్, క్రాంతి, వేణు, రమేష్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి





- వృద్ధాశ్రమంలో పండ్లు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ నాయకులు, పద్మశాలి బిడ్డ, స్వాతంత్ర్య సమరయోధులు దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పద్మశాలి సంఘ ప్రతినిధులు శనివారం జవహర్ నగర్‌లోని ఓల్డేజ్ హోంలో శనివారం నిర్వహించారు. వద్దులకు, పేదలకు ఈ సందర్భంగా పండ్ల దుస్తులు పంపిణీ చేశారు. తొలుత ప్రతినిధులు దమ్మాయిగూడ, పద్మశాలి టౌన్ షిప్ వద్ద బాపూజీ విగ్రహానికి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు గణేష్ చెట్టు మిల్ల, ప్రధాన కార్యదర్శి ఎర్ర మాజా హరి నారాయణ, జాయింట్ సెక్రెటరీ గుర్రం రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి సంఘం పేదలకు వద్దులకు ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడంలో ముందంజలో ఉంటుందన్నారు. అయితే రాజకీయ పార్టీలు పద్మశాలీల సేవలను గుర్తించడం లేదని వాపోయారు. రాష్ట్రంలో అనేక రాజకీయ పార్టీలున్నప్పటికీ పద్మశాలీలను కేవలం ఓట్ల కోసం వాడుకుంటున్నారని తెలిపారు. వారి పార్టీల ప్రచారం కోసమే ఉపయోగించుకుంటున్నారని ఇకనైనా పద్మశాలీలను గుర్తించి వారి రాజకీయ ఎదుగుదలకు దోహదపడాలని కోరారు.

పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరును మార్చొద్దు

- ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్...



నవతెలంగాణ-బంజారాహిల్స్

పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరును మార్చొద్దని రాష్ట్ర ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.శనివారం తెలంగాణ అవోపా ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మలిపెద్ది శంకర్, పొట్టి శ్రీరాములు మనవరాలు ప్రొ. రేవతితో కలిసి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పొట్టి శ్రీరా ములు భాషా ప్రతిపాదికన రాష్ట్రాలు ఏర్పడాలని మద్రా సిలు అని పిలవబడే తమకు తెలుగు రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని 50 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారన్నారు. ఆయన ఆర్యవైశ్య జాతికి చెందిన వ్యక్తి అని.. ప్రస్తుతం పరిపాలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి యూనివర్సిటీకి ఆయన పేరును కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముని మనవరాలు ప్రతిభ, కటం సత్యనారాయణ,ఉప్పల ఫౌండేషన్ వెంకటేశ్వర్లు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



అక్టోబర్ 3 నుంచి కంట్రీ క్లబ్ దాండియా వేడుకలు

- సీఎండీ వై.రాజీవ్ రెడ్డి...

నవతెలంగాణ - బంజారాహిల్స్

కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 3 నుంచి ఆసియాలోనే అతిపెద్ద దాండియా నైట్స్ 2024 వేడుకను నిర్వహిస్తోందని సంస్థ సీఎండీ రాజీవ్ రెడ్డి తెలిపారు. శనివారం బేగంపేటలోని కంట్రీ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌తో పాటు దేశంలోని అన్ని క్లబ్‌లలో జరుగనున్న దాండియా నైట్స్ పోస్టర్‌ను పలువురు డీజేలు, గర్బా కొరియాగ్రాఫర్లతో కలసి ఆయన ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కంట్రీ క్లబ్ ఫ్రాంచైజీ విస్తరణ అవకాశాల గురించి ప్రకటిస్తూ సంవత్సరం నాటికి 100 ఫ్రాంచైజీలకు చేరే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. నగరంలోని బేగంపేట లో గల పోలీస్ హాకీ స్టేడియంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు జరిగే పది రోజుల వేడుకల్లో సుమారు 70 నుండి 80 వేలకుపైగా జనం హాజరవుతారన్నారు. సాంప్రదాయ దాండియా రిథమ్‌ల నుండి సరికొత్త డీజే మిక్స్‌ల వరకు, ప్రతి రోజు నాన్‌స్టాప్ ఫన్,దాండియా నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈవెంట్స్ ఎండీ సందీప్ కుమార్ చందా,చైర్మెన్ సాయిశ్రీలు మాట్లాడుతూ...మహారాష్ట్ర ప్రసిద్ధ మ్యూజికల్ లైవ్ బ్యాండ్ రాజా బీట్స్,గుజరాతీ ప్రముఖ గుజరాతీ గాయకుడు భవిన్ హస్ముక్ రాజా పాటలు, హైదరాబాద్ టాప్ 12 డేజేల సంప్రదాయ,ఆధునిక మ్యూజిక్‌తో అలరించనున్నారని వివరించారు.

రాజకీయ ఆరోపణలతో తిరుమల ప్రతిష్టను దెబ్బతీయవద్దు



- యుగ తులసి ఫౌండేషన్..

నవతెలంగాణ - బంజారాహిల్స్

వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల ప్రతిష్టను రాజకీయ ఆరోపణతో దెబ్బతీసే కుట్రలను తక్షణమే మానుకోవాలని యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ శివకుమార్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఐపీల సేవలోనే టీటీడీ అధికారులు నిమగ్నమవుతున్నారన్నారు. ఏపీ ముఖ్యమంత్రి తిరుమలపై చేస్తున్న ఆరోపణలు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయన్నారు. తిరుమల దేవస్థాన కమిటీ నియామకంలో తీవ్రమైన ఒత్తిడి ఉందని,కేంద్రం సైతం ఇందులో సిఫార్సులు చేస్తుందని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ తరహాలోనే ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షాలు సిఫార్సు చేసిన కష్ణమూర్తి వైద్యనాథన్ ఉన్నారని చెప్పారు. ఇప్పటికీ కొనుగోలు కమిటీలో మంత్రి పార్థసారథి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డిలు కొనసాగుతుండగా రాజకీయ విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించకపోవడమే దీనికి ప్రధాన కారణమని అన్నారు. చంద్రబాబు చిత్తశుద్ధి ఉంటే తిరుమలలో గోదామాన్ని నిర్మించి ప్రత్యేక తిరుమల డైరీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆ డైరీ ద్వారా వచ్చిన నెయ్యితో లడ్డూలు తయారు చేసి తిరుమల పవిత్రతను కాపాడాలని కోరారు.భారీ ఎత్తున లడ్డూలు తయారు చేస్తూ నాణ్యత మరిచి రాజకీయ ఆరోపణలకు దిగడం సరికాదని సూచించారు. వీఐపీ సేవలో తరించడం మాని క్షేత్రస్థాయిలో భక్తుల ఇబ్బందులను పరిష్కరించాలని, ఇక టీటీడీ సేవ అంటూ సిఫారసుతో వచ్చేవారిని ఎట్టి పరిస్థితిలో తీసుకోవద్దని సూచించారు. కలియుగ వెంకటేశ్వర స్వామి పై భక్తిశ్రద్ధలు కలిగిన నిజమైన భక్తులను మాత్రమే సేవకు వినియోగించుకోవాలని తిరుమల పై జరుగుతున్న వివాదానికి తక్షణమే తెరదించాలని కోరారు. అంతకు ముందు విశ్వహిందూ పరిషత్ వారు ఇదే అంశంపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు..దేవుడు పేరుపై రాజకీయ చర్చలు వద్దని సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే హిందువుల మనోభావాలను దెబ్బతీయకుండా దీనికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల వెల్ కమ్ పార్టీ

నవతెలంగాణ-ఓయూ



డా. ఎ.ఎస్.రావు నగర్ నందలి లిటిల్ ఫ్లవర్ జూనియర్ డిగ్రీ అండ్‌పిజి కళాశాల విద్యార్థులు నూతన విద్యా సంవత్సరానికి నాంది పలుకుతూ మౌలాలి నందలి శ్రీ సాయి మీరా కన్వెన్షన్ హాల్ లో వెల్‌కమ్ పార్టీ ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఆనందోత్సాహాల నడుమ ఆటపాటలతో అలరించారు. జూనియర్ విద్యార్థులకు ఆటపాటల పోటీలు నిర్వహించారు. గెలిచిన విజేతలకు, నూతన విద్యాసంవత్సరం నందు డిగ్రీ స్థాయిలో మిస్టర్ ఫ్రెషర్‌గా నిలిచిన సమీర్ ఖాన్ ను, మిస్ ఫ్రెషర్ గా ఎంపికైన శ్రేయా జాదే, ఇంటర్ స్థాయిలో మిస్టర్ ఫ్రెషర్ మనోహర్, మిస్ ఫ్రెషర్ నాగశివాని లకు ముఖ్య అతిథిగా విచ్చేసిన లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల కరస్పాండెంట్, రాజీవ్ శిరోమణి పురస్కార గ్రహీత డా.కె. సదానంద, ప్రిన్సిపాల్ కె . జ్యోతి సదానంద బహుమతులను ప్రదానం చేసి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డా. కె. సదానంద మాట్లాడుతూ. తమ విద్యాసంస్థలు స్థాపించిన 31 సంవత్సరాల నుంచి తమ విద్యార్థులు విద్యారంగంలోనే కాకుండా వివిధ రంగాలలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఉన్నతంగా రాణిస్తున్నారని తెలిపారు. భావికాలంలో తమ విద్యార్థులందరూ ఇదేవిధంగా మరిన్ని విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సీనియర్ విద్యార్థులను లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డా.కె. సదానంద , ప్రిన్సిపాల్ కె.జ్యోతి సదానంద, వైస్ ప్రిన్సిపాల్ జి.రవీందర్ రెడ్డి, అధ్యాపకులు, కార్యనిర్వాహకవర్గం , పలువురు పెద్దలు పలు ప్రశంసలతో అభినందించారు.

'సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడుతూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం పట్ల తెలుగు సాహితీ, తెలుగు భాషా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపాయి. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు కృష్ణ వర్ధన్, తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు పి.బడేసాబ్, కార్యదర్శి సంపండి నర్సింహ, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షులు డాక్టర్ చంద్రప్రకాశ్ రెడ్డి, ఉపాధ్యక్షులు గంటా మనోహర్ రెడ్డి, తెలుగు అభివృద్ధి సమితి అధ్యక్షులు మేక రవీంద్ర, దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షులు రామకృష్ణ చంద్రమౌళి, మానస ఆర్ట్ థియేటర్ అధ్యక్షులు రఘు శ్రీలు సమావేశమయ్యారు. సురవరం ప్రతాపరెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో పరిశోధన చేసి 355 మంది కవులు ఉన్నారని గుర్తించి, ఎలుగెత్తి చాటిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి అని కొనియాడారు.

ముగిసిన సత్యనారాయణ అంత్యక్రియలు

నవతెలంగాణ-అంబర్‌పేట



బద్దుల సత్యనారాయణ యాదవ్ అంత్యక్రియలు శనివారం శోక సంద్రంలో ముగిశాయి. కాచిగూడ స్మశాన వాటికలో కుటుంబ సభ్యులు బంధుమిత్రుల వివిధ రాజకీయ పార్టీల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సత్యనారాయణకు నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రూ.5లక్షల విరాళం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షలు విరాళంగా అందించింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు సమక్షంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ద్వారా చెక్కును అందజేశారు. ఈ చెక్కును టీఎల్‌డీఏ అధ్యక్షుడు కె.జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.శ్రీచరణ్, కోశాధికారి జె.అయాల్‌రెడ్డి, సీనియర్ సభ్యులు సుభాష్‌రావుతో కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా టీఎల్‌డీఏ నాయకులు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఈ సహకారం, ప్రభుత్వ కార్యక్రమాలకు నిరంతర మద్దతు ద్వారా, ఇతర సంస్థలు, వ్యక్తులు ముందుకు రావడానికి, సహాయ, పునరావాస కార్యక్రమాలకు ఉదారంగా సహకారం అందించడానికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఎల్పీజీ పంపిణీదారులు, వినియోగదారుల తరుపున, మహాలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా ప్రారంభించి, అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం రాష్ట్ర వ్యాప్తంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎల్పీజీ వినియోగదారులందరికీ వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500 చొప్పున అందించడం ద్వారా, అనేక గృహాలకు అవసరమైన ఇంధనం సరసమైన ధరలో అందుబాటులో ఉండేలా చేయడం ద్వారా గణనీయంగా ప్రయోజనం చేకూర్చుతుందని అభిప్రాయపడ్డారు.

భారీ వర్షానికి ట్రాఫిక్ జామ్

- వర్షంలో తిరగవద్దు విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది
- కమిషనర్ ఆమ్రపాలి, హైడ్రా కమిషనర్ రంగనాథ్

నవ తెలంగాణ - బంజారాహిల్స్..

భారీ వర్షానికి భారీ ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు వర్షంలో బయలుదేరిన సీఎంకూ ట్రాఫిక్ ఇక్కట్లు తప్ప లేవు. భారీ వర్షానికి ఖైరతాబాద్,బంజారాహిల్స్, జూబ్లీహిల్స్,సోమాజిగూడ డివిజన్ల పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దీంతో భార్య ట్రాఫిక్ జామ్ అవ్వడంతో వాహన చోదకులకు ఇంటికి వెళ్లడానికి గంటల తరబడి రహదారులపైనే ఉండే పరిస్థితి నెలకొంది. మెట్రో కారణంగా ద్విచక్ర వాహనదారులు అక్కడక్కడ ఆగిపోయిన కారు,ఆటో, ఇతర వాహనాలు తోపాటు బస్సులు ట్రాఫిక్ లో మెల్లమెల్లగా వెళ్లడం ప్రారంభించగానే వర్షం కొంత ఊరటం ఇవ్వడంతో ద్విచక్ర వాహన చోదకులు భారీ సంఖ్యలో రహదారులపై రావడంతో మళ్లీ ట్రాఫిక్ జామ్ జరిగింది.









వర్షపు నీరు భారీ సంఖ్యలో రహదారులపై చేరుకోవడంతో ఏ మ్యాన్ హోల్ ఎక్కడ ఉందో ఏ మూత ఎక్కడ తెరిచి ఉందో తెలియని అయోమయంలో వాహన చోదకులు ముందుకు సాగారు. వారందరినీ అప్రమత్తం చేయడానికి హైడ్రా కమిషనర్ రంగనాథన్ బేగంపేట్ ఫ్లైఓవర్ వద్దకు చేరుకొని తరచూ ప్రమాదాలు జరిగే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని అలాగే వర్షపు నీళ్లను సజావుగా వెళ్లేలా జీహెచ్ఎంసీ ,డీఆర్ఎఫ్, పోలీ సులకు తమ సూచనలు చేసి అత్యవసర సేవల్లో ఎప్పుడు నిమగ్నమై ఉంటూ ట్రాఫిక్ ఇతర సమస్యలు నెలకొనకుండా కంప్లైంట్ వచన వెంటనే అత్యవసర పరిస్థితి ఉంటే తగిన సిబ్బందిని తీసుకొని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నగర కమిషనర్ ఆమ్రపాలి నగరం తో పాటు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కు ప్రజలకు అందు బాటులో ఉండాలని సూచిస్తూ అత్యధికంగా లోతట్టు ప్రాంతాలు బస్తీలు ఉన్న హిల్స్ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎక్కువగా విద్యుత్ ఘాతాలు వర్షాలు కురిసినప్పుడే ఎక్కువగా జరిగే సూచనలు ఉన్నందున జిహెచ్ఎంసి అధికారులు,సిబ్బంది అందుబాటులో ఉండే 04-2111 1111 లేదా 9000113667 ఈ నంబర్లకు సాంప్రదించాలని ప్రజలను కోరారు.

వర్షానికి జలమయమైన రోడ్లు



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

పాతబస్తీలో రోడ్లు కొద్దిపాటి వర్షానికి వాగులను తలపిస్తున్నాయి. గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముందే రోడ్లు గుంతలమయమై అధ్వానంగా మారాయి. దాంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా ఛత్రినాక చౌరస్తా, శివగంగా నగర్, ఉప్పుగూడ, శివాజీ నగర్, గౌలిపుర, హనుమాన్ నగర్, అంబికా నగర్, పటేల్ నగర్ ప్రాంతాలలో. వర్షాకాలం వచ్చిందంటే బస్తీవాసులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.. రాజన్న బావి నుంచి శివాజీ నగర్, శివగంగా నగరం ద్వారా వస్తున్న వర్షపు నీరు డ్రయినేజీతో కలిసి మహా ప్రవాహంగా వస్తుంది. ప్రతి సంవత్సరం లక్షలు ఖర్చుపెట్టి మరమత్తులు చేస్తున్నా అది టెండర్ తీసుకున్న గుత్తేదారులకే ఆర్థికంగా వెసులుబాటు చేసినట్టు అవుతుంది. పలువురు స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నగరంలో 'స్పైన్ సర్జరీ'పై సదస్సు

- వెన్నెముకల శస్త్రచికిత్సలు, రేడియేషన్, లేజర్ శస్త్రచికిత్సలపై చర్చ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో నాలుగు రోజులపాటు 'స్పైన్ సర్జరీ'పై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యూరో స్పైన్ సర్జన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వార్షిక సమావేశం, వర్క్ షాప్ నిర్వహించారు. సుమారు 450 మందికి పైగా న్యూరోసర్జన్లు హాజరైన ఈ సదస్సులో ప్రధానంగా వెన్నెముకల శస్త్రచికిత్సలు, రేడియేషన్, లేజర్ శస్త్రచికిత్సలపై చర్చించారు. ఈ విషయాలను కిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి మీడియాకు తెలిపారు. వెన్నెముక శస్త్రచికిత్సలకు రోబోల వినియోగం తొలిసారిగా ఇప్పుడే అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. గతంలో మైక్రోస్కోప్‌ల ద్వారా శస్త్రచికిత్సలు చేసేవారనీ, ఇప్పుడు మెరుగైన రోబోలు రావడంతో కచ్చితమైన దిశలోనే స్క్రూలు అమర్చేందుకు వీలు కుదురుతోందని తెలిపారు. ఈ విషయాలను మూడు కంపెనీలకు చెందిన రోబోల ద్వారా మోడళ్ల మీద శస్త్రచికిత్సలు చేయిస్తూ వర్క్ షాప్‌లో వివరించినట్టు తెలిపారు. రోబోటిక్ ఆర్మ్ సాయంతో స్క్రూలు ఎలా పెట్టాలో కచ్చితంగా నిర్ణయించగలుగుతున్నామని తెలిపారు. సీ ఆర్మ్ అవసరం కూడా రావడం లేదని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఇటలీ నుంచి తెప్పించిన మోడళ్ల మీద రోబోలు, ఎండోస్కోప్ సాయంతో శస్త్రచికిత్సలు చేయించినట్టు చెప్పారు. ఇంతకుముందు స్పైన్ సర్జరీ చేయించుకోవాలంటే భయపడేవారనీ, ఇప్పుడు టెక్నాలజీ మారడంతో శస్త్రచికిత్సల వల్ల ముప్పు తగ్గుతుందనీ, ప్రారంభ దశలోనే శస్త్రచికిత్స చేయడం ద్వారా ఆయా శరీర భాగాలకు భవిష్యత్‌లో ఇబ్బంది కలగకుండా నయం చేయగలుగుతున్నామని తెలిపారు.

బహుజనులు రాజ్యాధికారం దిశగా ముందుకు నడవాలి

- సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపకులు బి పురుషోత్తం



నవతెలంగాణ - ముషీరాబాద్

బహుజనులు రాజ్యాధికారం దిశగా బాటలు వేసి ముందుకు నడవాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపకులు బి పురుషోత్తం అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 136 కులాలు ఉండగా అందులో సుమారు 120 కులాలు నేటికీ తమ నేతలను శాసనసభకు పంపలేకపోయారని తెలిపారు. 3 లక్షలకు పైగా ఉన్న నాయి బ్రాహ్మణులు అనగా మంగలి శాలివాహనులు, కుమ్మరి వడ్డెరలు ఈ 77 ఏండ్ల స్వాతంత్ర పాలనలో ఒక్క సభ్యుని కూడా శాసనసభకు పంపలేకపోయారని చెప్పారు. నాయి బ్రాహ్మణుడైన భారతరత్న కర్పూరి ఠాగూర్ బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసే జననాయకుడైనారని.. తమిళనాడులో నాయి బ్రాహ్మణులు ముఖ్యమంత్రిగా ఏలుతుంటే ఇక్కడ మన తెలుగు రాష్ట్రాలలో ఒక్కరూ ఎమ్మెల్యేగా లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం లక్ష జనాభా ఉన్న ఒక అగ్రకులం అసెంబ్లీలో ఐదు నుంచి ఏడు శాతం సీట్లు సంపాదిస్తున్నారని.. అలాగే మూడు శాతం ఉన్న జనాభా ఇంకో అగ్రకులం 33 శాతం సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. 60 శాతం జనాభా ఉన్న బీసీ కులాలు మాత్రం ఎక్కడో మూలన పడి ఉంటున్నాయన్నారు. ఇది సమన్యాయం అవుతుందా అని ప్రశ్నించారు. యావత్ బీసీ కులాలు యువత చదువుకున్న మేధావులు హక్కుల సాధనకై బహుజనుల రాజ్యాధికారం దిశగా బాటలు వేసే ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో/ఓయూ

చిలకలగూడ దూద్ బావిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈక్షణ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మేఘన నందురి రాజా శేఖర్ రెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ చారిట్రబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ రవితేజ, సభ్యులు నికేత్, భాస్కర్, ప్రసన్న, మాధవిల ఆధ్వర్యంలో విద్యార్థులకు షూస్ , సాక్స్ ,బ్యాగ్స్ , స్టేషనరీ బాక్స్ లు , పెన్సిళ్లు అందజేశారు. ముఖ్యఅతిథులుగా మేఘన నందూరి,రవితేజ , రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మీరు మీతో పాటు దేశం బాగుపడటానికి మంచిగా చదువుకోవాలని, బాగా చదువుకొని వివిధ వత్తుల్లో రాణించాలని కోరారు. విద్యతో సంస్కారం జ్ఞానం వివేకం వస్తుందని, విద్యతో ఏదైనా సాధించవచ్చునన్నారు. రవితేజ మాట్లాడుతూ. అందరూ బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు పొంది తమ లాగా సమాజ సేవ చేయాలని, మానవ సేవయే, మాధవ సేవా అన్నారు. కార్యక్రమంలో టీచర్స్ జకీయా బేగం, మల్లీశ్వరి, హసీనా బేగం, నాగసతి పాల్గొన్నారు.



అరుణ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు, విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్ పుట్టిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీమ్ పాష, టీఎస్‌యూ రాష్ట్ర అధక్షుడు నల్గొండ అంజి, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్, ఓయూ జేఏసీ చైర్మెన్ బాలకృష్ణ నేత, ఓయూ విద్యార్థి నాయకులు వలిగొండ శ్రీనివాస్, ఇరంటి విజయ్ మాదిగ, సుమంత్, మురళి, రుక్మత్ పాష, శాంతికుమార్, బోనాల నగేష్, రవి నాయక్, పల్లపు చందు, శేఖర్ యాదవ్, డప్పు గోపి, రాజు ముదిరాజ్, సయ్యద్ నవాజ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తు ఘనంగా గజమాలతో సత్కారించారు.

జాతీయ సంగీత నృత్య పోటీలు దేశంలో అతిపెద్ద వేడుక

నవతెలంగాణ-కల్చరల్

నవ్య నాటక సమితి నిర్వహణలో జరుగుతున్న జాతీయ స్థాయి సంగీత నృత్య పోటీలు దేశం లోనే అతి పెద్ద వేడుక అని అతిథులు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్‌టీఆర్ కళా మందిరం లో నవ్య నాటక సమితి నిర్వహణలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో జరుగుతున్న జాతీయ సంగీత నృత్య పోటీలలో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త ఆకుల రంజిత్ కుమార్ మాట్లాడారు. సంస్థలు పుట్టి కొద్ది కాలంలోనే కనుమరుగవుతున్న సందర్భంలో 49 ఏండ్లుగా సంస్థను నడుపుతూ పోటీలు కూడా నిరాటంకంగా నిర్వహించటం అపురూపం అన్నారు. రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకులు డాక్టర్ జి వసుంధర పోటీలలో పాల్గొంటున్న కళాకారులను అభినందించారు. ఈ సందర్భం గా నాట్య గురువులు నాగ సాయి, గంటి ఇందుమతి, పి.శివ ప్రసాద్ లను అతిథులు సత్కరించారు. సుధా మాల స్వాగతం పలికిన కార్యక్రమంలో వాణీ రమణ, ఆర్ చెంద్ర శేఖర్ పాల్గొనగా సంస్థ అధ్యక్షుడు విజయ కుమార్ సభ సమన్వయం చేయగా శర్మ తదితరులు పర్యవేక్షణ చేశారు.



డా. విజయ భాస్కర్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్కారం



నవతెలంగాణ-ధూల్ పేట్

హైదరాబాద్ జిల్లా స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)కు మాక్స్ వెల్ సంస్థ హిమాయత్ నగర్‌లోని కేంద్ర కార్యాలయంలో డాక్టర్.ఎస్. విజయ భాస్కర్ కు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షులు చక్రధర్ సత్కారం చేశారు. డాక్టర్. ఎస్. విజయ భాస్కర్ విద్యా, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, పత్రిక రంగాలలో చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా భారతరత్న డాక్టర్.సర్వేపల్లి జన్మదినోత్సవ సందర్భంగా జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా సెప్టెంబర్ నెలలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి తమ సంస్థ ద్వారా సన్మానం చేస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో మన్మోహన్, రాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ



నవతెలంగాణ - ముషీరాబాద్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ జలదృశ్యం వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,స్వరాష్ట్రం కోసం పరితపించిన నికార్సైన తెలంగాణ వాది, నిరాడంబరులు, నిస్వార్థపరులు, తెలంగాణ కోసం తన మంత్రి పదవిని తణప్రాయంగా వదిలేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీఅన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు



ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- బాధితుడు సాజిద్ బిన్ ముబారక్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం, ముత్తంగి గ్రామం, రామ రాజునగర్‌లో గత 30 ఏండ్ల క్రితం సర్వే నెంబర్.55, 56, 82, 85లలో తమ కుటుంబం కొనుగోలు చేసిన 100 గజాల ప్లాట్‌లో నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణ గోడలు, తలుపులు, కిటికీలు ఇటీవల కూలగొట్టిన స్థానిక ఈవో, డీపీఓలపై చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధి తుడు సాజిద్ బిన్ ముబారక్ స్థానిక జిల్లా కలెక్టర్, ఎస్పీలను కోరారు.శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద గజాల ప్లాట్‌లో తన తమ్ముడికి 50 గజాలు పోను తనకు వచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం కోసం గోడలు, కిటికీలు నిర్మించుకున్నామని చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 25న తన ప్లాట్‌లో నిర్మితమైన గోడలను స్థానిక ఈవో జేసీబీతో అన్యాయంగా కూలగొట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్లాట్ ఎఫ్‌టీఎల్‌లో లేదని, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో పలు ప్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి బాధితులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 57ను మిస్ గైడ్ చేసి లచ్చిరాజు అనే వ్యక్తి దుర్మార్గానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.ప్లాట్ల సర్వే నెంబర్లు మార్చి ప్లాట్ నెంబర్ ఒకటే ఉంచి, డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి కొనుగోలుదారులను మోసం చేస్తున్న ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి వారికి వత్తాసు పలుకుతున్న స్థానిక ఈవో, డీపీఓ, జిల్లా కలెక్టర్ లపై శాఖపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని వేడుకున్నారు.

ఇక ఇంకుడు గుంతలు తప్పనిసరి..!





- ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోని క్యాన్ నంబర్లపై దృష్టి
- ట్యాంకర్ల బుకింగ్‌లో రెట్టింపు ఛార్జీలు
- అక్టోబర్ 2 నుంచి స్పెషల్ డ్రైవ్
- భూగర్భ జలాలు పెంపొందించే దిశగా జలమండలి అడుగులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అత్యంత వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతూ వాన చినుకు నేలలో ఇంకే పరిస్థితి లేకపోవడంతో ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలను పెంపొందించే దిశగా జలమండలి అడుగులేస్తోంది. ఇటీవల వేసవిలో మహానగరానికి తాగు నీరు అందించే జలాశయాల్లో నీటి మట్టం అడుగంటడంతో అత్యవసర పంపింగ్‌తో డెడ్‌స్టోరేజీ నుంచి తరలించి తాగు నీటి అవసరాలు తీర్చిన విషయం తెలిసిందే. నగరంలో భూగర్భ జలాలు పడిపోవడంతో గృహ అవసరాలకు సైతం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా భారం జలమం డలిపై పడింది. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సరికొత్త ప్రణాళికతో ముందుస్తు కార్యాచరణకు సిద్ధమయ్యారు.

'ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత'

మహానగంలో నీటి సంరక్షణ చర్యల ద్వారా ప్రతి ఇంటా భూగర్భ జలాలను రీస్టోర్ చేసుకునే దిశగా ఇప్పటికే నల్లా కనెక్షన్ ఉన్న వారితో పాటు కొత్త కనెక్షన్ తీసుకోవా లనుకునే వారి ఇంటి ప్రాంగణంలో ఇంకుడుగుంతల ఏర్పాటు తప్పని సరి అన్న అంశంపై జలమండలి దృష్టి సారించింది. మహాత్మ గాంధీ జయంతి అక్టోబర్ 2న పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ మార్గదర్శ కత్వంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పథకంలో భాగంగా 'ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత'అనే పేరుతో స్పెషల్ డ్రైవ్ ప్రారంభించాలని నిర్ణయించింది. ఇంకుడు గుంత నిర్మించుకోవడానికి అర్హత కలిగిన జియాలజిస్టులతో అవసరమైన సాంకేతిక సహకారాన్ని జలమండలి అందించనుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి. నల్లా కనెక్షన్‌కు సంబంధించిన పర్మిషన్ లెటర్ లో సైతం ఇంకుడు గుంతల ఏర్పాటు షరతు ఉంటుంది. అయితే భవన నిర్మాణం సమయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నా కాలక్రమేణా దాన్ని పునరుద్ధరించుకోవడంలో ఆసక్తి చూపని వాళ్లను, మరి కొందరు అసలు ఇంకుడు గుంతలు నిర్మాణమే చేపట్టకుండానే ఇళ్లు నిర్మించుకున్నట్లు జలమండలి గుర్తించింది.

కొనసాగుతున్న సర్వే

ఈ ఏడాది వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఇంకుడు గుంతల సర్వే కోసం జలమండలి ఒక అప్లికేషన్ రూపొం దించి అందుబాటులోకి తీసుకొచ్చింది. 300 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రాంగణాలు గల వినియోగదారుల క్యాన్ నంబర్ల ఆధారంగా ఇంకుడు గుంతల స్థితిగతులపై సర్వే చేపట్టింది. ఈ ఏడాది 14 జూన్ నుంచి సర్వే కొనసాగుతోంది. మొదటి విడతలో సుమారు 42,784 గృహ సముదాయాల ప్రాంగణాలు తనిఖీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా సెప్టెంబర్ 18 నాటికి 25,578 ప్రాంగణాలు తనిఖీ చేయగా వాటిలో 12,446 ప్రాంగాణాలు ఇంకుడు గుం తలు కలిగి ఉన్నట్టు, మిగిలిన 13,132 ప్రాంగణాలు ఇంకుడు గుంతలు లేనివిగా గుర్తించింది. తాజాగా స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేసేందుకు జలమండలి సిద్ధమైంది. ఇక డివిజన్‌ను ఒక యూనిట్‌గా పరిగణించి తనిఖీలు ముమ్మ రం చేయనుంది. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ 300 చదరపు మీటర్లు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న బహుళ గృహ సముదాయాలతోపాటు వ్యక్తిగత గృహాల డేటా సేకరించి ఆ వివరాల్ని ప్రత్యేక యాప్‌లో పొందుపర్చనుంది.

రెట్టింపు చార్జీలు తప్పవు!

తమ ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించకుండా వచ్చే ఏడాది 2025 జనవరి నుంచి వాటర్ ట్యాంకర్ బుక్ చేసుకునే వినియోగదారుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేయాలని జలమండలి నిర్ణయించింది. కేవలం వినియోగదారుల ప్రాంగణాల్లో గల బోర్లలో భూగర్భ జలాలు పెంచేందుకు ఇలాంటి కఠిన నిర్ణయం అమలు పర్చేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మే నెల వరకు అత్యధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులను ఇప్పటికే జలమండలి గుర్తించింది. మొదటగా వారి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రోత్సహించనుంది.

శాస్త్రీయ పద్ధతిలో ఇంకుడు గుంతల నిర్మాణం

హైదరాబాద్‌లో భూగర్భ జలాలు క్షీణత లేకుండా ఉండేందుకు శాస్త్రీయ పద్ధతిలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టే విధంగా అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం 18 ఎన్జీవోల ప్రతినిధుల్ని రంగంలోకి దింపి వినియోగదారులకు అవగాహన కల్పిస్తోంది. ఈ అవగాహన కార్యక్రమాలను కోర్‌సిటీతో పాటు ఓఆర్ఆర్ వరకు విస్తరించనుంది. ఇంకుడు గుంతలు, ఇంజెక్షన్ వెల్స్ కోసం ముఖ్యమైన పబ్లిక్ స్థలా లను గుర్తించనుంది. సరైన శాస్త్రీయ పద్ధతులు, భద్రతా చర్యలతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచిస్తోంది.

ఇక వినియోగదారులకు లేఖలు

ఇంకుడు గుంతల సర్వే నివేదికల ప్రకారం ప్రత్యేక యాప్‌లో పొందుపర్చిన డేటా ఆధారంగా డివిజన్ స్థాయి అధికారులు తమ పరిధిలోని వినియోగదారులకు అడ్వైజ రీ లేఖలు జారీ చేసే విధంగా ఆదేశాలు జారీ చేయనుంది. ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించడం, ఒకవేళ పాడైతే వాటికి రిపేర్ చేయడం, వాటిని మెయింటెన్ చేయాలని లేఖలో సలహాలు ఇవ్వనుంది. ఒకవేళ వినియోగదారులు పైన పేర్కొన్న సూచనలను పాటించడంలో విఫలమైతే వచ్చే ఏడాది నుంచి ట్యాంకర్ల బుకింగ్ సందర్భంగా రెట్టింపు ఛార్జీల భారం పడే అవకాశాలు ఉన్నాయి.



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి

- వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వేముల వెంకటేష్
- మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వేముల వెంక టేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సంఘం ప్రతినిధుల బందంతో కలిసి ఆయన మంత్రి జూపల్లి కృష్ణారావును వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేముల వెంకటేష్ మాట్లాడుతూ తెలం గాణ ప్రభుత్వం ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.అందుకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ లకు వడ్డెర సామాజిక వర్గం పక్షాన ఆయన కతజ్ఞతలు తెలిపారు.ఓబన్న విగ్రహన్ని రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై నెలకొల్పితే దేశ వ్యాప్తంగా ఉన్న వడ్డెర్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞులై ఉంటారన్నారు. అదే విధంగా అన్ని రంగాల్లో వెనుకబడిన వడ్డెర్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర్లకు మైనింగ్ లో 20 శాతం ఇచ్చిన రిజర్వేషన్లను అమలు చేయాలని, ప్రభుత్వ పనుల్లో 15 శాతం రిజర్వేషన్లను ఉమ్మడి రాష్ట్రంలో వడ్డెర్లకు కల్పిస్తే దాన్ని గత బీఆర్ఎస్ ప్రభు త్వం రద్దు చేసి కేవలం ఒకటిన్నర శాతం మాత్రమే కేటాయించి తమకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. సంఘం జాతీయ కోశాధికారి బత్తుల లక్ష్మీ కాంతయ్య, ఆలకుంట్ల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆ వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ స్టేట్ క్రిస్టియన్, కన్వర్టెడ్ క్రిస్టియన్ యునైటెడ్ స్ట్రగుల్ కమిటీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

భర్త మరణాంతరం భార్య, పిల్లలకు రావాల్సిన బెనిఫిట్స్‌ను దక్కనీయకుండా అడ్డుకుంటున్న వ్యక్తులపై చట్టరిత్యా చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ స్టేట్ క్రిస్టియన్, కన్వర్టెడ్ క్రిస్టియన్ యునైటెడ్ స్ట్రగుల్ కమిటీ సలహాదారులు రేణుకుంట్ల ఎల్లయ్య, బాధితురాలు టి.నయోమి ఎలియాద రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదర్‌గూ డలోని ఎస్ఎస్ఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితురాలు నయోమి ఎలియాదతో కలిసి ఎల్లయ్య మాట్లాడారు. పిల్లి కిషోర్ కుమార్ అనే హెడ్ కానిస్టేబుల్ లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తుండగా కిడ్నీలు చెడిపోయి గత ఏడాది డిసెంబర్ 5న మతి చెందారని తెలిపారు.కాగా చట్ట ప్రకారం అతని భార్య టి.నయోమి ఎలియాద, కొడుకు, కుమార్తెకు దక్కవలసిన బెనిఫిట్స్‌ను ఆమె మామ, రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ పిల్లి రాఘవులు, అత్త పి.సువర్ణ, ఆడపడుచులు, వారి కుటుంబ సభ్యులు కలిసి రానీయకుండా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీస్ స్టేషన్, ఏసీపీ, డీసీపీ, రాష్ట్ర డీజీపీలకు వినతి పత్రాలను అందజేసినట్టు గుర్తు చేశారు.ఆమెకు జరిగిన అన్యాయాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీసీఐడీచే విచారణ జరిపించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బాధితురాలు నయోమి ఎలియాద కొడుకు, కుమార్తె, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు డేవిడ్ కదారి, మహిళా విభాగం నాయకురాలు సుహాసిని పాల్గొన్నారు.

చలో లేబర్ ఆఫీస్‌ను జయప్రదం చేయాలి



- సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ రాములు

నవతెలంగాణ-అంబర్‌పేట

23న జరిగే చలో లేబర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీ నర్ రాములు అన్నారు. భవన నిర్మాణ కార్మికుల లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ద్వారా వచ్చే బెనిఫిట్‌ను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పొదని శనివారం సీఐటీయూ అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డా దగ్గర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల ఇన్సూరెన్స్ కార్డుపై వచ్చే బెనిఫిట్ ను ప్రయివేటు కంపెనీలకు అప్పజెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికులు అనేక సంవత్సరాలు పోరాటం చేసి సాధించుకున్న సంక్షేమ పథకం అని ఈ పథకం ద్వారా కార్మికులు అనేక రకాలుగా లబ్ధి పొందు తున్నారని తెలిపారు. కానీ లేబర్ అధికారులు రాష్ట్ర ప్రభు త్వం కుమ్మక్కై, వీళ్ళకి రావాల్సిన బెనిఫిట్ ను వీరికి అంద కుండా చేయడం కోసం ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే లేబర్ డిపార్ట్మెంట్లో అధికారులు సెస్సు వసూలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. గత ప్రభుత్వం కరోనా సమయంలో రాష్ట్ర ప్రజానీకానికి సహాయం నిమిత్తం కోట్ల రూపాయలు వాడుకుందని బీసీ బంధు పేరుతో రూ. 300 కోట్లు వాడు కొందని, హెల్త్ చెకప్ కోసం రూ. 300 కోట్లు వాడుకున్నదని, ఆయుష్మాన్ భారత్ పేరుతో రూ.99 కోట్లు వాడుకున్నదని ఆరోపించారు. అనేక రకాలుగా కార్మికుల పేరుతో జమైన డబ్బులు అనేక రంగాలకు దారి మళ్ళిస్తూ కార్మికుల పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు మలిగే నక్కపై తాటిపండు పద్ధచం దంగా మళ్ళీ ఈ డబ్బులు అన్నిటినీ ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడంతో ఉన్న డబ్బులు మొత్తం పూర్తిగా ప్రభుత్వం నాశనం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నదని దీని కార్మికులు సహించబోరని హెచ్చరించారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి ప్రతిపాదనను విరమించుకోకపోతే భవిష్యత్తులో కార్మికులతో అనేక ఆందోళన చేయాల్సి వస్తుందని దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వాన్నిదని హెచ్చరించారు. ఈనెల 23న సోమవారం రోజు జరిగే ధర్నాను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు ధనరాజ్, ప్రభాకర్, సాయిలు, ఐలయ్య భూషణం, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, ప్రచారంలో నెహ్రూ జూ పార్క్ ముందంజ



- డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా..

నవతెలంగాణ-ధూల్ పేట్

నెహ్రూ జూలాజికల్ పార్క్ విద్య, ప్రచారంలో ముందంజలో ఉందని జూ పార్క్ డిప్యూటీ.క్యూరేటర్ ఎం.బర్నోబా అన్నారు. వన్యప్రాణుల విద్యలో భాగంగా భారత ప్రభుత్వం పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం "స్వభావ స్వచ్ఛత -సంస్కార్ స్వచ్ఛత" అనే అంశంపై డ్రాయింగ్, పోస్టర్ తయారీ పోటీలను నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా రెండు వారాల పాటు స్వచ్ఛతా హై సేవా-2024 వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో సమీపంలోని 5 ప్రభుత్వ, 1 ప్రయివేటు పాఠశాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య వన్యప్రాణుల సంరక్షణలో జూల పాత్ర పై వివరిం చారు. నెహ్రూ జూలాజికల్ పార్క్ ఎప్పుడు విద్య ప్రచారం లో ముందంజలో ఉందన్నారు. వన్యప్రాణుల విద్య. వేడు కల్లో భాగంగా వివిధ స్థాయిల విద్యార్థులకు నిర్వహిం చిన డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ పోటీలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులందరికీ ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛత విద్య, వన్యప్రాణుల సంరక్షణ పై విద్యార్థుల కు బాల్య దశలో ఈ పోటీలలో అలవర్చడమవుతుందన్నారు. "స్వభావ స్వచ్ఛత -సంస్కార స్వచ్ఛత" సందర్భంగా అందరికీ అభినందనలు తెలిపారు. విజేతలకు అక్టోబర్ 2న సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యురేటర్ - 1 విష్ణు వర్ధన్, 2- అమతమ్మ, పీఆర్ఓ హనిఫుల్లా, ఈఓ ఎం దీపక్ తరుణ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

సామాజిక తెలంగాణ సాధనే కొండా లక్ష్మణ్ బాపూజీకిచ్చే ఘననివాళి అనిఎంపీ ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల ప్రముఖులు, ఉద్యమకారులు, బాపూజీ అనుయాయులు , అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. రాష్ట్రంలో పరిపాలన బాపూజీ ఆశయాలకు విరుద్ధంగా కొనసాగుతున్నదని పలువురు విచారం వ్యక్తం చేశారు.

ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సబ్బండ వర్గాలు సౌఖ్యంగా జీవించడానికి తన స్వగృహమైన జలదృశ్యాన్ని బీఆర్ఎస్ ఆవిర్భావానికి అంకితమివ్వడం బాపూజీ దార్శని కతను, ధైర్యాన్ని ప్రతిభింభిస్తున్నదని అన్నారు. కానీ నేడు తెలంగాణ ఆవిర్భావం తరువాత సామాజిక పరిస్థితులు అందుకు భిన్నంగా కొనసాగుతున్నాయన్నారు. మహనీ యుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణలో బడుగు బలహీన వర్గాలు తీవ్రంగా అణచివేయబడుతున్నారని పేర్కొన్నారు. నియామకాలు లేక తెలంగాణ యువత అల్లాడుతూ మద్యపానానికి , మత్తు పదార్థాలకు బానిసలవుతుంటే అగ్ర వర్ణాల కుటుంబాలకు మాత్రం నిండుకుండలా కొలువులు అందుతున్నా యన్నారు . తెలంగాణ పౌరసమాజం కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమించాలన్నారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ విద్య వైద్యం సామాజిక ఆర్థిక రాజకీయ అవకాశాలు ప్రజలందరికీ సమాన నిష్పత్తిలో లభించినప్పుడే సంపూర్ణ తెలంగాణ సాకారమవుతుందన్న బాపూజీ అంతరంగాన్ని ప్రభుత్వం గుర్తెరగాలన్నారు. ఈ కార్యక్ర మంలో జేఏసీ చైర్మెన్ నీలం వెంకటేష్, విద్యార్థి నాయకుడు రామకృష్ణ, గొల్లపల్లి అంజి, సతీష్, మురళి కృష్ణ, సురేష్, పండరినాథ్, శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్, సూర్యనారాయణ, జానయ్య, ఎల్లయ్య, పలువురు పద్మశాలి నాయకులు పాల్గొన్నారు.

వృక్ష వర్గీకరణ, హెర్బేరియంపై ముగిసిన కార్యశాల..

నవతెలంగాణ-ధూల్ పేట్

సిటీ కళాశాలలో నిర్వహిస్తున్న వృక్ష వర్గీకరణ, హెర్బేరియం తయారీ కార్యశాల రెండో రోజు మొక్కలు వర్గీకరణలో అవలంబిస్తున్న ఆధునిక కార్యాచరణ పద్ధతులను గురించి శాస్త్రవేత్తలు వివరించారు. డీఆర్సీ భారతీయ వృక్ష పరిశోధన సంస్థ, హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్. శంకర్రావు, డాక్టర్.హరికృష్ణ డాక్టర్.స్వర్ణలత హెర్బేరియం తయారు చేయు విధానంలో సాంకేతిక అంశాలను తెలియజేశారు. విద్యార్థులతో మొక్కలు సేకరించటం, ఆరబెట్టడం, విషరహితం చేయటం, సమాచారాన్ని క్షేత్ర పుస్తకంలో రాయడం చెదపురుగులు పట్టకుండా సుదీర్ఘకాలం వరకు భద్రపరచడం పై ప్రత్యక్షంగా వివరించారు. తదనంతరం బీ.ఎస్.ఐ ఆచార్యులు జగదీష్ చంద్రబోస్ భారతీయ బొటానికల్ గార్డెన్ క్యూరేటర్ డాక్టర్. స్వామి విజువల్‌గా గార్డెన్ చూపిస్తూ సంరక్షణ విధానాలను వివరించారు. ఆర్కే చౌదరి, శాస్త్రవేత్త అగార్కార్ పరిశోధన సంస్థ వారు వృక్ష వర్గీకరణలో ఆధునిక పోకడలను వివరించారు. రెండు రోజుల కార్యశాలలో 30 మంది అధ్యాపకులు, వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. వృక్ష వర్గీకరణ గురించి వివరంగా తెలుసుకోవటమే కాక, వివిధ శాస్త్రవేత్తలతో ముఖాముఖీ మాట్లాడటం చాలా స్ఫూర్తివంతంగా ఉందని పాల్గొన్న విద్యార్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన డాక్టర్.నాగరాజును కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

టీటీడీ ఆలయాల నిర్వహణలో ప్రభుత్వ జోక్యం ఉండొద్దు



- ఏకం సనాతన భారత్ దళం రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర కుమార్ చతుర్వేది

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచంలోని అత్యంత పవిత్రమైన హిందూ దేవాలయాల్లో ఒకటని, అలాంటి ఆలయంలో తయారవుతున్న తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి భక్తులకు ఇవ్వడం లక్షలాది మంది హిందువుల విశ్వాసానికి ప్రమాదకరమని ఏకం సనాతన భారత్ దళం రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర కుమార్ చతుర్వేది ఆందోళన వ్యక్తం చేశారు.శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'ఆవు ప్రతిష్ఠ ఆవు జెండా సంస్థాపన భారతదేశ పర్యటన' పేరుతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆర్థిక, పరిపాలన వ్యవస్థలను ప్రభుత్వాలు ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు.హిందూ భక్తుల మనోభావ ాలు, తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను దెబ్బతీసేలా దుర్మార్గమైన పాలనను గత సీఎం జగన్మోహన్ రెడ్డి సాగించారని మండిపడ్డారు.ఈ విషయం హిందూ సమాజంలో తీవ్రమైన అసంతృప్తిని కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా టీటీడీ ఆలయాల నిర్వహణ ఎలాంటి రాజ కీయ, ప్రభుత్వ జోక్యం లేకుండా జరగాలని కోరారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో జరిగిన సంఘటనపై సుప్రీం కోర్టు ద్వారా విచారణ జరిపించాలని, దీనికి బాధ్యులైన నేరస్థులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సర్వ దలిత గౌ రక్షణ మంచ్ అధ్యక్షులు జయపాల్ సింగ్, సీనియర్ సభ్యులు శివరామ్ ప్రసాద్, వినయ్ శర్మ, పాశ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న, వైస్ ప్రెసిడెంట్ దామస్ రెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ వెంకన్న, వైస్ ప్రెసిడెంట్ దామస్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆర్టీసీ ఉద్యోగుల సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు వారు హాజరై మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి ట్రేడ్ యూనియన్ పునరుద్ధరిం చాలని కోరారు. డ్రైవర్ కండక్టర్ గ్యారేజీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2013 ఆర్పీఎస్ బాండ్ బకాయిలను మిగతా కార్మికులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ అమలు చేయాలన్నారు.బ్రెడ్ విన్నర్ స్కీంలో ఉద్యోగాలను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. వివిధ కేసుల్లో అన్యాయంగా



రిమూవ్, సస్పెండ్ అయిన కార్మికులందరికీ వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.రిటైర్ అయిన ఉద్యోగులందరికీ అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, అన్ని రకాల ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని కోరారు. ఎంటీడబ్ల్యూ యాక్టుకు లోబడి డ్యూటీ చార్టులను సవరించాలన్నారు. బ్రీత్ అనలైజర్ టెస్టుల్లో పాజిటివ్ వచ్చిన ఉద్యోగులను మరసటి రోజు డ్యూటీకి పంపించాలని అన్నారు. ఈ నిరాహార దీక్షలో జేఏసీ నాయకులు మౌలానా, యాదయ్య, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు

నిల్వ ఉండాలంటే...

సాధారణంగా వంటింట్లో వివిధ రకాల పదార్థాలను స్టోర్ చేస్తాం. ఉల్లిగడ్డల నుంచి పప్పు ధాన్యాల వరకు అన్నీ కిచెన్‌లో ఉంటాయి. అయితే సరిగా నిల్వ చేయకపోతే వీటికి పురుగు పట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా పప్పు ధాన్యాలకు ఈ రిస్క్ ఎక్కువ. చాలా మంది దోశ, ఇడ్లీ, వడ వంటి టిఫిన్లు చేసుకోవడానికి మినప్పప్పు తెచ్చి కిచెన్‌లో స్టోర్ చేస్తుంటారు. దీన్ని డబ్బాల్లో ఎక్కువ కాలం ఉంచితే చిన్న పురుగులు, తవిటిపురుగు చేరే అవకాశం ఉంది. శనగలకు కూడా వీటి బెడద ఎక్కువే. వీటికి పురుగులు పట్టకుండా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.



ఎండబెట్టడం

శనగపప్పు, మినప్పప్పులో తేమ ఎక్కువ. దాంతో త్వరగా పురుగులు పట్టే అవకాశం ఉంది. అందుకే వీటిని కొన్న తర్వాత శుభ్రంగా కడిగి కనీసం 2-3 రోజులు బాగా ఎండబెట్టాలి. దీంతో వాటిలోని తేమ పూర్తిగా ఆవిరైపోతుంది. మినప్పప్పును లైట్‌గా ఫ్రై చేయడం మంచిది. దీంతో పప్పుకు పురుగులు పట్టవు. వీటిని ఒక గాజు సీసా లేదా ఎయిర్‌టైట్ కంటైనర్‌లో స్టోర్ చేయాలి. ఆ కంటైనర్ లేదా పాత్రను చల్లని, పొడి ప్రదేశంలో ఉంచాలి.

బిర్యానీ ఆకులు

శనగ పప్పు, మినప్పప్పుకు పురుగులు పట్టకుండా ఉండాలంటే, స్టోరేజీ కంటైనర్‌లో బిర్యానీ ఆకులు వేయాలి. ఈ ఆకుల వాసన పురుగులను వికర్షిస్తుంది. పప్పు తేమను నిలుపుకునేలా చేస్తూనూ ఓ మంచి ఫ్లేవర్ కూడా ఇస్తుంది.

టీచర్ నుంచి సీఎం వరకు



అతిశి మార్లీనా సింగ్...
ఓ టీచర్‌గా, సామాజిక కార్యకర్తగా, మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయినప్పటి నుంచి ఆమ్ ఆద్మీ పార్టీలో కీలకంగా మారారు. ఢిల్లీ ప్రభుత్వంలో విద్యా, పీడబ్ల్యూడీ, కల్చర్, ఫైనాన్స్, టూరిజం శాఖలు నిర్వర్తించారు. ఆప్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యులుగానూ ఉన్నారు. తర్వాత విద్యాశాఖ మంత్రిగానూ బాధ్యతలు చూశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఢిల్లీలో ఆ పదవి చేపట్టిన మూడో మహిళగా నిలిచిన ఆమె రాజకీయ ప్రస్థానం నేటి మానవిలో...

అతిశి మార్లీనా సింగ్ 1981 జూన్ 8న పుట్టారు. ఈమె తల్లిదండ్రులు విజయ్ సింగ్, త్రిప్తా వాహి ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు. అభ్యుదయ భావాలు కలిగిన వీరు మార్క్స్, లెనిన్ కలయికతో (Marx+Lenin-Marlena) కూతురికి అతిశి మార్లీనా సింగ్ అని పేరు పెట్టారు. అయితే రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఇంటిపేరును వాడడం మానుకున్నారు. పంజాబీ మూలాలు ఉన్న తోమర్ రాజ పుత్రుల వంశానికి చెందిన అతిశి... తనను తన వంశం కంటే పనితోనే అందరూ గుర్తు పెట్టుకోవాలని కోరుకున్నారు. అందుకే తన ఇంటి పేరుతో కంటే అతిశిగానే అందరి మధ్యలో ఉండాలని నిర్ణయించుకొని ఇంటి పేరును తొలగించుకున్నారు.

విద్యాభ్యాసం

విద్యా వంతులైన తల్లిదండ్రుల స్ఫూర్తితో అతిశి ఉన్నత విద్యను అభ్యసించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఢిల్లీలోని స్ప్రింగ్డేల్స్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. సేయింట్ స్టీఫెన్స్ కాలేజీ నుంచి 2021లో చరిత్రలో డిగ్రీ పట్టా అందుకున్నారు. తర్వాత చీవ్‌నింగ్ స్కాలర్‌షిప్‌తో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో 2003లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా చరిత్రలోనే చేశారు. తర్వాత 2005లో ఆక్స్‌ఫర్డ్‌లోని మాగ్‌డాలెన్ కాలేజీలో రోడ్స్ స్కాలర్‌గా ఉండి 'ఎడ్యుకేషనల్ రీసెర్చ్' విభాగంలో రెండోసారి మాస్టర్స్ పట్టా అందుకున్నారు.

రైతుగానూ...

చదువు పూర్తి చేసిన తర్వాత కొంతకాలం ఆంధ్రప్రదేశ్‌లోని రిశి వ్యాలీ స్కూల్‌లో చరిత్ర, ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేశారు. అయితే దీని వల్ల కేవలం తనకు మాత్రమే ప్రయోజనం ఉంటుందనీ, నలుగురికి ఉపయోగపడేలా ఇంకేదో చేయాలని భావించారు. భర్త ప్రవీణ్ సింగ్‌తో కలిసి మధ్యప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో కొంత కాలం సేంద్రియ వ్యవసాయం చేశారు. అలాగే అక్కడి చిన్నారులకు చదువు నేర్పించారు. విద్య పట్ల వారిలో ఆసక్తి పెంచేందుకు పలు విద్యా కార్యక్రమాల్ని చేపట్టారు. దీనికోసం అక్కడి స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశారు. ఈ సందర్భంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులతో ఆమెకు పరిచయం ఏర్పడింది. సమాజం కోసం ఆమె చేస్తున్న కృషిని గుర్తించి తమ పార్టీలోకి రావల్సిందిగా ఆహ్వానించారు.



రాజకీయాల్లోకి అరంగేట్రం

2013 జనవరిలో ఆమ్ ఆద్మీ పార్టీతో అతిశి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. తొలి నుండే పార్టీ బలోపేతం కోసం తీవ్రంగా కృషి చేశారు. పార్టీ ప్రాథమిక పాలసీలు రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత ఆప్ అధికార ప్రతినిధిగా కూడా పనిచేశారు. ఢిల్లీలోని కల్కాజీ ప్రాంతానికి ఆప్ ప్రతినిధిగా, ఆప్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యురాలిగా పని చేశారు. ఈస్ట్ ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గంలో పార్టీని ముందుండి నడిపించారు. 2015లో మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో జరిగిన చారిత్రాత్మక జల సత్యాగ్రహంలో కూడా పాల్గొన్నారు. ఆ తర్వాత జరిగిన నిరసనలు, న్యాయ పోరాటంలో మద్దతునిచ్చారు. 2015 జులై నుంచి 2018 ఏప్రిల్ వరకు ఢిల్లీ మాజీ విద్యాశాఖ మంత్రి మనీష్ సిసోడియాకు సలహాదారురాలిగా పని చేశారు. విద్యా వ్యవస్థను మెరుగుపరడానికి ఎంతగానో కృషిచేశారు. తనలోని విశేషమైన నైపుణ్యాలతో అతి తక్కువ కాలంలోనే గొప్ప నాయకురాలిగా ఎదిగారు.

విద్యాసంస్థల మెరుగుదలకు

2019 లోక్‌సభ ఎన్నికల్లో అతిశి తూర్పు ఢిల్లీకి ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. ఆ ఎన్నికల్లో పార్లమెంట్ స్థానం నుంచి బరిలోకి దిగారు. అయితే బీజేపీ అభ్యర్థి గౌతమ్ గంభీర్ చేతిలో ఓడిపోయారు. 2020లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కల్కాజీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిపై 11 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అలా పార్టీ వ్యవహారాల్లో పట్టు సాధించిన అతిశీ, గోవాలో ఆప్ ఛీఫ్‌గా వ్యవహరించారు. ఢిల్లీలోని విద్యాసంస్థలు అతిశి సారథ్యంలో గణనీయంగా మెరుగుపడ్డాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కొన్ని నివేదికల ప్రకారం ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, విద్యా హక్కు చట్టం ప్రకారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయడం, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచ కుండా నిబంధనలను పటిష్టం చేయడం, స్కూల్ కరికులంలో 'హ్యాపీనెస్' పాఠ్యాం శాలను రూపొందించడంలో ఆమె ముఖ్య మైన పాత్ర పోషించారు. విద్యార్థుల భావోద్వేగాలపై దృష్టిపెట్టి వారిలో పలురకాల స్కిల్స్‌ను పెంపొందించడంపై ప్రత్యేకంగా కృషి చేశారు.



ఏకైక మహిళా మంత్రిగా...

మంత్రిమండలి పునర్ వ్యవస్థీకరణలో భాగంగా 2023 మార్చి 9న ఆమె మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రిగా ఆర్థిక, ఎడ్యుకేషన్, పబ్లిక్ వర్క్స్, పవర్, రెవెన్యూ, లా, ప్లానింగ్, సర్వీసెస్, ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ, విజిలెన్స్ శాఖలను నడిపించారు. మద్యం కుంభకోణంలో పార్టీ కీలక నేతలందరూ జైలుకు వెళ్లడంతో అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రభుత్వ పరమైన నిర్ణయాల్లోనూ తనదైన పాత్ర పోషించారు. ప్రజల మన్ననలను పొందారు. పార్టీ ప్రతిష్టను నిలబెట్టే బాధ్యతను తన భుజాలపై వేసుకున్నారు. తన వాగ్దాటితో ప్రతిపక్షాలను ముప్పతిప్పలు పెట్టారు. అందుకే అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాతో ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిశి పేరును ఏకగ్రీవంగా ఆప్ పార్టీ ఖరారు చేసింది. షీలా దీక్షిత్, సుష్మా స్వరాజ్ తర్వాత ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 43 ఏండ్ల అతిశి అతి పిన్న సీఎంగానూ గుర్తింపు తెచ్చుకున్నారు.

ప్రజాస్వామ్యానికే ప్రమాదం : కమల్



చెన్నై:జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. "జమిలీ ఎన్నికల ప్రతిపాదన ప్రమాదకరం, లోపభూయిష్టమైనది. భారత్ కు ఆ తరహా ఎన్నికలు అవసరం లేదు. భవిష్యత్తులోనూ వాటి అవసరం లేదు. 2014 లేక 2015 సమయంలో ఈ తరహాలో ఎన్నికలు జరిగి ఉంటే..ఒక పార్టీకే పూర్తి అధికారం దక్కేది. అది నియంతృత్వానికి దారితీసేది. వాక్ స్వాతంత్ర్యం కోల్పోయేవాళ్లం. ఒక్క నాయకుడే ఆధిపత్యం చెలాయించేవాడు. దాని నుంచి మనం తప్పించుకున్నామని అర్థం చేసుకోవాలి. ఆ పరిస్థితి కరోనా కంటే ప్రమాదకరమైంది" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏ నేత పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా ఈ మాటలన్నారు. అలాగే ఆ ఎన్నికల తాలూకు ప్రభావం కొన్నిదేశాల్లో ఉందని చెప్పారు. పలు ప్రతిపక్ష పార్టీలు కూడా జమిలీ ఎన్నికల ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం వాటి నిర్వహణ సాధ్యం కాదని, రాజ్యాంగానికి ఐదు సవరణలు అవసరమని పేర్కొన్నాయి. అయితే అందుకు అవసరమైన సంఖ్యా బలం ప్రభుత్వానికి లేదన్నాయి. ఏకకాల ఎన్నికల ప్రతిపాదన ప్రజా స్వామ్య వ్యతిరేక మరో జిమ్మిక్కని రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ అభివర్ణించింది.

డీఏవో ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో) గ్రేడ్-2 పోస్టుల భర్తీకి సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలు స్వీకరించామనీ, నిపుణుల కమిటీ సిఫారసుల ఆధారంగా తుది కీని ప్రకటించామని పేర్కొన్నారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల చేశామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. 53 డీఏవో పోస్టుల భర్తీకి 2022, ఆగస్టు నాలుగో తేదీన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

ఆహార ధరల్లో పెరుగుదల ప్రమాదం

ప్రపంచ దేశాల్లో మందగమనం:ఆర్‌బీఐ బులిటెన్



న్యూఢిల్లీ : ఆహార ధరల్లో ఆకస్మిక పెరుగుదల ప్రమాదకరమని రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బీఐ) సెప్టెంబర్ బులిటెన్‌లో తెలిపింది. వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) 4 శాతం దిగువన ఉన్నప్పటికీ.. ఆహార ధరల్లో అస్థిరత ఇబ్బందులను కలిగిస్తుందని పేర్కొంది. స్టేట్ ఆఫ్ ది ఎకానమీ శీర్షికతో ప్రచురించిన కథనం వివరాలు.. 'వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ వరుసగా రెండవ నెల ఆగస్టులోనూ 4 శాతం దిగువన చోటు చేసుకుంది. అయితే ఇటీవలి అనుభవాల దృష్ట్యా ఆహార ధరల అస్థిరత అనేది ఆకస్మిక ప్రమాదంగా మారింది." అని పేర్కొంది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర, ఇతర సెంట్రల్ బ్యాంక్ అధికారులు ఈ రిపోర్ట్‌ను రాశారు.

ఆగస్ట్ ద్రవ్యోల్బణం 5బేసిస్ పాయింట్లు పెరిగినప్పటికీ ఇది స్వల్పమే.. దాదాపు ఇంతక్రితం నెల స్థాయిలోనే ఉందన్నారు. ఈ ఏడాది ఆగస్టులో సీపీఐ 3.7 శాతంగా ఉంది. ఇంతక్రితం జులైలో 3.6 శాతంగా చోటు చేసుకుంది. సీపీఐని 4 శాతం దిగువన కట్టడి చేయాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఆగస్టులో వినియోగదారుల ఇంధన ద్రవ్యోల్బణం సూచీలో 34 బేసిస్ పాయింట్లు, అహార, ఇంధనయేతర ద్రవ్యోల్బణంలో 27 బేసిస్ పాయింట్ల పెరుగుదల చోటు చేసుకుంది. కాగా అహార ద్రవ్యోల్బణం సూచీ 5.3 శాతానికి పెరిగింది. జులైలో 5.1 శాతంగా నమోదయ్యిందని ఆర్‌బీఐ కథనం పేర్కొంది.

అధికారులకు సవాల్...

ద్రవ్యోల్బణం తగ్గుతున్నప్పటికీ.. ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయని ఆర్‌బీఐ బులిటెన్ పేర్కొంది. ఇది ద్రవ్య విధాన అధికారులకు సవాల్‌గా నిలుస్తుంది. కాగా భారత్‌లో ప్రయి వేటు విని యోగం, స్థూల స్థిర పెట్టుబడులు బలంగా ఉన్నాయి. 2024- 25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో నికర ఎగుమతులు భారత జీడీపీకి మద్దతు నిచ్చాయి. కాగా.. ఆ త్రైమాసి కంలో జీడీపీ 6.7 శాతానికి పరిమితమై ఐదు త్రైమాసి కాల కనిష్టానికి పడి పోయింది. దీనికి వ్యవసాయం, ప్రభుత్వ వ్యయం, సేవలలో వృద్ధి మందగించడమే ప్రధాన కారణం. "ఇప్పటికే గ్రామీణ డిమాండ్ పునరుద్ధరణతో ప్రధాన ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. 2024 జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో గృహ వినియోగం పెరగడానికి సిద్ధంగా ఉంది. ఎఫ్ఎంసీజీ రంగం డిమాండ్‌లోనూ పెరుగుదల చోటు చేసుకుంటుంది. పండుగ సీజన్‌కు ముందు ఈ-కామర్స్ సంస్థలు భారీగా చేపడుతున్న నియామకాలతో మెట్రో నగరాల్లోనే కాకుండా.. ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాల్లోనూ వినియోగం పెరగనుంది." అని ఆర్‌బీఐ బులిటెన్ పేర్కొంది.

లోపభూయిష్టం

- 'జమిలీ' నివేదికలో కొన్ని ప్రతిపాదనలు తప్పు
- పంచాయతీ ఎన్నికలను మినహాయిస్తాయి: ఎస్వై ఖురేషీ

న్యూఢిల్లీ : 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' నివేదికలోని కొన్ని ప్రతిపాదనలు తప్పని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్వై ఖురేషీ ఆరోపించారు. జమిలీ ఎన్నికలకు మార్గం సుగమం చేస్తూ కేంద్ర క్యాబినేట్ ఉన్నత స్థాయి కమిటీ నివేదికను ఇప్పటికే ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో దీనికి సంబంధించిన బిల్లును వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదింపచేయొచ్చనే వార్తలు వచ్చాయి. జమిలీ ఎన్నికలపై ఇప్పటికే రాజకీయంగా పలు పార్టీలు భిన్నాభిప్రాయాలతో ఉన్నాయి. జమిలీ ఎన్నికలపై బీజేపీ ఎప్పటి నుంచో పట్టుబడుతున్నది. అయితే, సీపీఐ(ఎం), కాంగ్రెస్, సీపీఐ వంటి ప్రధాన పార్టీలు మాత్రం జిమిలీ ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయి. ఒకేసారి ఎన్నికల నిర్వహణ అనేది సమాఖ్య విధానానికి విరుద్ధమని అంటున్నాయి. దేశంలో ఒకేసారి ఎన్నికల నిర్వహించే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు భారత మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలో ఒక కమిటీని కేంద్రం గతేడాది సెప్టెంబర్‌లో ఏర్పాటు చేసిన విషయం విదితమే. మార్చిలో సమర్పించిన నివేదిక ప్రణాళికను అమలు చేయటానికి రెండు దశల విధానాన్ని సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో ఖురేషీ వ్యాఖ్యలు సైతం ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నివేదికలోని పలు ప్రతిపాదనలు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆయన అన్నారు. జమిలీ ఎన్నికలు పంచాయతీ ఎన్నికలను మినహాయిస్తాయని చెప్పారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగిన వంద రోజులలోపు పంచాయతీ ఎన్నికలు వేర్వేరుగా జరగటం ఏకకాల ఎన్నికల సారాంశానికి విరుద్ధంగా ఉన్నదని ఖురేషీ వివరించారు.

కేవలం నెలల వ్యవధిలో వేర్వేరుగా ఎన్నికలను నిర్వహించటంతో గణనీయమైన రవాణా సవాళ్లు ఏర్పడతాయనీ, ఓటరు అలసటకు కారణమవుతుందని అన్నారు. ఏకకాల ఎన్నికల కోసం అదనంగా దాదాపు 40 లక్షల ఈవీఎంలు అవసరం పడతాయనీ, ఆర్థిక భారం, లాజిస్టిక్ సమస్యలు గణనీయంగా ఉంటాయన్నారు. "మూడంచెల ఎన్నికల్లో ఓటరు, పోలింగ్ బూత్, ఎన్నికలు నిర్వహించేవారు ఒకరే కావటమనేది జమిలీ ఎన్నికలకు అనుకూలంగా ఉన్న అంశం. ఎన్నికల కమిషన్ లాజిస్టికల్ సమస్యను ఎత్తి చూపింది. తమకు అదనంగా మూడు రెట్ల స్థాయిలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు కావాలని ఈసీ అంటున్నది. కాబట్టి, వేల కోట్ల రూపాయల అవసరం ఉంటుంది" అని ఖురేషీ తెలిపారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సవాళ్ల గురించి చర్చించాలని భారత చట్టసభల సభ్యులను ఆయన కోరారు. 2010 జులై నుంచి 2012 జూన్ మధ్య ఖురేషీ భారత సీఈసీగా పని చేశారు.

ఇరువురి ప్రాధాన్యతలు ఒక్కటే

(మొదటిపేజీ తరువాయి)

చర్చల కోసం ప్రపంచబ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలో వరల్డ్ బ్యాంక్ కంట్రీ ఆపరేషన్ హెడ్ పాల్ ప్రోసీ, అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రాజెక్ట్ లీడ్ నటాలియా కే, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమాపత్ రే శనివారం హైదరాబాద్ వచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా, వైద్యం, సాగు నీటి రంగాలు తమ ప్రభుత్వ ప్రాధాన్యతలుగా ఉన్నాయని సీఎం వారికి వివరించారు. అయా రంగాల్లో తాము తీసుకుంటున్న చర్యలను ఆయన విశదీకరించారు. తాము ప్రాధాన్యతగా తీసుకున్న ప్రాజెక్టులకు ఆర్థిక సహకారాన్ని అందించటంతోపాటు అత్యుత్తమ ప్రమాణాలతో అవి నిలిచే విధంగా సహకరిం చాలని కోరారు. విద్యా వైద్య రంగాల్లో ముఖ్య మంత్రి దార్శనికత బాగుందనీ, భవిష్యత్ అవసరా లకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకుంటు న్నారని మార్టిన్ రైజర్ ఈ సందర్భంగా ప్రశం సించారు. ప్రపంచ బ్యాంకు ఏయే రంగాలను ప్రాధాన్యతా అంశాలుగా ఎంచుకుందో, అవే తెలంగాణ ప్రభుత్వానికి కూడా ప్రాధాన్యతాం శాలుగా ఉన్నాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కార్యదర్శులు సంగీత సత్యనారాయణ, మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకష్ణారావు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జోంగ్తూ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అతిశి అనే నేను...

ఢిల్లీ సీఎంగా ప్రమాణం • ఆమెతో పాటు మంత్రులుగా ఐదుగురు బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా అతిశి మార్లేనా సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం రాజ్ భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ఆమెతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జి) వికె సక్సేనా ప్రమాణం చేయించారు. దీంతో ఆమె దేశ రాజధాని ఢిల్లీకి ఎనిమిదో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అతిశితో పాటు మరో ఐదుగురు మంత్రు లుగా ప్రమాణం చేశారు. ఇందులో సుల్తాన్ పూర్ మిర్జా నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముకేశ్ అహ్లావత్‌కు కొత్త క్యాబినెట్‌లో చోటు దక్కింది. అలాగే సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాట్‌లు మంత్రులుగా తమ స్థానాలను నిలుపుకోగా, ఇమ్రాన్ హుస్సేన్ మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆప్ ముఖ్య నేతలు హాజరయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై దాదాపు ఐదు నెలలుగా తీహార్ జైల్‌లో ఉన్న మాజీ సీఎం కేజ్రీవాల్ ఈ నెల 15న మరో రెండు రోజుల్లో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అన్నట్టుగానే గత మంగళవారం సీఎం పదవికి రాజీనామా చేసి, ఎల్‌జి వికె సక్సేనాకు రాజీనామా పత్రాన్ని అందించారు. అంతకు ముందే జరిగిన ఆప్ శాసన సభాపక్ష సమావేశంలో అతిశిని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. ఆమె కూడా కేజ్రీవాల్‌తో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన పత్రాన్ని ఎల్‌జికి సమర్పించారు. దీంతో శనివారం ముఖ్యమంత్రిగా అతిశి, మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాట్, ముకేశ్ అహ్లావత్, ఇమ్రాన్ హుస్సేన్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తూ ఎల్‌జి ఆప్‌కు సమాచారం అందించారు. అందులో భాగంగానే శనివారం సీఎంగా అతిశి, మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, కేజ్రీవాల్ జైల్‌లో ఉన్న సమయంలో అతిశి కీలకంగా వ్యవహరించారు. అలాగే కేజ్రీవాల్ మంత్రివర్గంలో ఆర్థిక, విద్య, రెవెన్యూ వంటి మొత్తం 14 మంత్రిత్వ శాఖలను అతిశి నిర్వహించారు.

బీజేపీ, ఎల్‌జీ కుట్రలతో ఆగిన పనులు పూర్తి

తొలిసారి మీడియా సమావేశంలో

ఢిల్లీ సీఎం అతిశి మార్లెనా

మంత్రులకు శాఖల కేటాయింపు

సీఎం వద్ద 13 కీలక శాఖలు

బీజేపీ, ఎల్‌జీ కుట్రలతో ఆగిపోయిన పనులను పూర్తి చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల డిమాండ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయడమే తన పని అని ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి అతిశి మార్లెనా అన్నారు. శనివారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఆమె తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. బీజేపీ, వారి లెఫ్టినెంట్ గవర్నర్ కుట్రల వల్ల ఆగిపోయిన పనులను ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల వరకు పూర్తి చేయడమే తన పనని తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్ ఇప్పుడు జైలు నుంచి బయటకు వచ్చారని, ఆయన మార్గదర్శకత్వంలో ఢిల్లీ ప్రజల పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నిం టినీ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తానని అన్నారు.అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజల జీవితాలను మార్చారని తెలిపారు. అయితే ఇది బీజేపీకి నచ్చక కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టిందని విమర్శించారు. కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చాక మళ్లీ ముఖ్యమంత్రి పదవిని చేపట్టే బదులు ప్రజాకోర్టుకు వెళ్లడమే మంచిదని భావించారని అతిశి అన్నారు. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనుండగా, ప్రజలందరూ భారీ మెజారిటీతో కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని, ఆయనపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారని విమర్శించారు. ఆరు నెలలకుపైగా జైల్లో ఉంచారని, వాటిని ఛేదించే ప్రయత్నం కేజ్రీవాల్ చేశారని అన్నారు. బెయిల్ దొరకడం కష్టంగా ఉన్న కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దురుద్దేశంతోనే జరిగిందని బీజేపీకి సుప్రీంకోర్టు సందేశం ఇచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు తమ యజమాని మాటను మాత్రమే వింటాయని, పంజరంలో బంధించిన చిలుకలాంటివని కోర్టు పేర్కొందని గుర్తు చేశారు. మరే ఇతర నాయకుడైనా ఉంటే వెంటనే సీఎం కుర్చీలో కూర్చునే వాడని, కానీ అరవింద్ కేజ్రీవాల్ మాత్రం నిజాయతీకి, నీతికి దేశ రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. తనకు కోర్టు తీర్పు సరిపోదని, ప్రజాకోర్టు తీర్పు వచ్చే వరకు తాను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోనని అన్నారని తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ఢిల్లీలోని రెండు కోట్ల మంది ప్రజలు అరవింద్ కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. లేనిపక్షంలో బీజేపీ ప్రజలకు ఉచిత విద్యుత్, ఉచిత వైద్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని నిలిపివేస్తుందని పేర్కొన్నారు.

సీఎం అతిశి వద్ద 13 శాఖలు

ముఖ్యమంత్రి అతిశి మంత్రులకు శాఖలు కేటాయించారు. అతిశి గతంలో నిర్వహించిన శాఖలనే మళ్లీ నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఆమె వద్ద 13 కీలక శాఖలున్నాయి. విద్య ఆర్థికం, ప్రణాళిక, పిడబ్ల్యూడి, వాటర్, పవర్, పౌర సంబంధాలు, విజిలెన్స్, న్యాయ, రెవెన్యూ వంటి శాఖలను నిర్వహిస్తారు. మంత్రి సౌరభ్ భరద్వాజ్ అర్బన్ డెవలప్‌మెంట్, నీటి పారుదల, ఆరోగ్యం, పరిశ్రమలు, పర్యాటకం, సామాజిక సంక్షేమం వంటి ఎనిమిది శాఖలు నిర్వహిస్తారు. మంత్రి గోపాల్ రాయ్ డెవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, పర్యావరణ, అటవీ వంటి మూడు శాఖలు నిర్వహిస్తారు. మంత్రి కైలాశ్ గెహ్లాట్ ట్రాన్స్‌పోర్టు, మహిళా, శిశు సంక్షేమం వంటి ఐదు శాఖలను నిర్వహిస్తారు. మంత్రి ముకేశ్ అహ్లావత్ గురుద్వారా ఎన్నికలు, ఎస్సీ, ఎస్టీ, కార్మిక, ఉపాధి, భవనాలు, భూములు వంటి ఐదు శాఖలను నిర్వహిస్తారు. మంత్రి ఇమ్రాన్ హుస్సేన్ ఆహారం, పంపిణీ, ఎన్నికల వంటి రెండు శాఖలను నిర్వహిస్తారు

ఉద్యమాల సూరీడు మళ్లీ ఉదయిస్తాడు

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి కే తారక రామారావుసహా పలువురు వామపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఏచూరి చిత్ర పటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. సంతాప సూచకంగా ఒక నిమిషం మౌనం పాటించారు. 'జోహార్ కామ్రేడ్ సీతారాం ఏచూరి, రెడ్ సెల్యూట్ సీతారాం ఏచూరి, సాధిస్తాం మీ ఆశయాలను'అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా 'కామ్రేడ్ సీతారాం ఏచూరి భారతదేశపు ఆంటోనియో గ్రాంసీ'అనే సంకలనాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కలిగిస్తూ సమయం వచ్చినపుడు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ విధానాలను కూడా విభేదించిన వ్యక్తి ఏచూరి అని అన్నారు. పేదలు, ప్రజాస్వామిక వాదులకు ప్రభుత్వ విధానాలు ఉపయోగపడాలని నిరంతరం పాటుపడిన వ్యక్తి అని చెప్పారు. ఆయన మరణం దేశానికే తీరనిలోటని చెప్పారు. ఎస్ఎఫ్ఐ నుంచి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా దశాబ్దాలపాటు ఆయన ప్రజల కోసమే పనిచేశారని వివరించారు. అనేక వేదికలపై భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప నేత అని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడేవారు కొద్ది మందే ఉంటారనీ, అలాంటి వారిలో ఏచూరి ఒకరని చెప్పారు. దేశానికి, ప్రజలకు అంకితమని చాలా మంది చెప్తారనీ, కానీ ఆచరించే వారు ఏచూరిలా అరుదుగా ఉంటారని వివరించారు. బతికున్నంత కాలం ప్రజల కోసమే పనిచేశారనీ, మరణానంతరం కూడా అదే స్ఫూర్తిని కొనసాగించారని అన్నారు. విలువలు, సిద్ధాంతాలు అంతరించిపోతున్న సందర్భంలో బీజేపీ మతోన్మాద ఆలోచనలతో జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబళించాలని చూస్తున్నదని విమర్శించారు. ఈ సమయంలో ఏచూరి లేకపోవడం తీరనిలోటని చెప్పారు. అధికారాన్ని నిలబెట్టు



కోవడానికి రాజ్యాంగ సవరణలు చేసేందుకు బీజేపీ యత్నిస్తున్నదని అన్నారు. రాష్ట్రాల సమ్మిళితమే దేశమనీ, ఆ స్ఫూర్తిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని విమర్శించారు. జమిలి ఎన్నికల ముసుగులో బీజేపీ ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కేరళలో కాంగ్రెస్ వర్సెస్ కమ్యూనిస్టులని చెప్పారు. అయినా దేశంలో బీజేపీ ప్రమాదాన్ని ఎదిరించడానికి కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పనిచేసే విధంగా ఏచూరి కృషి చేశారని వివరించారు. ఆయన ఆలోచనలు భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమన్నారు.ఆయన మృతి కేవలం కమ్యూనిస్టులు, వామపక్ష శక్తులకే మాత్రమే కాదు, భారత రాజకీయాలకే తీరనిలోటని చెప్పారు. అందుకే ఆయనకు దేశమంతా నీరాజనం పలికిందన్నారు. ఆయన మృతికి మీడియా ఒక ప్రధాని స్థాయి నేతకు మించిన ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. రాహుల్ గాంధీ పై ఓ కేంద్ర మంత్రి వీధిరౌడీలా వ్యాఖ్యానించినా ప్రధాని మోడీ ఖండించడం లేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానానికి ఇది ఉదాహరణ అన్నారు. మోడీ క్యాబినెట్‌లో ఇలాంటి మంత్రి ఉండడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి మంచిది కాదన్నారు. జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.భాషలు, ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి అధికారం కాపాడుకోవాలనుకునే బీజేపీ కుట్రలను నిలువరించాల్సిన అవసరముందని రేవంత్‌రెడ్డి అన్నారు.

గొప్ప స్నేహశీలి : కోదండరామ్

ఈ సందర్భంగా టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాజ్యాంగ విలువలకు పాతరేయబడుతున్న నేటి పరిస్థితుల్లో సీతారం ఏచూరి లేకపోవటం వెలితిగా ఉందని చెప్పారు. దేశ రాజకీయాల్లో ఆయన పాత్ర కీలకమైందని గుర్తు చేశారు. విద్యార్థి దశనుంచే ఉద్యమాల బాటపట్టారనీ, ఎమర్జన్సీ అనంతర పరిణామాలపై నిర్వహించిన విద్యార్థి పోరాటాల్లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ జేఎన్‌యూ వైస్‌చాన్సలర్‌గా రాజీనామా చేయాలని డిమాండ్ చేయటం చిన్న విషయం కాద న్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు వెయి టేజ్ మార్కుల కోసం ఉద్యమాలు నిర్వహించి విజయం సాధిం చారని గుర్తు చేశారు. జేఎన్‌యూలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో వరసగా మూడుసార్లు ఎన్నికయ్యారని తెలిపారు. వైవిధ్యం కలిగిన దేశంలో భారతీయ పౌరులుగా కలిసుందాం అంటూ పార్లమెంట్‌లో ఆయన చేసిన ఉపన్యాసం దేశానికి గొప్ప సందేశమనీ, అన్నింటికంటే గొప్ప స్నేహశీలి అని చెప్పారు.

నిబద్ధతతో నిలబడ్డ నాయకుడు : పోటు రంగారావు

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పి రంగారావు మాట్లాడుతూ పదవులకోసం పార్టీలు మారుతున్న సమయంలో, చొక్కాలు మార్చినట్టు జెండాలు మారుస్తున్న స్థితిలో విలువలు మటుమాయ మవుతున్న కాలంలో తాను నమ్మిన సిద్ధాంత కోసం నిబద్ధతతో నిలబడ్డ నాయకుడు సీతారాం ఏచూరి అని చెప్పారు. వేయి పడగల విషనాగులా మతోన్మాదం బుసకొడుతున్న సమయంలో లౌకిక, ప్రజాస్వామిక శక్తుల ఐక్యత అత్యంత అవసమన్నారు. భారత రాజ్యాంగ హామీల అమలు కోసం పోరాడాల్సిన సమయమిదని గుర్తు చేశారు. మోడీ, అమిత్‌షాల పరివారం విద్వేషపు మంటల్ని రాజేస్తున్న సమయంలో ఏచూరి లాంటి నేతలు భౌతికంగా లేకపోవటం విచారకరమని చెప్పారు.



వామపక్షాల ఐక్యత అవసరం : వెంకట్రామయ్య

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రా మయ్య మాట్లాడుతూ శ్రామిక వర్గ సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు నిలబడ్డ గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని చెప్పారు. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన లేని లోటు కనిపిస్తున్నదన్నారు. ఇలాంటి సమయంలో వామపక్షాల ఐక్యత మరింత అవసరమన్నారు. వామపక్ష శక్తుల ఐక్యకార్యాచరణ కొనసాగించాలన్నారు.

ఆర్థిక, సామాజిక పోరాటాలను జమిలిగా జరపాలి : వనం సుధాకర్

ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక పోరాటాలను జమిలిగా నిర్వహించాల్సిన అవసరాన్ని ఏచూరి చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ..ఆ అవసరం ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మరింత పెరిగిందని చెప్పారు.

బీజేపీ విధానాలను ఎండగట్టడంలో ఏచూరి కృషి మరువలేం: జానకిరాములు

ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో దాని విధానాలను చట్ట సభల్లోనూ, బయటా ఎండగట్టటంలో ఆయన కృషి మరవలేనిదన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను వెనక్కి కొట్టటంలో ఏచూరి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

జీవితమంతా ప్రజలకే అంకితం : ప్రసాదన్న

సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న మాట్లాడుతూ సీతారం ఏచూరి జీవితమంతా ప్రజలకే అంకితం చేశారన్నారు. పేదరికం ఉన్నంత వరకు పోరాటాలుంటాయన్నారు. మార్క్సిజం అజేయమని చెప్పారు.


సంస్మరణ సభకు హాజరైన ప్రజలు

ప్రపంచజ్ఞాని ఏచూరి : రమేష్ రాజా

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి రమేష్ రాజా మాట్లాడుతూ ప్రపంచజ్ఞాని ఏచూరి అని చెప్పారు. అంతర్జాతీయ రాజకీయాలను అలవోకగా శాస్త్రీయంగా విశ్లేషించటం ఆయనకే సాధ్యమన్నారు. అరుదైన వ్యక్తిత్వమని కొనియాడారు. ప్రపంచమే గర్వంచదగ్గ తెలుగు బిడ్డని చెప్పారు.

ఆశయాలను ముందుకు తీసుకుపోవాలి : మురహరి

ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురహరి మాట్లాడుతూ మతోన్మాదం, ఫాసిజం దేశాన్ని ఆవరిస్తున్నదని చెప్పారు. అత్యంత ప్రమాదకర పరిస్థితిలో దేశం ఉన్నదన్నారు. ఇలాంటి సమయంలో సీతారాం లేకపోవటం బాధగా ఉందన్నారు. ఆయనకు నివాళులర్పించటమంటే. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవటమేనని చెప్పారు.

గొప్ప పార్లమెంటేరియన్ : తేజ్‌దీప్‌రెడ్డి

పార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి తేజ్‌దీప్‌రెడ్డి మాట్లాడుతూ యువతరానికి స్ఫూర్తినిచ్చిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి అని చెప్పారు. గొప్ప పార్లమెంటేరియన్‌గా ఆయన గురించి చెప్పుకుంటారని గుర్తు చేశారు. ప్రజాసమస్యలను చట్టసభల్లో లేవనెత్తటంలో ఆయనకు ఆయనే సాటని చెప్పారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, టి జ్యోతి, డిజి నరసింహారావు, జాన్‌వెస్లీ, టి సాగర్, ఎండీ అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి ప్రభాకర్ పూలమాలలేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న బి.వి. రాఘవులు

కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభలో నేతల భావోద్వేగం

విభేదాలున్నా విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చారు : రాఘవులు

(మొదటిపేజీ తరువాయి)

చుట్టే తిరుగుతాయని వివరించారు. ఎన్ని తేడాలున్నా ఈ నాలుగు అంశాలపై కలిసి పనిచేయాలన్నారు. మతోన్మాద శక్తులు బలపడితే దేశం ముక్కలవుతుందని అన్నారు. దేశాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా విపక్షాలను ఏకం చేసిన నేత ఏచూరి అని వివరించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో ప్రమాదం ముంచుకొస్తోందనీ, దాన్ని తిప్పికొట్టాలని చెప్పారు. ఒకే మతం, ఒకే భాష (హిందీ), ఒకే రిజిస్ట్రేషన్, ఒకే యూనిఫామ్ (కాషాయం), ఒకే భోజనం, ఒకే పెండ్లి పద్ధతి వస్తాయేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలతో కూడిన వైవిధ్యభరితమైన దేశాన్ని ముక్కలు చేసే పద్ధతిలో పాలకులు వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు. దేశాన్ని కాపాడుకోవడమే అందరి కర్తవ్యమని ఆయన పిలుపునిచ్చారు. 1974 నుంచి ఏచూరితో కలిసి పనిచేశానని రాఘవులు చెప్పారు. కష్టం వచ్చినపుడు పారిపోవడం కాకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. ఎంత సంక్లిష్ట విషయమైనా సామాన్యులకు అర్థమయ్యేలా ఏచూరి వివరిస్తారని చెప్పారు. దేశం సమైక్యంగా ఉండాలని ఏచూరి పరితపించే వారని అన్నారు. భారతీయున్ని అని చెప్పడమే గర్వకారణమంటూ ఏచూరి పార్లమెంటులో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. మఖ్దూం మొహియుద్దీన్ రచనలంటే ఆయనకు ఎంతో ఇష్టమన్నారు. పేదల కోసం, సమానత్వం, సోషలిజం కోసం కృషి చేయాలని చెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజాన్ని కాపాడుకునేందుకు కలిసి పనిచేయాలనీ, దేశభక్తులుగా ముందుకెళ్దామని అన్నారు.

ఏచూరి బాటలో కొనసాగుదాం : మోహన్‌కందా

(మొదటిపేజీ తరువాయి)



బాధపడటం కాదు. 'మా ఇంట్లోనే పెరిగాడు. మా అమ్మను అమ్మమ్మ అన లేదు. అమ్మ అని పిలిచేవాడు. నన్ను మామ అని పిలిచేవాడు. ఎమర్జెన్సీ రోజులొచ్చాయి. పోలీసులు వాడి చుట్టూ తిరుగుతున్నారు. అప్పుడు మా అమ్మ, నాన్న వాడిని మార్చమని నా దగ్గర ఉంచారు. అప్పుడే నేను ప్రయత్నించి విఫలమయ్యాను. వీన్ని వెంటనే ఇక్కడి నుంచి తీసుకెళ్లకపోతే నేను కూడా కమ్యూనిస్టును అయిపోతా అన్నాను. అప్పుడు అక్కడినుంచి తీసుకెళ్లాల్సి వచ్చింది. అంత గొప్పవాడు. ఆయన మాటలు ఆకర్షణీయంగా ఉంటాయి. చిన్నతనంలో ఐదు రోజులు ఉపనయనం చేశారు. చేసిన ఐదు రోజుల్లోనే వాడు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఇప్పుడు దేశానికి మార్గం చూపి పోయాడు. ఆయన వెళ్లిపోయాడు అనే బాధ కంటే ఆయన ఆశయాలను కొనసాగించాలి'అని మోహన్‌కందా అన్నారు.

గొప్ప అభిమానిగా మారిపోయా : కూనంనేని



సీతారాం ఏచూరికి తాను తెలియకుండానే గొప్ప అభిమానిగా మారిపోయానంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు చెప్పారు. ఉదయరేఖలు ప్రసరింప జేస్తోనే ఆయన అస్తమించారని వ్యాఖ్యానించారు. ఆయన మరణం కమ్యూనిస్టులనే కాకుండా దేశ రాజకీయ రంగాన్ని కుదిపిందని తెలిపారు. జేఎన్‌యూకు మూడు సార్లు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. దేశంలో ఆయనకు ఏ పదవి లేదనీ, అయినా ప్రధాన మంత్రి స్థాయికి మించి నీరాజనం పట్టారని చెప్పారు. ఆయన కమ్యూనిస్టు కావడమే అందుకు కారణమన్నారు. ప్రజలు కమ్యూనిజాన్ని కోరుకుంటున్నారనే విషయం దీన్ని బట్టి అర్థమవుతున్నదని చెప్పారు. ఆయన ప్రతి పలుకు బంగారమేనన్నారు. ఆయన మాట్లాడే ఒక్కో పదంతో దేశ పరిస్థితులను సమ్మిళితం చేసే ఆర్ద్రత ఉంటుందన్నారు. దేశంలో ప్రతి కమ్యూనిస్టు పార్టీ తన సొంత నాయకుణ్ణి కోల్పోయినట్టు భావిస్తున్నదని చెప్పారు. దేశంలో ప్రశ్నించేవారిని ఎలా అణచివేస్తున్నారో అందరికీ తెలిసిందేనన్నారు.'ప్రశ్న సజీవంగా ఉండాలి. కమ్యునిజం సజీవంగా దేశానికి దిక్సూచిగా ఉండాలి. ఎర్ర జెండాలన్నీ ఒకటి కావాలి' అని ఆకాంక్షించారు. ఏచూరికి సీపీఐ తరుపున ఘన నివాళి అర్పిస్తున్నట్టు ప్రకటించారు.

కర్తవ్యాలకు పునరంకితమవుదాం : తమ్మినేని



సీతారాం ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. 72 ఏండ్ల వయస్సు లోనే సీతారాం ఏచూరి మరణించడం ఎంతో బాధాకరమని అన్నారు. దేశానికి ఎంతో ఉపయోగపడే మేధావి అని కొనియాడారు. మార్క్సిజం పట్ల ఎంతో అంకితభావం ఉన్న వ్యక్తి దూరం కావడం తీరనిలోటని చెప్పారు. ఆయన ఆశయాలకు పునరంకితం కావాలనీ, ఆ దిశగా ముందుకు సాగాలని కోరారు.

ఆదర్శనేత ఏచూరి : కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)



ఇవ్వగలిగే నివాళి అని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆఖరి వరకు కట్టుబడి పోరాడిన సీతారాం ఏచూరి జీవితం మా లాంటి కొత్త తరం నాయకులకు కూడా ఆదర్శమని చెప్పారు. కడదాకా కమ్యూనిస్టుగా బతికిన ఆదర్శ నేత సీతారాం ఏచూరి అని పేర్కొన్నారు. పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయాల్లో స్థిరంగా, సిద్ధాంతం కోసం నిలబడ్డ నాయకుడు ఏచూరి గుర్తు చేశారు. 'మేం ఓట్ల రాజకీయంలో వెనుకబడ్డ ప్రజల కోసం పోరాటంలో మాత్రం ముందున్నాం'అని ఏచూరి చెప్పిన మాటను గుర్తు చేశారు. పోరాటాల నుంచి వచ్చిన నాయకులకు ప్రజల కష్టం, నష్టం తెలుస్తుందంటారనీ, అలాంటి వారిలో ఏచూరి ఒక్కరేనని బలంగా నమ్ముతున్నానని చెప్పారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో జైలు జీవితం తర్వాత భారతదేశంలో ఆనాడు అత్యున్నత స్థానంలో ఉన్న ఇందిరా గాంధీ ముందు నిలబడి.. ఒక సామాన్య విద్యార్థి నాయకుడిగా, ఒక్క మాట కూడా తొణకకుండా మీరు రాజీనామా చేయండని మాట్లాడాలంటే ఎంత గుండె ధైర్యం కావాలో ఆలోచించాలని కోరారు.

రాజ్యాంగాన్ని రాజకీయం కోసం అపహాస్యం చేస్తున్న ఈ రోజుల్లో రాజ్యాంగాన్ని త్రికరణ శుద్ధితో నమ్మిన వ్యక్తి అనీ, ప్రశ్నించడమే ప్రజాస్వామ్యం అని గుండెల నిండా నమ్మిన వ్యక్తి అని కొనియాడారు. 'పదవులతోనే కీర్తి వస్తుందని అనుకునే వారు కొందరు ఉంటారు. కానీ పదవులు లేకున్నా ఐడియాలజీ, ప్రజా సమస్యల పట్ల అవగాహన, పని చేయాలన్న తపన, నిత్యం ప్రజా సంక్షేమం కోసం పని చేసే ఆలోచన, నిత్యం కొత్తది నేర్చుకోవాలనే అభిలాష. ప్రజల మనసుల్లో చిరస్థాయిగా చిరంజీవిగా నిలబడేలా చేస్తుందనడానికి ఏచూరి జీవితం ఒక ఉదాహరణ.' అన్నారు.


రాఘవులుతో సీఎం రేవంత్‌రెడ్డి


ముఖ్యమంత్రితో తమ్మినేని


తమ్మినేనితో కోదండరామ్, పోటు రంగారావు


రాఘవులుతో కేటీఆర్ కరచాలనం

రవీంద్ర భారతిలో జరిగిన ఏచూరి సంస్మరణ సభలో దృశ్యాలు


ఏచూరికి నివాళి అర్పిస్తున్న ఐద్వా నాయకులు జ్యోతి, మల్లు లక్ష్మి









Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఎల్ఐసీ ఎంఎఫ్ నుంచి మానుఫక్చరింగ్ ఫండ్

ముంబయి : ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఎల్ఐసి ఎంఎఫ్ మానుఫక్చరింగ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ కొత్త పండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ)ను అక్టోబర్ 4 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు తెరుస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 11న కేటాయింపులు చేయనున్నట్టు వెల్లడించింది. ఈ పథకాన్ని యోగేష్ పాటిల్, మహేష్ బెంద్రే నిర్వహించనున్నారు. ఈ ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడిగా నిర్ణయించినట్టు యోగేష్ పాటిల్ తెలిపారు.

భారత ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్లకు చేరొచ్చు

- ఐడీబీఐ కాపిటల్ అంచనా



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ 2032 నాటికి 10 ట్రిలియన్ డాలర్లకు చేరొచ్చని ఐడీబీఐ కాపిటల్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. దేశ జీడీపీ ప్రతి 18 నెలలకు ఒక ట్రిలియన్ డాలర్లు జోడించే అవకాశం ఉందన్నారు. దీంతో ఎనిమిదేండ్లలో 10 ట్రిలియన్లకు చేరొచ్చని పేర్కొంది. మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాలు భారత్‌ను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చనున్నాయని అంచనా వేసింది.

అమెరికాలో ఓయో విస్తరణ

న్యూఢిల్లీ : ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థ ఓయో తన అమెరికా కార్యకలాపాలను విస్తరించనుంది. ఇందుకోసం ప్రముఖ లాడ్జింగ్ ఫ్రాంఛైజీ, మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్లను నడుపుతున్న జి6 హాస్పిటాలిటీ సంస్థను కొనుగోలు చేయనుంది. బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచి 525 మిలియన్ డాలర్ల (రూ.4300 కోట్లు)కు కొనుగోలు చేయనున్నట్లు ఓయో మాతృసంస్థ ఓర్వల్ స్టేస్ పేర్కొంది. 2019లో అమెరికాలో అడుగుపెట్టిన ఓయో ప్రస్తుతం 320కి పైగా హోటళ్లను నిర్వహిస్తోంది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నుంచి మయూర క్రెడిట్ కార్డ్

హైదరాబాద్ : ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రీమియం మెటల్ కార్డ్ పోర్ట్‌ఫోలియోకి జోడింపుగా మయూర క్రెడిట్ కార్డ్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కార్డు తరచుగా ప్రయాణించేవారికి, వ్యాపార ప్రయాణీకులకు, అడ్వెంచర్ కోరుకునే వారికి తోడుగా నిలుస్తుందని ఆ బ్యాంక్ పేర్కొంది. దీనిపై అనేక ఆకర్షణీయ రివార్డులను అందిస్తున్నట్లు తెలిపింది.

మహేష్ బ్యాంక్‌కు రూ.70 కోట్ల లాభాలు



హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో పన్నుల చెల్లింపునకు ముందు రూ.69.51 కోట్ల లాభాలను సాధించినట్లు ఆంధ్రప్రదేశ్ మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ తెలిపింది. ఇంతక్రితం ఏడాది రూ.49.56 కోట్ల లాభాలు నమోదు చేసింది. శనివారం హైదరాబాద్‌లోని ఆ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో 48వ వార్షిక జనరల్ బాడీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆర్థిక ఫలితాలను ప్రకటించారు. ఆ వివరాలు..తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలో 45 శాఖలను కలిగి ఉంది. రూ.398.35 కోట్లుగా ఉన్న సొంత నిధులు..2023-24లో రూ.444.20 కోట్లకు పెరిగాయి. స్థూల ఎన్‌పిఎలు 7.99 శాతం నుంచి 6.04 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలను శూన్యంగా చూపించింది. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.3,300 కోట్ల వ్యాపారాన్ని చేరాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశంలో ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ వి అర్వింద్, ఛైర్మన్ రామ్‌దేవ్ భుటడ, బోర్డు సభ్యులు కిషన్ గోపాల్ మనియర్, ఎస్‌బి కబ్రా, ప్రవీణ్ కుమార్ బహెటి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాల కోసం రైతుల ధర్నా

- భారీ ప్రదర్శనగా ఎన్ఎస్పీ కార్యాలయానికి..
- ఎన్ఎస్పీ ఏఈకి వినతిపత్రం అందజేసిన రైతు సంఘం



నవతెలంగాణ-నేలకొండపల్లి

సాగర్ జలాలను తక్షణమే విడుదల చేసి, పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో రైతులు కదం తొక్కారు. సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి భారీ ప్రదర్శనగా బయలుదేరి ఎన్ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి.రామిరెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదలతో సాగర్ కెనాల్‌కు గండ్లు పడి 22 రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడంలో స్థానిక మంత్రులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. భారీ వర్షాలు, వరదలతో పంటలు కొట్టుకుపోయి, ఇసుక మేట వేసి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు.



ఇప్పుడు ఉన్న కొద్దిపాటి పంటలకు సాగు నీరందక భూమి నెర్రెలుబాసి నిలువునా పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.30 వేల నుంచి 50 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతన్నలకు భారీ వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేశాయన్నారు. రిజర్వాయర్ల నిండా నీళ్ల ఉన్నా ప్రభుత్వ అసమర్థత కారణంగా పంటలు ఎండిపోతున్నాయన్నారు. వరదలు వచ్చి 22 రోజులు కావస్తున్నా నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరైనది కాదన్నారు.

ఇప్పటికే చాలామందికి రైతు రుణమాఫీ రాక, రైతు భరోసా అందక అవస్థలు పడుతున్న నేపథ్యంలో వరదలతో పంటలు దెబ్బతినడం.. మిగిలిన పంటలకు నీళ్లు అందక ఎండిపోవడం రైతన్నలను తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందన్నారు. నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం నెల రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరదల్లో కొట్టుకుపోయిన పంటలకు ఎకరానికి రూ.25 వేలు, ఇసుక మేట వేసి కోతకు గురైన పంటలకు రూ.50 వేల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఎన్ఎస్పీ ఏఈకి వినతిపత్రం అందించారు. స్పందించిన ఏఈ మాట్లాడుతూ.. శనివారం నుంచి సాగర్ జలాల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు, సీపీఐ(ఎం) నాయకులు ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, కట్టెకోల వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, మందడపు మురళీకృష్ణ, శీలం అప్పారావు, ఎడ్ల తిరుపతిరావు, సిరికొండ నాగేశ్వరరావు, ఎలమద్ది లెనిన్ పాల్గొన్నారు.

పెబ్బేరు ఏటీఎంలో చోరీ



గ్యాస్ కట్టర్లతో బాక్స్ తొలగించి..
రూ.17 లక్షలా 92 వేల అపహరణ

నవతెలంగాణ- పెబ్బేరు

ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్లో దొంగలు పడ్డారు. వనపర్తి జిల్లా పెబ్బేరు పురపాలక కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను దుండగులు గ్యాస్ కట్టర్లతో కోసి నగదు దోచుకెళ్లారు. సుమారు రూ.17లక్షలా 92వేలా 500 చోరీ జరిగింది. ఏటీఎం నిర్వాహకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో గురువారం నిర్వాహకులు రూ.14 లక్షలు లోడింగ్ చేశారు. అప్పటికే అందులో రూ.9 లక్షలా 19 వేలున్నాయి. మొత్తం రూ.23 లక్షలా 19 వేలా 700 ఉండగా, వినియోగదారులు కొంత డ్రా చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలోకి చొరబడి గ్యాస్ కట్టర్‌తో బాక్సును కోసి.. అందులో ఉన్న రూ.17 లక్షలా 92 వేలా 500 ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం జనం ఏటీఎం దగ్గరికి వచ్చి డబ్బులు లేకపోవడంతో వెనుదిరి గిపోయారు. నిర్వాహ కులు అక్కడికొచ్చి పరిశీలించి చోరీ జరిగినట్టు గుర్తించారు. ఈ విషయంపై ఏటీఎం సీనియర్ ఎగ్జిక్యూటివ్ నరసింహగౌడ్ ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు తనిఖీ చేశారు. చోరీకి గురైన ఏటీఎం సెంటర్‌ను ఏఎస్పీ రాందాస్ తేజావత్, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ, ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి పరిశీలించారు. నరసింహగౌడ్ ఫిర్యాదు కొరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

టీటీడీకి పాల ఉత్పత్తుల సరఫరాకు విజయ డెయిరీ సిద్ధం

- టీటీడీకి పశుసంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నైవేద్యాల కోసం స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేసేందుకు విజయ డెయిరీ సిద్ధంగా ఉన్నదని తెలంగాణ పశుసంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. ఈ మేరకు శనివారం టీటీడీ కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావుకు ఆయన బహిరంగ లేఖ రాశారు. దేశ వ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తుల రంగంలో తెలంగాణ విజయ డెయిరీ సంస్థ ప్రసిద్ధి చెందిందని గుర్తు చేశారు. వినియోగదారులకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేసిన చరిత్రను కలిగి ఉందని పేర్కొన్నారు. విజయ డెయిరీ ఉత్పత్తుల్లో నాణ్యతను పాటిస్తున్నదని చెప్పారు. తద్వారా లక్షలాది మంది పాల రైతులు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలన్నింటినీ తీర్చడానికి విజయ డెయిరీ సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. దేవస్థానానికి, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

తెలంగాణ ఉద్యమంలో బాపూజీ పాత్ర మరువలేనిది.

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి, మలిదశ ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర మరువలేనిది అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కె.లక్ష్మణ్ అన్నారు. బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం తొలిదశ ఉద్యమ సమయంలో మంత్రిపదవికి రాజీనామా చేసి ఉద్యమానికి ఊపిరి పోశారని గుర్తు చేశారు. శాసన సభ్యులుగా, మంత్రిగా, ఉపసభాపతిగా ఎన్ని బాధ్యతలు చేపట్టినా వాటికి వన్నెతెచ్చారని కొనియాడారు. పొద్దున లేస్తే కులగణన గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ తొమ్మిది నెలలు గడిచినా తెలంగాణలో ఎందుకు చేయడం లేదని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఆ పార్టీ అవకాశవాద రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శం

- బీసీ కమిషన్ ఛైర్మెన్ జీ నిరంజన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుందని బీసీ కమిషన్ ఛైర్మెన్ జి నిరంజన్ తెలిపారు. బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళు లర్పించారు. బాపూజీ తెలంగాణ సాధించటానికి, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తన జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. గాంధేయవాదిగా విలువలకు కట్టుబడి, ఎన్నో పోరాటాలు నడిపారని పేర్కొన్నారు. తెలంగాణ తొలి దశ, మలిదశ పోరాటంలో ఆయన స్ఫూర్తితో పనిచేశామని గుర్తు చేశారు. కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా ఉండి కూడా ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ తన మంత్రి పదవికి రాజీనామా చేశారని తెలిపారు. ఆ తర్వాత ఎలాంటి పదవులను ఆశించకుండా తెలంగాణ గురించి, వెనుకబడిన వర్గాల గురించి పోరాడారని పేర్కొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్య

- పెండ్లికి ఇరు కుటుంబాలు ఒప్పుకోలేదని..



నవతెలంగాణ-దోమకొండ

ఇద్దరూ ప్రేమించుకున్నారు. జీవితంలో స్థిరపడ్డాక పెండ్లి చేసుకుందామని భావించారు. పెండ్లి చేసుకునేందుకు కుటుంబీకులను సంప్రదించగా వారు నిరాకరించారు. దీంతో కలత చెందిన యువకుడు ఉరేసుకోగా.. విషయం తెలిసి యువతి కూడా ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబరిపేట్ గ్రామంలో శనివారం జరిగింది. సీఐ సంపత్, ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబరిపేట గ్రామానికి చెందిన రంగోలి వీణా(22), కోనాపూర్ గ్రామానికి చెందిన మొగిలి సాయికుమార్(24)కు చదువుకునే సమయంలో ఏర్పడిన స్నేహం చివరకు ప్రేమగా మారింది. అయితే, జీవితంలో స్థిరపడ్డాక తమ ప్రేమ విషయాన్ని రెండు కుటుంబాల్లో చెప్పి ఒప్పించి పెండ్లి చేసుకోవాలనుకున్నారు. సాయికుమార్ ప్రస్తుతం తూప్రాన్‌లో ప్రయివేటు పాఠశాలలో పీటీగా పని చేస్తున్నాడు. వినాయక చవితి పండుగ కోసం గ్రామానికి వచ్చాడు. తమ ప్రేమ విషయం ఇరువురి తల్లిదండ్రులకు కొన్ని రోజుల కిందటే చెప్పడంతో వారు అందుకు ఒప్పుకోలేదు. దాంతో మనస్తాపానికి గురైన సాయి శుక్రవారం రాత్రి తమ వ్యవసాయం భూమి వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన వీణా ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇరు గ్రామాల్లో ఘటనా స్థలాలను సీఐ సంపత్, ఎస్ఐ ఆంజనేయులు పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుల ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

దళితుల ఇండ్ల స్థలాలు కాజేసే కుట్ర

- 1976లో పేదల కోసం భూసేకరణ
- 4.3 ఎకరాల్లో దళితులు, పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు
- ధరణిలో పాత పట్టాదారుడి పేరు నమోదు
- వారసత్వం పేర దొడ్డిదారిన విక్రయం
- గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు
- మా భూమి ఇవ్వాలంటున్న పేదలు
- ఆర్డీఓకు బాధితుల ఫిర్యాదు

రెవెన్యూ అధికార యంత్రాంగం చట్టాల్లోని లొసుగుల్ని ఆసరా చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేద దళితులకు ఇండ్ల స్థలాల కోసం సేకరించిన భూమినే తిరిగి పాత పట్టాదారుడికి రిజిస్ట్రేషన్ చేసి కాజేసే కుట్ర సాగుతోంది. ఐదు దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాల కోసం సేకరించిన భూమిని తిరిగి ధరణిలో పాత పట్టాదారుడి పేరున చేర్చారన్న వార్తతో పేదలు ఆందోళన చెందుతున్నారు. దొడ్డిదారిన పౌతీ చేసి తర్వాత విక్రయించేందుకు రెవెన్యూ అధికారులే సహకరించినట్టు తెలిసింది. భూముల విలువ పెరగడంతో పాత పట్టాదారులు, ఓ సంపన్నుడు మిలాఖత్ అయి ఇండ్ల స్థలాల భూముల్లో వెంచర్ చేసేందుకు పూనుకున్నట్టు సమాచారం. వందల కోట్ల విలువ చేసే భూమిని కాజేసే కుతంత్రానికి అధికారులు సైతం జీ హుజూర్ అనడం విశేషం. పాత రికార్డుల్ని పరిశీలించకుండానే గుడ్డిగా భూముల్ని మార్చేదం వెనకాల పెద్దఎత్తున డబ్బు చేతులు మారినట్టు తెలుస్తోంది. దీనిపై బాధితులు తహసీల్దార్, ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టాలిచ్చిన స్థలాన్ని కాపాడి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతపెట్టు దూరంలో ఉన్న గౌడిచర్ల గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 653లో భానూరు భూమయ్య అనే వ్యక్తికి 403 ఎకరాల పట్టా భూమి ఉన్నది. ఆయనకు పక్కనే ఉన్న ఇస్మాయిల్‌ఖాన్ పేట గ్రామంలోనూ ఎకరాల కొద్ది భూములున్నాయి. గౌడిచర్ల గ్రామంలోని ఆయన భూమిని పేదలకు ఇండ్ల స్థలాల కోసం 1976లో అప్పటి ప్రభుత్వం సేకరించింది. సర్వే నెంబర్ 653లో ఉన్న 403 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. గ్రామంలో నిరుపేదలైన దళితులు, ఇతర బీసీ కులాల్లోని పేదలకు పట్టాలిచ్చారు. 40 మంది వరకు దళితులున్నాయి. వారికి ఇండ్ల స్థలాల్ని మంజూరు చేసి పట్టా సర్టిఫికెట్లు జారీ చేసింది. ఆ స్థలాల్లో 15 నుంచి 20 మంది వరకు ఇండ్లు కట్టుకుని జీవిస్తున్నారు. ఇంకొందరికి ఆర్థిక స్థోమత లేక పశువుల కొట్టాలు వేసుకుని కబ్జాలో ఉన్నారు. క్రమక్రమంగా ఒక్కొక్కరుగా ఇండ్లు కట్టుకుంటున్నారు. దళితులతోపాటు అదే గ్రామానికి చెందిన బీసీ కులాల్లోని పేదలకు కూడా ప్రభుత్వం ఇండ్ల స్థలాల కోసం భూమిని సేకరించి సర్టిఫికెట్లు ఇచ్చింది. వాళ్లంతా నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు.

ధరణిలో పాత పట్టాదారు పేరిట భూమి

ధరణి పోర్టర్ వచ్చే ముందు రెవెన్యూ అధికారులు తమ ఇష్టారాజ్యంగా భూముల పట్టాల చేర్పులు మార్పులు చేసిన విషయం తెలిసింది. గౌడిచర్ల గ్రామంలోని సర్వే నెంబర్ 653లోని 4.03 ఎకరాల ఇండ్ల స్థలాల భూమి తిరిగి ధరణిలో పాత పట్టాదారుడైన భానూరు భూమయ్య పేరున ఎక్కింది. దీంతో ఆయన వారుసులు తమ పేరిట పౌతి చేయించుకున్నారు. చక్రపాణి పేరిట 17 గుంటలు, కాశీనాథ్ పేరిట 34 గుంటలు, పద్మావతి పేర 35 గుంటలు, జీవన్‌ప్రకాశ్ పేర 18 గుంటలు, రమాకాంత్ పేరిట పదిహేడున్నర గుంటల చొప్పున పౌతి చేశారు. దీని వెనుక రెవెన్యూ అధికారులు పెద్ద తతంగం నడిపినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇండ్ల స్థలాల భూమి విక్రయం

పేద దళితుల ఇండ్ల స్థలాల కోసం సేకరించిన భూమిని తిరిగి ధరణిలో పాత పట్టాదారు పేరున మార్చాక.. భానూరి భూమయ్య వారసులకు రిజిస్ట్రేషన్ చేశారు. ఇటీవల భూమయ్య వారసులు తమ భూమిగా క్లెయిమ్స్ చేసుకుంటూ మరో వ్యక్తికి విక్రయించారు. గౌడిచర్లలో దళిత పేదలకు పట్టాలిచ్చిన జాబితాలో పేరున్న కుటుంబానికి చెందిన నర్సింహులు అనే వ్యక్తి ఇటీవల దశల వారీగా భూమిని కొనుగోలు చేశారు. మొదట సర్వే నెంబర్ 653అ/2లో 20 గుంటలు రిజిస్ట్రేషన్ చేశారు. దానిపైన ఎవరూ అభ్యంతరం తెల్పలేదని చెప్పి తర్వాత నాలుగు దశల్లో 653/ఆ/1/2లో 10 గుంటలు, 653 /ఆ/2లో 10 గుంటలు, 653 అ/ఇ/2లో 10 గుంటలు, 653 ఆ1/2లో 10 గుంటల భూమి కలిపి 1.20 భూమిని కొనుగోలు చేశారు. కోట్ల విలువ చేసే భూమి కావడంతో రెవెన్యూ అధికారులు చట్టంలోని లొగుసుల్ని ఆసరా చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించి పేదల భూముల్ని కాజేసే కుట్రలో భాగస్వామ్యమయ్యారనే విమర్శలున్నాయి.

భూముల కోసం దళితుల ఆందోళన

తమ ఇండ్ల స్థలాలు తమకు దక్కేలా చూడాలని కోరుతూ దళిత లబ్దిదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. తహసీల్దార్, ఆర్డీఓలను కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ స్థలాలను కాజేయాలని చూస్తున్న వ్యక్తులతోపాటు తప్పుడు పద్ధతుల్లో రిజిస్ట్రేషన్స్ చేసిన అధికారులపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

భూ రికార్డుల్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం : రాజు, ఆర్డీఓ

గౌడిచర్ల గ్రామంలోని సర్వే నెంబర్ 653లో ఉన్న 4.3 ఎకరాల భూమిని పేదల ఇండ్ల స్థలాల కోసం 1976లో సేకరించినట్టు బాధితులు చెబుతున్నారు. అలా ప్రభుత్వం భూ సేకరణ చేసిన తర్వాత తిరిగి పాత పట్టాదారుడి పేరిట ధరణిలో ఎక్కించడం వల్లే అతను పట్టాదారుగా ఇతరులకు విక్రయించాడు. ఆ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. పేదలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి



దళితులకు ఇండ్ల స్థలాల కోసం ఇచ్చిన భూమిని తిరిగి ధరణిలో పాత పట్టాదారు పేరున చేర్చడమే కాకుండా అతని వారసులకు పౌతి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. కోట్లు విలువ చేసే భూముల్ని కాజేసేందుకు పాత పట్టాదారులు, దళితుల్లోని ఓ పెద్ద మనిషి, రెవెన్యూ అధికారులు కలిసి పేద దళితులకు అన్యాయం చేయాలని చూశారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ జోక్యం చేసుకుని గౌడిచర్ల దళితుల ఇండ్ల స్థలాల భూమిని కాపాడాలి. పాత పట్టాదారుల పేరిట జరిగిన రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేయాలి.

- అశోక్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

50 ఏండ్ల కిందటే పట్టాలు



మాకు 50 ఏండ్ల కిందటనే సర్కార్ ఇండ్లు కట్టుకునేందుకు స్థలాలిచ్చింది. పట్టా సర్టిఫికెట్లు అందజేసింది. కొందరు ఇండ్లు కట్టుకున్నారు. కొంతమంది ఆ స్థలంలో దొడ్లు, కట్టెలు, గడ్డి వేసుకుని కబ్జాలోనే ఉన్నాం. మాకు చెందిన భూమిని ఓ వ్యక్తి కొనుగోలు చేసి మట్టి పోస్తున్నాడు. వెంచర్ చేసి ప్లాట్లు అమ్ముకునే ప్లాన్‌లో ఉన్నారు. అధికారులు మా భూమిని మాకు ఇప్పించాలి.

- బేగరి బాలయ్య, గౌడిచర్ల

వక్ఫ్ బిల్లుపై ఐదు రాష్ట్రాల్లో జేపీసీ పర్యటన

- ఈనెల 26 నుంచి అక్టోబర్ 1 వరకు చర్చలు
- సెప్టెంబర్ 28న హైదరాబాద్‌లో తెలంగాణ, ఏపీ ప్రతినిధులతో జేపీసీ భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ (సవరణ) బిల్లు-2024పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 1 వరకు వివిధ వాటాదారులతో ఐదు రాష్ట్రాల్లో చర్చలు జరపనుంది. ఈ సంప్రదింపులు దేశవ్యాప్తంగా 6,00,000 పైగా నమోదిత వక్ఫ్ ఆస్తుల నిర్వహణను నియంత్రించే వక్ఫ్ చట్టానికి ప్రతిపాదించిన సవరణలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు ప్రతినిధులతో పాటు బార్ కౌన్సిల్ సభ్యులు, లాయర్స్ అసోసియేషన్లు, ముత్తవల్లి అసోసియేషన్లు కూడా ఈ చర్చలో పాల్గొంటున్నారు.

దేశవ్యాప్త సంప్రదింపుల్లో భాగంగా మొదట సెప్టెంబర్ 26న ముంబయిలో జేపీసీ పర్యటిస్తుంది. మహారాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రతినిధులతో సమావేశమవుతుంది. మహారాష్ట్ర రాష్ట్ర మైనారిటీ కమిషన్‌తో కూడా సమావేశం అవుతుంది. సెప్టెంబర్ 27న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పర్యటించి గుజరాత్ ప్రభుత్వం, గుజరాత్ వక్ఫ్ బోర్డు, ఇతర కీలక వాటాదారులతో జేపీసీ సమావేశమవుతుంది.

సెప్టెంబరు 28న హైదరాబాద్‌లో జేపీసీ పర్యటిస్తుంది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వక్ఫ్ బోర్డులు, రెండు రాష్ట్రాల రాష్ట్ర మైనారిటీ కమిషన్‌ల ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు. గ్రాండ్ మక్కా మసీదు, వివిధ ధార్మిక సంస్థలతో సహా దేశంలోని కొన్ని ముఖ్యమైన వక్ఫ్ ఆస్తులకు హైదరాబాద్ కేంద్రంగా ఉంది. అలాగే, ఈ ఆస్తుల నిర్వహణ సంఘం సామాజిక, ఆర్థిక సంక్షేమంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. అలాగే ఛత్తీస్‌గఢ్ వక్ఫ్ బోర్డు కూడా హైదరాబాద్ చర్చలలో పాల్గొంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన స్వరాల వైవిధ్యం దేశంలోని దక్షిణ, మధ్య ప్రాంతాలలో వక్ఫ్ ఆస్తులు ఎలా నిర్వహించబడుతున్నాయనే దానిపై సమగ్ర వీక్షణను అందించగలదని భావిస్తున్నారు.

అలాగే సెప్టెంబర్ 30న చెన్నైలో జేపీసీ సమావేశం నిర్వహించనుంది. ఇక్కడ తమిళనాడు ప్రభుత్వం, తమిళనాడు వక్ఫ్‌బోర్డు, రాష్ట్ర మైనారిటీ కమీషన్ ప్రతినిధులతో చర్చలు జరుగుతాయి. పార్లమెంటు సంయుక్త కమిటీ చివరి రోజు అక్టోబరు 1న బెంగళూరులో పర్యటిస్తుంది. ఇక్కడ కర్ణాటక ప్రభుత్వం, కర్ణాటక వక్ఫ్ బోర్డు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటారు. ఇక్కడ కేరళ వక్ఫ్ బోర్డు ప్రతినిధులు, ఇతర సంఘాల నేతలు కూడా చర్చల్లో పాల్గొంటారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల మొదటి వారం చివరి రోజులోగా కమిటీ తన నివేదికను లోక్‌సభకు సమర్పించాల్సి ఉంది.

బందూక్‌తో రజాకార్లను భయపెట్టిన బందరు గోపయ్య



నిజాం పాలనలో తెలంగాణ ప్రజల బాధలు అన్నీఇన్నీ కావు. దొరలు, పటేండ్లు, పట్వారి, మునుసుబు, పోలీసులు సాగించిన దురాగతాలతో అనేక హింసలకు గురయ్యారు. అరాచకం ఎంత పెరిగితే ఉద్యమం కూడా అంతే వేగంగా ముందుకొస్తుంది. దానికి సజీవ సాక్ష్యం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. భూమి, భుక్తి, విముక్తి కోసం నిజాంపై సాగించిన ఈ పోరాటం దేశ చరిత్రలోనే ఒక మైలురాయి లాంటిది. ఈ పోరాటంలో అమరుల త్యాగాలు వెలకట్టలేనివి. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన ఈ మహత్తర పోరాటంలో ఎంతోమంది కీలకపాత్ర పోషించారు.

అందులో తుపాకి ఎక్కుపెట్టి ముందున్న వ్యక్తి కామ్రేడ్ చినపంగి గోపయ్య ఒకరు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పెన్‌పహడ్ మండలానికి చెందిన ఆయన పోరాటాన్ని స్మరించనివారు లేరు. ఆయన చిన్నతనంలో స్వగ్రామం చేదేళ్లలోని తిరుపతమ్మ గుడిపక్కన ఉన్న తుంబై దగ్గర బ్రిటిష్ వాళ్లు బల వంతంగా టీకాలు వేయిస్తున్న సందర్భంలో వారిని ఎదిరించి వాళ్ల బూటుకాళ్లతో దెబ్బలు తిన్న వ్యక్తి గోపయ్య. అదే సందర్భంలో దొంగల బోను మునగాల మండలం గణపవరం దగ్గర ప్రస్తుతం ఎల్ 37 లిఫ్టు ఉన్న ప్రదేశంలో ఆ దొంగల బోను(అది ఒక అండమాన్ జైలు లాంటిది). ఆ బ్రిటిష్ వాళ్లకు, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా తీసుకువెళ్లి ఆ దొంగల బోనులో వేసి చిత్రహింసలకు గురిచేసేవారు. వెలుజెండా గ్రామానికి చెందిన మేదరమెట్ల సీతారామయ్య అప్పటికే నాయకుడు. సాయుధ పోరాటం బలపడుతున్న తరుణంలో దళంలో పనిచేయడానికి చుట్టు పక్కల గ్రామాల్లో వెతుకుతుండా చేదేళ్లలో గోపయ్యను గుర్తించారు. తల్లిదండ్రులతో పాటు ఇద్దరు అన్నలను, ఇద్దరు తమ్ములను ఒప్పించి చిలుకూరు దగ్గర జరిగిన ఆంధ్ర మహాసభకు తీసుకెళ్లారు. ఆయన ధైర్య సాహసాలు, ఊరిలో బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు ఆయనకు పేరు తీసుకొచ్చింది. దీంతో ఆంధ్రమహాసభ అటునుంచి అటే తుపాకి సాధన, కర్రసాము కోసం శిక్షణ ఇప్పించడానికి తీసుకెళ్లగా అందులో ఆరితేరాడు గోపయ్య.

రజాకార్లు, నైజాం నవాబు టేకుమట్ల రహదారి నుండి మచిలీపట్నం వెళ్లే సందర్భంలో టేకుమట్ల బ్రిడ్జిని కూలగొట్టి ఆ రజాకారులను మచిలీపట్నం పోకుండా అడ్డుకున్న వారిలో గోపయ్య ముఖ్యుడు. ఆ సందర్భంలోనే రజాకార్లలో ఒకరిని చంపి ఆ తలను బందరులో వేసివచ్చాడు. అందుకే ఆయన్ను సినపంగి గోపయ్యకు బదులు బందరు గోపయ్య అనే పేరొచ్చింది. ఆయుధాలు విడిచిన తర్వాత పుచ్చలపల్లి సుందరయ్య బందరు కాలువ పూడిక తీయడానికి పిలుపునిస్తే ఆ పిలుపునందుకుని ఆ కాలువ పనిలో పనిచేశాడు ఈ రెండు సందర్భాలు కూడా ఆయన్నిప ఇంటి పేరుని బందరుగా మార్చాయి. ఇప్పటికీ ఈ గ్రామంలో చినపెంగి వారికంటే బందరు అంటే చాలామందికి తెలుసు.

రజాకార్లు, దొరలు, భూస్వాములు, పెత్తందారులు సాగిస్తున్న అరాచకాలు ఎదుర్కొనుటకు దళం ఎక్కడికి పిలిపిస్తే అక్కడికి వెళ్లేవాడు. తుపాకితో ఆయన దాదాపు వంద మంది రజాకారులను కాల్చి చంపినట్టు గ్రామస్తులు చెబుతుండేవారు. అనేక గ్రామాల రక్షణ కోసం బయటికి వెళ్లి చింతలపాలెం, మల్లారెడ్డి గూడెం, నల్లబండగూడెం, వెలిదండ, కోనాయిగూడెం,రంగాపురం,గీతవారి గూడెం, అడ్డూరు, తమ్మారం, చెట్ల ముకుందాపురం, గాజుల మల్యాపురం ఈ గ్రామాలకు రక్షణ దళాలుగా పని చేసిన వ్యక్తి గోపయ్య. మల్లారెడ్డిగూడెంలో రజాకార్లకు -రక్షణ దళాలకు మధ్య కాల్పులు జరుగుతున్న సమయంలో వారినుంచి గోపయ్య, ఆయనతో పాటు మరో కార్యకర్త తప్పించుకుని ఆ గ్రామం నడిబొడ్డున ఉన్న శాతబావిలో ముండ్లకంపలు, పొదల్లోకి వెళ్లగా, ఇది గమనించిన రజాకార్లు ఆ ముండ్లకంపలపైన కిరోసిన్ పోసి మంట పెట్టి వెళ్లిపోయారు. ఆ మంటలను తట్టుకోవడానికి నీళ్లలోకి దిగి వారికివారే రక్షించుకున్నారు. లేకపోతే ఆ మంటలు కాలిసిపోయేవారు. కీత వారి గూడెం దగ్గర ఒకే దారిన పద్దెనిమిది గుర్రాల మీద వస్తున్న రజాకార్లని ఒకే బాట మీదకు రప్పించి ఆ బాటలో పెద్దపెద్ద గొయ్యిలు తీసి ఆ గొయ్యిల్లో గుర్రాలతో పాటు రజాకారులు పడగా వారిని కాల్చిచంపిన ఘనత గోపయ్యది. రజాకార్లు, నైజాం నవాబు టేకుమట్ల రహదారి నుండి మచిలీపట్నం వెళ్లే సందర్భంలో టేకుమట్ల బ్రిడ్జిని కూలగొట్టి ఆ రజాకారులను మచిలీపట్నం పోకుండా అడ్డుకున్న వారిలో గోపయ్య ముఖ్యుడు. ఆ సందర్భంలోనే రజాకార్లలో ఒకరిని చంపి ఆ తలను బందరులో వేసివచ్చాడు. అందుకే ఆయన్ను సినపంగి గోపయ్యకు బదులు బందరు గోపయ్య అనే పేరొచ్చింది. ఆయుధాలు విడిచిన తర్వాత పుచ్చలపల్లి సుందరయ్య బందరు కాలువ పూడిక తీయడానికి పిలుపునిస్తే ఆ పిలుపునందుకుని ఆ కాలువ పనిలో పనిచేశాడు ఈ రెండు సందర్భాలు కూడా ఆయన్నిప ఇంటి పేరుని బందరుగా మార్చాయి. ఇప్పటికీ ఈ గ్రామంలో చినపెంగి వారికంటే బందరు అంటే చాలామందికి తెలుసు.


సిరిసిల్ల దగ్గర ధర్మపురంలో భూస్వామి అయిన దొరసాని ఆ గ్రామాన్ని చుట్టుపక్కల గ్రామాలను ఇబ్బందులకు పెడుతుండగా దళం పిలిపిస్తే గౌను మట్టయ్య చిన్నపని గోపయ్య ఇద్దరు ఆ బాధ్యత తీసుకొని అక్కడికి వెళ్లారు. ఆమె ఉండే కోట గదిపై మూడు రోజులపాటు రెక్కీ నిర్వహించి ఆ గదిలోకి దూరారు. ఆ గదిలో మొత్తం నాలుగు దిక్కులలో నాలుగు పెద్ద కుక్కలు ఉండేవి ఆ కుక్కలు అరుపులకు ప్రజలు భయ పడేవారు ఆ దొరసానిని అంతం చేయాలంటే ముందు ఆ కుక్కలను చంపాలి, లేకపోతే మనం ఆ దొరసాని ఏమి చేయలేమని ఒక రాత్రి గదిలో చొరబడి ఆ నాలుగు కుక్కలను చంపి దళానికి సిగ్నల్ ఇస్తే దళం మొత్తం వచ్చి ఆ కోటను కూల్చింది. సినపంగి గోపయ్యకు ఐదుగురు సంతానం. నలుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. ఇంతపెద్ద కుటుంబంతో ఉన్న సంసారాన్ని నెట్టుకురావడానికి గోపయ్య చాలా ఇబ్బందులు పడ్డాడు. ఓ వైపు పోరాటంలో పాల్గొంటూనే మరోవైపు వారిని పోషించుకున్నాడు.

ఆయనకున్న నాలుగెకరాల భూమిని, ఇల్లును దొరలు ధ్వంసం చేయగా బెదరలేదు గోపయ్య. ఆయనతో పాటు తన పెద్ద కుమారుడు, రెండవ కుమారుడు ఇద్దరు కూడా జైలు జీవితం అనుభవించారు. తనకున్న నాలుగు ఎకరాల భూముల్లో రెండెకరాలు, పది తులాల బంగారం, 20 తులాల వెండిని తనపై, కుటుంబంపై అక్రమంగా మోపబడిన కేసుల కోసం అమ్ముకున్నాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన సాహసగాథలు ఎన్నో ఉన్నాయి. నేటికీ చుట్టుపక్కల గ్రామాల్లో ఆయన కుటుంబం, వారు పడిన బాధలు, చేసిన తిరుగుబాట్లు, రజాకార్లను ముప్పుతిప్పుపెట్టిన ఘటనల గురించి చెప్పుకుంటూనే ఉంటారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆయనకు విప్లవ జేజేలు

- చిన్నపంగి నరసయ్య

పంటలన్నీ రసాయన ఎరువుల మయమై అటు భూసారాన్ని, ఇటు మానవా ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని హాని చేస్తున్న వేళ ప్రభుత్వాలు స్పందించి దేశంలో,రాష్ట్రాలలో రసాయన ఎరువుల సగటు వాడకాన్ని నియంత్రిస్తూ ,రసాయన ఎదవులకు బదులు తొలకరి వానలు కురవగానే పొలంలో పిల్లి పెసర ,జీలుగు, జనుము లాంటివి పెంచి దున్నితే భూమికి అవసరమైన నత్రజని అందుతుంది.యూరియా వాడకాన్ని తగ్గించవచ్చు. దీనికి అనుగుణంగా ప్రభుత్వా భూసార పరీక్షా కేంద్రాలను విరివిగా ఏర్పరిచి రైతు కమతాలను భూసార పరీక్షలు నిర్వహించాలి. భూమిలో ఉన్న పోషక లోపాలకు అనుగుణంగా శాస్త్రవేత్తల సూచనల మేరకు రసాయన, సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటలను పండించేలా రైతులను చైతన్యపరచాలి.

భూముల్లో నిస్సారం-పంటల్లో పోషకాలు తగ్గుముఖం



మేకిరి దామోదర్
9573666650

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హరిత విప్లవం మూలంగా ఏడున్నర దశాబ్దాల కాలంలో వ్యవసాయ(సేద్య)రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వివిధ పంటల్లో నూతన వంగడాల రాకతో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. ఆకలి మంటల్లో అలమటించిన భారతావని తలరాతను మార్చేసింది.1961లో, దేశంలో 72.3 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయితే, 2022-23 వచ్చేసరికి అది 329.69 మిలియన్ టన్నులకు ఎగబాకింది. అధిక దిగుబడలు ఇచ్చే వంగడాలు రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగంతో ఆహార ఉత్పత్తుల దిగుబడులు పెరగసాగాయి.అధిక దిగుబడి సాధించడానికి నేల ఆరోగ్యం అత్యంత కీలకం. కానీ అదే సమయంలో రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడడం కారణంగా భూసారం నాశనమవుతుంది. వ్యవసాయ భూముల్లోసేంద్రీయ కర్బనం కనీసం2.5 శాతం మేరకు ఉండాలి. కానీ దేశంలో అది 0.5 శాతం కన్నా తక్కువకే పరిమితం అయినట్లు అంచనా. దీంతో పంటల్లో పోషకాల శాతం క్షీణించి పోతుంది. ఆహార పదార్థాల్లో రసాయన అవశేషాలు అధికమవుతున్నాయి. పంటల దిగుబడులు వృద్ధి కోసం విచ్చల విడిగా వాడుతున్న పురుగుమందుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 2లక్షల మంది మరణిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి గతంలో హెచ్చ రించింది. క్యాన్సర్లు, ఆల్జీమర్స్,పార్కిన్‌సన్స్ వంటి వ్యాధులు వ్యాప్తికి రసాయన క్రిమిసంహారకాలు కారణం అవుతున్నాయి.



2021-23లో దేశంలో1.27లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను పొలాల్లో చల్లినట్టు కేంద్రం లెక్కలు. 2023-24 మధ్య 1.68 లక్షల మెట్రిక్ టన్నుల రసాయన పురుగు మందులను పంటలపై పిచికారీ చేశారు. నేల సత్తువను, జన ఆరోగ్యాన్ని హరిస్తున్న వీటి విని యోగాన్ని కట్టడి చేయకపోతే భవిష్యత్తు సమాజం ప్రమాదంలో పడుతుంది.కాబట్టి కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. పర్యావరణానికి హాని చేస్తున్న రసాయన ఎరువులు, కలుపు మందులను విపరీతంగా వినియోగిస్తున్నారు.ఫలితంగా పొలాలు కాలుష్యానికి గురై ఉప్పు,చౌడు వంటి సమస్యాత్మక భూములుగా మారుతున్నాయి. సాధారణంగా అవసరానికి మించిన యూరియా, కాంప్లెక్స్ వాడటం వల్ల భూముల్లో బాస్వరం నిల్వలు అధికమవుతున్నాయి. భూగర్భజలాలు సైతం కలుషితమవుతున్నాయి. దీంతో సూక్ష్మ పోషకమైన జింకు అందుబాటు తగ్గిపోతుంది. ఇలా అధిక దిగుబడుల కోసం చాలామంది రైతులు ఇబ్బడిముబ్బడిగా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో పొలాల్లో అంతకంతకు నిస్సారమై పోతున్నాయి. ఇలా వ్యవసాయ సేద్యంలో వచ్చిన విపత్కర పరిణామాలను అధిగమించడానికి దేశవ్యాప్తంగా భూసార పరీక్షలను విరివిగా చేపట్టి పంట భూములు సంరక్షించుకోవడం ప్రస్తుత తక్షణవసరం.ఆదే వేళ ప్రధాన ఆహార ధాన్యాల్లో పోషక విలువ పడిపోతున్నాయి.ముఖ్యంగా వరి, గోధుమ పంటల్లో జింక్, ఐరన్ వంటి పోషకాలు తగ్గిపోయాయి.అదే సమయంలో వరిలో ప్రమాదకరమైన ఆర్సెనిక్ పరిమాణాలు అధికమైనట్లు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. కూరగాయలు, పండ్లలోను ప్రాణాంతక పురుగుమందుల అవశేషాలు తరచూ బయటపడుతున్నాయి. సాగులో రసాయనాల వాడకంతో ప్రజారోగ్యం దెబ్బ తినడంతో పాటు, నేల చౌడు బారిపోతుంది. దిద్దుబాటులో భాగంగా సేంద్రియ వ్యవసాయాన్ని విరివిగా ప్రోత్సహించాలి.

తెలంగాణ రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం ఏడాదికేడాది భారీగా పెరుగుతోంది.నిరుడు 44 లక్షల టన్నులు.. ఈ ఏడాది 47 లక్షల టన్నులు రాష్ట్రంలో పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందుల విరివిగా వినియోగిస్తున్నారు. రసాయన ఎరువులు వాడకని తగ్గించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్న రైతులు మాత్రం వాటికి మొగ్గుచూపడం లేదు. అన్నదాతలను అవగాహన పర చాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ,ప్రభుత్వం పైనే ఉంది. అంతే కాదు జాతీయ సగటు కంటే ఎక్కువ మన రాష్ట్రంలోనే వాడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎకరా పంటకు సగటున 78.4 కిలోల ఎరువులు వినియోగిస్తుండగా, దేశంలో 51.2 కిలోలుగా ఉంది.తెలంగాణలో మాత్రం దాదాపు 130 కిలోల వాడుతున్నారు. రాష్ట్రంలో 2014-15లో 15.12 లక్షల టన్నులుగా ఉన్న సరఫరా...2024-25 నాటికి 47.18 లక్షల టన్నులకు పెరిగింది. వరికి ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషి ఎరువులను 4:2:1 నిష్పత్తిలో వాడాల్సి ఉండగా,9:5:2 7:1 నిష్పత్తిలో ఆడుతున్నారని తెలుస్తోంది. రైతులు ప్రతి వ్యవసాయ సీజన్‌లో విత్తనాల కంటే ముందు ఎరువులను కొనుగోలు చేసి నిలువ చేస్తున్నారు. ఏపుగా పెరగాలని ఆశతో రసాయనాలను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ అధ్యయనంలో తేలింది. యూరియా వేస్తే వరి ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందనే అపోహ రైతుల్లో బాగా ఉంది.అందుకని విని యోగం చాలా పెరిగిపోతుంది. యూరియా 2015-16 లో 12.53 లక్షల టన్నుల యూరియా వినియోగమవ్వగా ఈ ఏడాది 21లక్షల టన్నులు ఉంటుందని భావిస్తున్నారు.

ఇలా పంటలన్నీ రసాయన ఎరువుల మయమై అటు భూసారాన్ని, ఇటు మానవా ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని హాని చేస్తున్న వేళ ప్రభుత్వాలు స్పందించి దేశంలో,రాష్ట్రాలలో రసాయన ఎరువుల సగటు వాడకాన్ని నియంత్రిస్తూ ,రసాయన ఎదవులకు బదులు తొలకరి వానలు కురవగానే పొలంలో పిల్లి పెసర ,జీలుగు, జనుము లాంటివి పెంచి దున్నితే భూమికి అవసరమైన నత్రజని అందుతుంది.యూరియా వాడకాన్ని తగ్గించవచ్చు. దీనికి అనుగుణంగా ప్రభుత్వా భూసార పరీక్షా కేంద్రాలను విరివిగా ఏర్పరిచి రైతు కమతాలను భూసార పరీక్షలు నిర్వహించాలి. భూమిలో ఉన్న పోషక లోపాలకు అనుగుణంగా శాస్త్రవేత్తల సూచనల మేరకు రసాయన, సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటలను పండించేలా రైతులను చైతన్యపరచాలి. వ్యవసాయ సేద్యంలో ఆధునిక శాస్త్ర సాంకేతికతను శాస్త్రవేత్తల సూచన మేరకు ఉపయోగిస్తూ భూసారాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగాలి. పోషక విలువలు సమపాళ్లలో ఉన్న ఆహారత్పత్తులను పండించాలి. లేదంటే? తను "కూర్చున్న కొమ్మను తనే నరుక్కున్నట్లు" అవుతుంది. ఇది రాత్రికి రాత్రే వచ్చిన ప్రమాదం కాదు. అలాగేని వెంటనే పరిష్కారం కూడా కాదు. ప్రభుత్వాలు, రైతులు, సమాజం నిర్లక్ష్యం వీడి తగు జాగ్రత్తగా వ్యవహారిస్తేనే పొంచి ఉన్న ప్రాణాంతక ప్రమాదంలోంచి భావితరం బయట పడుతుందని గమనించాలి.

సాగునీటి ప్రాజెక్టులు

రాష్ట్రంలో నీటిపారుదల రంగం వివరాలు

- తెలంగాణ రాష్ట్రం మొత్తం కూడా భారతదేశంలోనే ప్రాముఖ్యతను కలిగి ఉన్న 2 ముఖ్య నదులయిన గోదావరి, కృష్ణా నదుల పరివాహక ప్రాంతంలో విస్తరించి ఉంది.

నీటిపారుదల ప్రాజెక్టుల వర్గీకరణ

- నీటిపారుదల ప్రాజెక్టులను ఆయా ప్రాజెక్టుల కింద ఉండే ఆయకట్టు ప్రాంత పరిమాణం ఆధారంగా వర్గీకరిస్తారు.
- రాష్ట్రంలో ఉన్న మొత్తం నీటిపారుదల ప్రాజెక్టులను కింది విధంగా 3 రకాలుగా విభజించవచ్చు. అవి:

1) భారీ ప్రాజెక్టులు : 25000 ఎకరాల కంటే ఎక్కువ ఆయకట్టు గలవి (లేదా >10,000 హెక్టార్లు)

2) మధ్యతరహా ప్రాజెక్టులు : 5000 ఎకరాల కంటే ఎక్కువ మరియు 25,000 ఎకరాలకు తక్కువ ఆయకట్టు కలవి (2000-10,000 హెక్టార్లు)


భారీ నీటి పారుదల ప్రాజెక్టులు

- నదీ జలాలను వినియోగించుకోవడం కోసం ప్రభుత్వం 36 సాగునీటి ప్రాజెక్టులను చేపట్టింది. వీటిలో 21 భారీ సాగునీటి ప్రాజెక్టులు, 12 మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులు.
- ఈ సాగునీటి ప్రాజెక్టులతో 72 లక్షల ఎకరాల సాగునీటి సామర్థ్యం కల్పించాలని నిర్ణయించడం జరిగింది

తెలంగాణలో పూర్తి అయిన భారీ నీటిపారుదల ప్రాజెక్టులు:

నాగార్జునసాగర్ ప్రాజెక్టు

- నాగార్జున సాగర్‌కి మరొక పేరు నందికొండ ప్రాజెక్ట్
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద, అతి ఎత్తైన రాతికట్టడం, ఆధునిక దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ప్రాజెక్ట్ ఇది ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల సంయుక్త ప్రాజెక్టు.
- ఇది ఒక బహుళార్ధసాధక ప్రాజెక్ట్ (408 టి.ఎమ్.సి), స్థాపిత విద్యుత్ సామర్థ్యం 816 మె.వా.
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు నల్గొండ జిల్లాలోని నందికొండ గ్రామం వద్ద భోస్లా కమిటి సూచనల మేరకు 1956 డిసెంబర్ 10న శంఖుస్థాపన చేశారు. 1967 అగస్టు 4న ఈ ప్రాజెక్టును ఇందిరాగాంధీ ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతం 216 లక్షల చ.కి.మీ. (డ్యాం పొడవు 1550 మీ. 124 మీ. ఎత్తు)
- ఈ నాగార్జున సాగర్ డ్యాం వలన నాగార్జున కొండ చుట్టూ కృత్రిమ సరస్సు ఏర్పడినది. ఇక్కడ ద్వీపంలో మ్యూజియం కలదు.
- ఈ రిజర్వాయర్ గట్టుపై ప్రాచీన బౌద్ధవాసాన్ని పునర్నిర్మించారు. ఇక్కడ బౌద్ధ విశ్వవిద్యాలయం, బౌద్ధ స్థూపాలు, విహారాలు, బిలిపీఠం కలవు.



- ఈ ప్రాజెక్టు వలన 10లక్షల ఎకరాలకు పైగా సాగవుతుంది.
- ఈ ప్రాజెక్టు నిర్మాణ ఇంజినీర్- కె. ఎల్. రావ్. దీని మొదటి చీఫ్ ఇంజినీర్- జాఫర్ అలీ

ఆయకట్టు:

1) కుడి ప్రధాన కాలువ (జవహర్ కాలువ) - 10 నుండి 11 లక్షల ఎకరాలు (గుంటూరు, ప్రకాశం),

2) ఎడమ ప్రధాన కాలువ (లాల్ బహదూర్ కాలువ) - 8.5 నుండి 9.6 లక్షల ఎకరాలు (నల్గొండ, ఖమ్మం, ప్రకాశం)

మూసీ ప్రాజెక్టు

- కేతేపల్లి మండలంలో మూసీనదిపై 1954లో ప్రారంభించి 1961లో పూర్తిచేశారు. ప్రధాన కాలువ 64కిలోమీటర్ల పొడువు ఉంది.
- టేకుమట్ల వంతెన వరకు ప్రవహిస్తుంది. కుడి కాల్వ 31కి.మీ. ఎడమ కాలున 34కి.మీ. సాగి 61 గ్రామాలలోని పొలాలకు నీరందిస్తుంది. దాదాపు 30 వేల ఎకరాలు సస్యశ్యామలమవుతున్నాయి.

ఆలీ సాగర్ ఎత్తిపోతల పథకం

- జలయజ్ఞంలో భాగంగా రాష్ట్రంలో ప్రారంభించిన తొలి ఎత్తిపోతల పథకం ఆలీ సాగర్.
- నిజామాబాద్ జిల్లాలో ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన పథకం.
- గోదావరి నదిపై ఉన్న శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీటిని (720 క్యూసెక్కులు) ఎత్తిపోతల ద్వారా తరలించడం.
- ఈ ప్రాజెక్టు ఆయకట్టు 53,793 ఎకరాలు.
- లబ్ధి పొందే మండలాలు ఆరు. 1) నవీపేట్ 2) రేంజల్ 3) యెడపల్లి 4) నిజామాబాద్ 5) బీచ్‌పల్లి 6) మాక్లూర్.
- నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కోస్లి గ్రామం వద్ద గోదావరి నదిపై ఎత్తిపోతల పథకం మొదటి పంప్ హౌస్ నిర్మించారు. రెండో పంప్ హౌస్ రెంజల్ మండలం తాడ్‌బిలోలిలో, మూడో పంప్ హౌస్ ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లో నిర్మించారు.
- జాన్కంపేట్ నుంచి ఎత్తిపోతల నీటిని కాల్వల ద్వారా తీసుకువచ్చి నిజాంసాగర్ ప్రధాన కాలువలో కలిపారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు:

- నిజామాబాద్ జిల్లాలో పోచంపాడు వద్ద గోదావరి నదిపై శ్రీరాంసాగర్‌ను నిర్మించారు. స్థానికంగా శ్రీ కోదండరామ స్వామి ఆలయం ఉండడంతో ఈ ప్రాజెక్టు శ్రీరాంసాగర్‌గా పేరు పొందింది.
- ఈ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు వరప్రదాయినిగా జీవనాధారమైంది.
- నిజామాబాద్ జిల్లాలోని నందిపేట, ఆర్మూర్, నవీపేట, బాల్కొండ మండలాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని లోకేశ్వరం, దిలావల్‌పూర్, నిర్మల్ మండలాల్లో పలు గ్రామాల ప్రజలు సర్వస్వం త్యాగం చేయగా రూపుదాల్చిన ఈ ప్రాజెక్టుకు 1963లో నాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. గోదావరి నదికి అడ్డంగా ఆనకట్ట నిర్మించారు.
- 1978లో నిర్మాణం పూర్తయి అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. మొత్తం 18 లక్షల ఎకరాలకు నీరందించే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఖరీఫ్‌కు 9.5 లక్షల ఎకరాలు, రబీలో ఏడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిస్తోంది. దీని యొక్క కాలువలు కాకతీయ, సరస్వతీ, లక్ష్మి.

అర్గుల రాజారాం ఎత్తిపోతల పథకం (గుత్ప)

- గోదావరి నది పైన శ్రీరామసాగర్ నీటి ద్వారా ఆయకట్టు స్థిరీకరణ.
- ఈ ప్రాజెక్టు యొక్క ఆయకట్టు 38,792 ఎకరాలు.
- నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఉమ్మెడ వద్ద గోదావరి నదిపై మొదటి పంప్ హౌస్ నిర్మాణం జరిగింది.
- రెండో పంప్ హౌసు మోర్తాండ్ మండలం ధర్మోరం గ్రామం వద్ద నిర్మించారు.
- జలయజ్ఞంలో భాగంగా రాష్ట్రంలో ప్రారంభించిన రెండో పథకం గుత్ప ఎత్తిపోతల పథకం.

నిజాం సాగర్

- కామారెడ్డి జిల్లా, అచ్చంపేట వద్ద మంజీర నదిపై నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మితమైంది. 1923లో అప్పటి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నేతృత్వంలో బంజపల్లి వద్ద పరిసర 40 గ్రామాలను ఖాళీ చేసి ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టును 29.72 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. కాని 1972లో నిర్వహించిన హైడ్రోలాజికల్ సర్వే ప్రకారం ఈ రిజర్వాయర్ సామర్థ్యం కేవలం 11.79 టిఎంసీలు మాత్రమే. వాస్తవంగా 17.91 టీఎంసీల మేర మేట పేరుకుపోయింది.
- దీని యొక్క కాలువలు రెండు. అవి: 1) మహబూబ్‌నగర్ కుడికాలువ 2) ఫతేనహర్ ఎడమ కాలువ
- లబ్ధిపొందే మండలాలు - నిజాంసాగర్, కోట్‌గిరి, ఎడ్‌పల్లి, మక్లూర్, జాక్రీన్‌పల్లి, బాన్సువాడ, వర్ని, నిజామాబాద్, పెంజల్, వెల్పూర్, బిరకూర్, బోధన్, డిచ్‌పల్లి, నందిపేట, బాల్కొండ (నిజామాబాద్ జిల్లా)
- మంజీర నది వద్ద సింగూరు మిగులు జలాలను ఆధారంగా చేసుకొని ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. మూడు కిలోమీటర్ల పొడవు, 14 అడుగుల వెడల్పుతో ఆనకట్ట నిర్మించారు.
- నవాబ్ అలీ సహజంగ్ బహదూర్ పర్యవేక్షణలో 1931లో నిర్మాణం పూర్తయింది.
- 2.75 లక్షల ఎకరాలకు నీరందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రస్తుతం 2,31 లక్షల ఎకరాలకు అందించగలుగుతోంది. నిజాం పాలనలో కట్టించినందుకు ఈ ప్రాజెక్టును నిజాం సాగర్‌గా నామకరణం చేశారు.
- ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యంతోబాటు పర్యాటకులను అలరించే ఆహ్లాదకరమైన సుందరమైన వనం ఉంది.

జూరాల ప్రాజెక్టు

- కృష్ణా నదిపై తెలంగాణలో మొదటి ప్రాజెక్టు బహుళార్థ సాధక ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్టును 11.94 టిఎంసీల సామర్థ్యంతో 1984లో నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు ప్రస్తుతం జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని రేవులపల్లి గ్రామం వద్ద కలదు.
- ఈ ప్రాజెక్టు పూర్తి పేరు - ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్టు ద్వారా 221.40 ఎమ్.డబ్ల్యు. జలవిద్యుత్ ఉత్పత్తి అవుతుంది.
- ఈ ప్రాజెక్టు యొక్క ఆయకట్టు 1.02 లక్షల హెక్టార్లు.
- ఈ ప్రాజెక్టు ద్వారా (ఎన్.టి.ఆర్. కాలువ) ఎడమ కాలువ కింద 26,103 హెక్టార్లు (నల్ల సోమాద్రి కాలువ) కుడి కాలువ క్రింద 15,257 హెక్టార్లకు నీటి పారుదల అవసరాలను తీరుస్తుంది. (41,360 హెక్టార్లు)
- దేశంలోనే అత్యధిక బ్లాకులు ఉన్న ప్రాజెక్టు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు (బ్లాకులు - 84).

రాజోలి బండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్)

- ఈ ప్రాజెక్టు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉమ్మడి ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్టును తుంగభద్ర నదిపై కర్ణాటకలోని రాయచూర్ జిల్లా మన్వి తాలుకాలోని రాజోలిబండ గ్రామం వద్ద నిర్మించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 87,500 ఎకరాలకు నీటిని అందించడం జరుగుతుంది.
- ఈ ప్రాజెక్టు నిర్మాణం నిజాంల పాలన కాలంలో క్రీ.శ. 1946లో ప్రారంభించగా 1958లో పూర్తి అయినది.
- ఈ ప్రాజెక్టులు నీటిని 143 కి.మీ.లు ఆర్‌డిఎస్ కాలువ ద్వారా గద్వాల మండలంలోని 8 గ్రామాలకు, అలంపూర్ మండలంలోని 67 గ్రామాలకు అందించడం జరుగుతుంది.

కడెం రిజర్వాయర్

- నిర్మల్ జిల్లాలోని కడెం మండలం పెద్దూర్ గ్రామ సమీపంలో ఈ భారీ ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్ట్ నీటి వినియోగం - 13.243 టీ.ఎమ్.సి
- లబ్ధి పొందె మండలాలు- కడెం, జన్నారం, దండెపల్లి, లక్షెట్టిపేట, మంచిర్యాల.

లోయర్ మానేర్ రిజర్వాయర్

- కరీంనగర్ జిల్లాలోని గోదావరి ఉపనది అయిన మానేర్ నదిపైన ఈ జలాశయాన్ని నిర్మించారు. 1985లో ఇది పూర్తయింది. దాదాపు 27 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ఆనకట్ట అనందాన్ని ఇవ్వడమే కాకుండా కరీంనగర్ వాసులకు ట్యాంక్‌బండ్ అనుభూతి కలుగుతుంది.

సింగూరు ప్రాజెక్టు

హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ నగరాలకు త్రాగు నీరు అందించడం కోసం మంజీర నదిపై సింగూర్ ప్రాజెక్టును సంగారెడ్డి జిల్లా, కుల్కర్ మండలం, సింగూర్ గ్రామం వద్ద నిర్మించారు.

- ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టు (30 టిఎంసీలు)
- ఈ ప్రాజెక్టు ఆయకట్టు - 40,000 ఎకరాలు. (2 టిఎంసీల నీటిని సంగారెడ్డి, ఆందోల్‌లకు పంపిణీ చేస్తారు)
- ఈ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తి 15 మెగావాట్లు.
- సింగూర్ ప్రాజెక్టుకు మరొక పేరు - మొగిలిగుండ్ల బాగా రెడ్డి సింగూర్ ప్రాజెక్టు.

తెలంగాణలోని భారీనీటి పారుదల ప్రాజెక్టుల వివరాలు

తెలంగాణలోని భారీ ప్రాజెక్టులు

1. కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు
2. నిజామ్‌సాగర్ ప్రాజెక్టు
3. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు- స్టేజ్-1
4. అలీసాగర్ ఎత్తిపోతల పథకం
5. అరుగుల రాజారాం-గుత్ప ఎత్తిపోతల పథకం
6. లోయర్ మానేరు డ్యామ్
7. ఎం. బాగారెడ్డి సింగూర్ ప్రాజెక్టు
8. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్
9. మూసి ప్రాజెక్టు
10. మైలారం బాలెన్సింగ్ రిజర్వాయర్
11. బయ్యన్నవాగు బాలెన్సింగ్ రిజర్వాయర్
12. ప్రియదర్శిని (జూరాల) ప్రాజెక్టు
13. రాజోలి బండ డైవర్షన్ స్కీం

నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులు

14. ప్రాణహిత-చేవెళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
15. FFC From SRSP
16. శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
17. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్
18. మధ్య మానేరు జలాశయం
19. బాగారెడ్డి సింగూర్ ప్రాజెక్టు కాలువలు
20. JCR GLIS
21. ఇందిరా సాగర్-రుద్రం కోట
22. రాజీవ్ సాగర్-దమ్ముగూడెం లిఫ్ట్ ఇరిగేషన్
23. దమ్ముగూడెం నాగార్జున సాగర్ టేల్పాండ్
24. ఏఎంఆర్ ప్రాజెక్టు(SLSBC)సొరంగమార్గం సహా)
25. రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం
26. మహాత్మగాంధీ-కల్వకుర్తి ఎత్తిపోతల పథకం
27. జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం
28. కోయిల్సాగర్ ఎత్తిపోతల పథకం
29. సిని నరసింహరావు -కంతాలపల్లి సుజల స్రవంతి
30. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు స్టేజ్-11

భారీ ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నవి

31. దిగువ పెన్‌గంగ ప్రాజెక్టు
32. ఇచంపల్లి ప్రాజెక్టు
33. మున్నేరు రిజర్వాయర్
34. డిండి ఎత్తిపోతల పథకం
35. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం
36. కాళేశ్వరం ప్రాజెక్టు

తెలంగాణలోని మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల వివరాలు

1. స్వర్ణ ప్రాజెక్టు
2. వట్టివాగు ప్రాజెక్టు
3. సత్నాల ప్రాజెక్టు
4. చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్)
5. పిపి రావు ప్రాజెక్టు (ఎర్రవాగు)
6. గడ్డెన్న - సుద్దవాగు ప్రాజెక్టు
7. ఖానాపూర్ కాలువ (సదర్మట్)
8. రాలీవాగు ప్రాజెక్టు
9. మత్తడి వాగు ప్రాజెక్టు
10. పోచారం ప్రాజెక్టు
11. రామడుగు ప్రాజెక్టు
12. కౌలాస్ నాలా ప్రాజెక్టు
13. శనిగరం ప్రాజెక్టు
14. బొగ్గులవాగు ప్రాజెక్టు
15. ఎగువ మానేరు ప్రాజెక్టు
16. నల్లవాగు ప్రాజెక్టు
17. ఘన్పూర్ ఆనకట్ట
18. రామప్ప చెరువు
19. మల్లూరువాగు ప్రాజెక్టు
20. పాకాల చెరువు
21. చలివాగు ప్రాజెక్టు
22. లక్నవరం ప్రాజెక్టు
23. వైరా ప్రాజెక్టు
24. లంకా సాగర్ ప్రాజెక్టు
25. పెద్దవాగు ప్రాజెక్టు
26. బయ్యారం ప్రాజెక్టు
27. తాళి పేరు ప్రాజెక్టు
28. గుండ్లవాగు ప్రాజెక్టు
29. పాలేరు ప్రాజెక్టు
30. కోటిపల్లి ప్రాజెక్టు
31. జుట్‌పల్లి ప్రాజెక్టు
32. లక్నపూర్ ప్రాజెక్టు
33. దిండి ప్రాజెక్టు
34. ఆసిఫ్ నహర్ ప్రాజెక్టు
35. ఉత్యూర్ మారేపల్లి ప్రాజెక్టు
36. సరళ సాగర్ ప్రాజెక్టు
37. కోయిల్ సాగర్ ప్రాజెక్టు

మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులు - నిర్మాణ దశలో ఉన్నవి

38. పెద్దవాగు ప్రాజెక్టు (కోమ్రంభీం)
39. పెద్దవాగు ప్రాజెక్టు (జగన్నాధపూర్)
40. గొల్లవాగు ప్రాజెక్టు
41. పెద్దవాగు ప్రాజెక్టు (నీల్వాయి)
42. చౌటుపల్లి హనుమంతరెడ్డి ఎత్తిపోతల పథకం
43. లెండి
44. మోడికుంటవాగు ప్రాజెక్టు
45. పాలెంవాగు ప్రాజెక్టు
46. కిన్నెరసాని డ్యామ్ కాలువ